RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 05.11.2026 | సంపుటి:13 సంచిక:106 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698



ముంచెత్తిన మురసు

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో జనజీవనం అతలాకుతలం



బేతుపల్లి చెరువులో రెండు బోట్లు పల్టీ, 11 మంది రెస్క్యూ సిబ్బంది గల్లంతు

సీఎం రేవంత్‌రెడ్డి ఆరా.. కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశం

భద్రాచలం/కొత్తగూడెం/సత్తుపల్లి/దమ్మపేట(జనంసాక్షి నెట్‌వర్క్):

తుఫాను ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ముసురు ముంచెత్తడంతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు నీట మునగగా, పలు ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. ఇదే సమయంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో జాలర్లను కాపాడేందుకు వెళ్లిన 11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది గల్లంతయ్యారు.

మిగతా 2లో..





రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భద్రాద్రికొత్తగూడెం జిల్లా అశ్వరావుపేటలో వరదధాటికి కోట్టుకుపోయిన రహదారి.. భారీ వర్షాలకు రోడ్డుపై కూలిపోయిన కరెంటు స్తంభం

సదర్‌కు రాష్ట్ర పండుగ హోదా కల్పించాం

యాదవుల సంస్కృతినిగౌరవించాం • సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం : సీఎం రేవంత్ రెడ్డి

సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవం.. ఇది ఓ అద్భుతమైన కార్యక్రమం. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పండుగలాగా జరుపుతున్నాం. మా ప్రభుత్వం వచ్చాక యాదవులను అన్ని విధాలుగా గౌరవిస్తున్నాం. తెలంగాణలో అన్నీ రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారు. యాదవులకు సముచిత స్థానం కల్పిస్తున్నాం. నా చుట్టూ ఎప్పుడూ యాదవులు ఉంటారు. మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేసుకొని వేడుకకు హాజరయ్యాను. నగరంలో శాంతి భద్రతలు కాపాడుతూ, అందరిని ఒక తాటిపై ఉంచాం - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఘనంగా సదర్ వేడుకలు జరిగాయి. సదర్ సమ్మేళనానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. సదర్ వేడుకలకు రూ.5 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియం సదర్ వేడుకలతో సందడిగా మారింది. యాదవుల సంప్రదాయాలు, సంస్కృతి, ఐక్యతను చాటిచెప్పేలా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో శ్రీకృష్ణ సదర్ సమితి సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి యాదవులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన దున్నరాజుల ప్రదర్శనలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, ఎంపీ మల్లు రవి, ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, బిహార్ మాజీ ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్‌లు హాజరై సదర్ ఉత్సవాల ప్రత్యేకత, సంస్కృతి గొప్పతనం గురించి మాట్లాడారు.రాష్ట్ర ప్రజలందరికి

మిగతా 2లో..

యూనిఫాంలపై విద్యార్థుల అభిప్రాయాలు సేకరించండి

యూనిఫాంల రంగు, డిజైన్లపై ప్రత్యేక దృష్టి

యూనిఫాం.. కిట్ల పంపిణీకి ఎస్‌వోపీ రూపొందించండి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



2లో..

'అగ్నివీర్'ల పదవీకాలం

ఇకపై ఆరేళ్లు

మరో రెండేళ్లు పొంగించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ(జనంసాక్షి): సాయుధ దళాల్లో బలగాల నియామకం కోసం చేపట్టే అగ్నిపథ్ పథకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'అగ్నివీర్'ల పదవీకాలాన్ని రెండేళ్లు పొడిగించింది. దీంతో ప్రస్తుతం నాలుగేళ్లుగా ఉన్న పదవీకాలం ఆరేళ్లు అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 31న త్రివిధ దళాల నుంచి సుమారు 18 వేల అగ్నివీర్‌లు బయటకు రానున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని

మిగతా 2లో..



ప్రభుత్వ భూములను మాయం చేస్తున్నారు



సీఎం రేవంత్ భూములు అమ్మే బ్రోకర్‌గా మారారు:కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): భూములు అమ్మే బ్రోకర్ రేవంత్ రెడ్డిని సీఎం చేస్తే అలానే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దామోదర్ రెడ్డి తన అనుచరులతో కలిసి భారీగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి

మిగతా 2లో..



మహేశ్వరం మెడికల్ కాలేజీపై అసెంబ్లీలో నిలదీస్తాం

పందుల కొట్టం కంటే హీనంగా కళాశాల పరిస్థితి

మూడేళ్లయినా శాశ్వత భవనాల నిర్మాణంలో పురోగతి శూన్యం : హరీశ్

2లో..

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి

అండగా ఉంటాం

తల్లికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు.. రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కోటి రూపాయల ప్రమాద బీమా

:రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ సిటీ, నవంబర్ 04 (జనంసాక్షి) : ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం అన్ని విధాలుగా అండగా ఉంటాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వం,ఆర్టీసీ తరఫున

మిగతా 2లో..



ట్రంప్‌కు చుక్కెదురు

మధ్యంతర ఎన్నికల ఫలితాల్లో అత్యధిక స్థానాల్లో దూసుకెళ్తున్న డెమోక్రాట్లు



బ్యాలెట్‌లో నా పేరు ఉంటే గెలిచేవాళ్లం

అయినా ఫలితాలను స్వాగతిస్తున్నా

డెమోక్రాట్లతో కలిసి పనిచేసేందుకు సిద్ధమే

ఫలితాలపై ట్రంప్ కీలక పోస్ట్



2లో..

వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. ఇప్పటివరకు వెలువడిన ఫలితాల్లో డెమోక్రాట్లు అత్యధిక స్థానాల్లో దూసుకెళుతున్నారు. అయితే, ఈసారి ఎన్నికల్లో భారతీయ అమెరికన్లు డెమోక్రటిక్ పార్టీ వైపు మొగ్గు చూపినట్లు ఓ సర్వేలో వెల్లడైంది. ఎన్నికలకు ముందు యూగవ్‌తో కలిసి కార్నెగీ నిర్వహించిన 'ఇండియన్ అమెరికన్ యాటిట్యూడ్స్ సర్వే'లో ఈ విషయం వెల్లడైంది. సర్వే ప్రకారం.. 62 శాతం మంది భారతీయ అమెరికన్లు తమ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌లో డెమోక్రటిక్ అభ్యర్థికే ఓటేస్తామని వెల్లడించారు. కేవలం 19 శాతం మంది మాత్రమే రిపబ్లికన్లకు మద్దతు ఇస్తామని తెలిపారు. 2024 అధ్యక్ష ఎన్నికల సమయంలో 30 శాతం మంది రిపబ్లికన్లకు మద్దతు తెలపగా.. ఇప్పుడది 19 శాతానికి పడిపోయింది. ట్రంప్ వలస విధానాలు, దేశ ఆర్థిక వ్యవస్థను నడుపుతున్న తీరు, అమెరికా – భారత్ సంబంధాల పట్ల అత్యధిక మంది అసంతృప్తి వ్యక్తంచేసినట్లు సర్వే పేర్కొంది. 40 ఏళ్ల పైబడిన భారతీయ అమెరికన్ పురుషుల్లో రిపబ్లికన్ పార్టీకి మద్దతు ఇచ్చే వారి సంఖ్య 16 శాతానికి

అమెరికన్లు యుద్ధం వద్దంటున్నారు

అదే ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోంది:ఇరాన్

రాముడిపేర రాజకీయ వ్యాపారం

ఇంకెన్నాళ్లు?

కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్

న్యూఢిల్లీ(జనంసాక్షి): వీబీ జీరాంజీ ఉపాధి హామీ పథకంలో నకిలీ హాజరు నమోదు చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ భాజపాపై విమర్శలు గుప్పించారు. ఇంకెన్ని రోజులు రాముడి పేరు చెప్పుకొని పాపాలు చేస్తారని భాజపాని ప్రశ్నించారు.

మిగతా 2లో..



మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ ఇండ్లు

రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్లు : మంత్రి పొంగులేటి



హైదరాబాద్(జనంసాక్షి): రాష్ట్రంలో మరో నాలుగు నగరాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిజామాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్ కార్పొరేషన్ల పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు చెప్పారు. హైదరాబాద్ తరహాలో అల్పాదాయ కుటుంబాలకు జీ ప్లస్ 5 అంతస్తుల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించనున్నట్లు వివరించారు. మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులతో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, హౌసింగ్ అంశాలపై ఇన్‌ఛార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి సమీక్ష నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా గృహ ప్రవేశాలు జరిగిన ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి సంబరాలు జరపాలని మంత్రి తెలిపారు. 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' పేరుతో నిర్వహించే సంబరాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేక పోయినప్పటికీ.. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్న మంత్రి పొంగులేటి.. ఇప్పటివరకు రూ.22,500 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించగా.. అందులో 2,21,500 గృహ ప్రవేశాలు జరిగాయని.. మరో 1.90 లక్షల గృహాలు వివిధ దశల్లో ఉన్నట్లు వివరించారు. రెండో విడతలో మరో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. హైదరాబాద్ కోర్ అర్బన్‌లో లక్ష ఎల్ఐజీ ఫ్లాట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



ఏసీబీ అదుపులో అవినీతి ఎస్సై

రూ. 40 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ రమేష్

2లో..



హర్మూజ్‌లో భారత్‌కు రైట్ రైట్..

దేశానికి ప్రత్యేక మినహాయింపునిచ్చిన ఇరాన్

టెహ్రాన్(జనంసాక్షి): భారత్ సహా తమ మిత్ర దేశాల నౌకలకు హర్మూజ్‌లో ప్రత్యేక మినహాయింపు ఇస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ విధాన కమిటీ డిప్యూటీ ఛైర్మన్ అమీర్ హయత్ పేర్కొన్నారు. ఇతర దేశాల వాణిజ్య నౌకలపై విధించిన ఆంక్షలు లేకుండానే..ఇకపై భారత్, చైనా,

మిగతా 2లో..



అంతర్జాతీయ ఫేక్ కాల్‌సెంటర్ గుట్టురట్టు

2లో..

డీప్‌టెక్ ఆవిష్కరణలకు తెలంగాణలో

అపార అవకాశాలు

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

పెట్టుబడులకు అనుకూల విధానాలు, అత్యుత్తమ మౌలిక వసతులతో పారిశ్రామిక అభివృద్ధికి తెలంగాణ: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
05.11.2026

'అగ్నివీర్'ల పదవీకాలం ఇక ఆరేళ్లు

కేంద్ర క్యాబినెట్ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్.రాజా సుబ్రమణి ఓ ప్రకటన చేశారు. సాయుధ దళాల్లో సేవలను కొనసాగించడానికి అగ్నివీరులందరికీ అవకాశం కల్పిస్తామన్నారు. రెండేళ్ల వెసులుబాటు పొందుతున్న అగ్నివీర్‌లకు వారి పనితీరు మదింపు ఆధారంగా శాశ్వత ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.ప్రస్తుతం అగ్నివీరులు నాలుగేళ్ల పాటు సైన్యంలో సేవలు అందించిన తర్వాత.. వారి ప్రతిభ, సంస్థాగత అవసరాల ఆధారంగా కేవలం 25శాతం మంది మాత్రమే సాయుధ దళాలలో శాశ్వత నియామకానికి అర్హత పొందే వీలుంది. మిగిలిన వారు పౌర ఉద్యోగాలలో చేరడానికి వీలుగా ఆర్థిక ప్యాకేజీ, నైపుణ్య ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారు.

ప్రభుత్వ భూములను మాయం చేస్తున్నారు

గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మియాపూర్ భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో కబ్జా పెడితే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రముఖ న్యాయవాది వైద్యనాథన్ పెట్టి 550 ఎకరాల భూమి కోసం కేసు వాదించి భూమిని కాపాడామన్నారు.ఇటీవల సుప్రీంకోర్టు ఆ భూమి ప్రభుత్వానిది అని తీర్పు ఇచ్చింది. తీర్పు వచ్చిన వెంటనే ఆఘమేఘాల మీద రేవంత్ రెడ్డి ఢిల్లీలో ప్రెస్ మీట్ పెట్టి ఆ భూములు అమ్మేస్తున్నా అని చెప్తున్నాడని విమర్శించారు. మూడేండ్లలో హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ఒక్క నిర్మాణం అయినా చేపట్టిందా అని ప్రశ్నించారు. కేసీఆర్ లక్షల డబుల్ బెడ్ ఇండ్లు నిర్మించారని గుర్తు చేశారు.

ఏసీబీ అదుపులో అవినీతి ఎస్సై

ఆదిలాబాద్ (జనంసాక్షి): ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ ఎస్సై రమేష్ లంచం తీసుకుంటూ ఏసీబీ కి పట్టుబడ్డారు. ఇటీవల జరిగిన యువతి ఆత్మహత్య కేసులో నిందితులను తప్పించడానికి లంచం డిమాండ్ చేయడంతో ఫిర్యాదుదారులు ఏసీబీని ఆశ్రయించారు.బుధవారం గ్రామ పరిసర ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న పెట్రోల్ బంక్ వద్ద సెంటరింగ్ బాక్స్ కింద రూ.40 వేలు లంచం డబ్బు పెట్టాలని సూచించిన మేరకు ఫిర్యాదుదారుడు నగదును ఉంచాడు. ఎస్సై ఆ నగదును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఎస్సైని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి కరీంనగర్‌లో ఏసీబీ కోర్టులో హాజరుపరిచామని ఏసీబీ ఉన్నతాధికారులు తెలిపారు.

రాముడిపేర రాజకీయ వ్యాపారం ఇంకెన్నాళ్లు?

క్లోన్ యాప్‌ల ద్వారా నకిలీ హాజరు నమోదు చేస్తున్న ఉదంతాలు పదే పదే బయటపడుతున్నాయని, ఇది తీవ్రమైన అంశమని ఆయన పేర్కొన్నారు. "గతంలో అయోధ్యలో రాముడి పేరుతో విరాళాలు సేకరించారు. ఇప్పుడు కూడా రాముడి పేరు చెప్పుకొని పాపాలు చేస్తున్నారు. దేవుడి పేరుపై చేయడానికి ఇంకెంత పాపం మిగిలి ఉందని" భాజపాను ప్రశ్నించారు. ఇది కేవలం అవినీతి మాత్రమే కాదని, దేవుడి పేరుతో పేద ప్రజల నమ్మకాన్ని, హక్కులను, ఉపాధిని మోసపరచడమని అన్నారు.

అంతర్జాతీయ ఫేక్ కాల్‌సెంటర్ గుట్టురట్టు

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్‌లోని ఓ అంతర్జాతీయ నకిలీ కాల్‌సెంటర్ గుట్టును ఈడీ అధికారులు బయటపెట్టారు. ఈ కాల్‌సెంటర్ నిర్వహిస్తున్న హర్షల్ రావల్ ముఠా సభ్యులు అమెరికా పౌరులే లక్ష్యంగా మూడేళ్లుగా వ్యవస్థీకృత సైబర్ మోసాలకు పాల్పడుతున్నారు. హర్షల్ రావల్ తొలుత హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఫేక్ కాల్ సెంటర్ ఏర్పాటుచేశాడు. దీనిపై పోలీసులు దాడులు చేయడంతో పంజాబ్‌లోని పాటియాలాకు మకాం మార్చేశారు. అక్కడ మరో ఫేక్ కాల్ సెంటర్ ఏర్పాటుచేసి మోసాలు కొనసాగించారు. ఈ కేసులో హర్షల్ రావల్, ప్రణవ్ పితాదియా, చేతన్ ముంజల్‌ను ఈడీ అధికారులు పాటియాలాలో అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. దీనిపై దర్యాప్తు చేయగా వేలాది మంది అమెరికా పౌరులను మోసం చేసినట్లు గుర్తించారు. ఇలా సంపాదించిన సొమ్మును తరలించేందుకు వందల సంఖ్యలో మ్యూల్ బ్యాంకు ఖాతాలను వినియోగించారు. అమెరికా నుంచి క్రిప్టో కరెన్సీ రూపంలో డబ్బులు స్వీకరించి, హవాలా మార్గాల్లో నగదు బదిలీ చేసుకున్నారు. దాదాపు రూ.400 కోట్ల మేర క్రిప్టో లావాదేవీల ద్వారా మోసాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు.

మహేశ్వరం మెడికల్ కాలేజీపై అసెంబ్లీలో నిలదీస్తాం

రంగారెడ్డి, నవంబర్ 4 (జనంసాక్షి): వైద్య విద్యను అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం మహేశ్వరం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో విద్యార్థుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ శాసనసభా పక్ష నేత తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. విజన్ 2047, ఫ్యూచర్ సిటీ అంటున్న సీఎం రేవంత్‌రెడ్డికి విద్యార్థుల కష్టాలు కనిపించడం లేదా అని నిలదీశారు.మూడో రోజుకు చేరిన విద్యార్థుల ఆందోళనకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో కలిసి హరీశ్‌రావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 26 నెలలుగా నీటి బిల్లులు, 24 నెలలుగా అద్దె చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. విద్యార్థులకు బస్సు సౌకర్యం లేక ఆసుపత్రికి వెళ్లేందుకు 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మహేశ్వరం మెడికల్ కాలేజీకి 25 ఎకరాల భూమి, రూ.175 కోట్ల నిధులు కేటాయించామని, 400 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సంకల్పించామని తెలిపారు. మూడేళ్లు కావస్తున్నా శాశ్వత భవనాల నిర్మాణంలో పురోగతి లేదని, టెండర్ల ప్రక్రియ కూడా ముందుకు సాగలేదని విమర్శించారు.జిల్లా కలెక్టర్ వెంటనే కళాశాలను సందర్శించి సమస్యలను పరిశీలించాలని, రెండు నెలల్లో పరిష్కారంపై రాతపూర్వక హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు లేని ప్రత్యామ్నాయ ప్రదేశంలో కళాశాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంశాన్ని లేవనెత్తి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు హెచ్చరించారు.

ముంచెత్తిన మురసు



దీంతో ఉమ్మడి జిల్లాలో ఆందోళనకర వాతావరణం నెలకొంది.వైరాలో దెబ్బతిన్న పంటలు.భారీ వర్షాలకు ఖమ్మం జిల్లా వైరా ప్రాంతంలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రధానమైన వైరా జలాశయానికి ఎగువ నుంచి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. నల్లమడ వాగు గండి పడి వరద రహదారులపైకి చేరిన దృశ్యాలను కూడా మీడియా ప్రసారం చేసింది.బేతుపల్లిలో ఏం జరిగింది×భారీ వర్షాలకు సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువు అలుగు పారుతోంది. చేపలు బయటకు వెళ్లిపోకుండా వలలు ఏర్పాటు చేసేందుకు ఐదుగురు జాలర్లు చెరువులోకి వెళ్లారు. వరద ఉద్ధృతితో వారు అక్కడే చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు తొలుత ముగ్గురు ఫైర్ సిబ్బంది బోటులో వెళ్లగా, ఆ బోటు మొరాయించి వారూ చిక్కుకున్నారు.దీంతో కొత్తగూడెం ఎస్‌డీఆర్ఎఫ్‌కు చెందిన ఆరుగురు, మరో నలుగురు ఫైర్ సిబ్బంది, ఇద్దరు గైడ్‌లు రెండు బోట్లలో సహాయానికి బయలుదేరారు. వీరు మొదట బోటులో చిక్కుకున్న ముగ్గురు అగ్నిమాపక సిబ్బందిని సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చారు. అనంతరం మత్స్యకారులను తీసుకురావడానికి వెళ్తుండగా రెండు బోట్లూ పల్టీలు కొట్టాయి. వాటిలోని 11 మంది గల్లంతయ్యారు.సహాయక చర్యలు×విషయం తెలిసిన వెంటనే కలెక్టర్ దివాకర్ టీఎస్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి ఘటనా స్థలానికి చేరుకుని సిబ్బందితో కలిసి సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. భద్రాచలం నుంచి ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని రప్పించి, బోటు సహాయంతో చిక్కుకున్న వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. డ్రోన్ ద్వారా లైఫ్ జాకెట్లు పంపేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. చెరువులో చిక్కుకుపోయిన జాలర్లు సురక్షితంగా ఉన్నట్లు సమాచారం.×సీఎం ఆరా×ఈ ఘటనపై హైదరాబాద్ నుంచి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చేందుకు అన్ని చర్యలూ ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సూచించారు.×దమ్మపేటలో చెట్టెక్కి ప్రాణాలు కాపాడుకున్న మహిళ×మరోవైపు దమ్మపేట మండలంలోని శ్రీరాంపురం చెరువు వరదలో చిక్కుకున్న మహిళను రెస్క్యూ టీమ్ రక్షించింది. దురదపాడు గ్రామానికి చెందిన నాగమణి బుధవారం ఉదయం పొలంలో పని చేసేందుకు వెళ్లింది. ఆ సమయంలో పక్కనే ఉన్న మల్లెపూల వాగు ఉద్ధృతంగా ప్రవహించడంతో ఆమె వరదలో చిక్కుకుపోయింది. ప్రాణాలు కాపాడుకునేందుకు సమీపంలోని చెట్టు పైకి ఎక్కి కూర్చుంది. వరద ఉద్ధృతి కారణంగా స్థానికులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.సమాచారం అందుకున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హుటాహుటిన జిల్లా కలెక్టర్ అంకిత్‌తో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీవో మధు రెస్క్యూ టీమ్‌తో చెరువు వద్దకు చేరుకుని మహిళను సురక్షితంగా కాపాడారు.

ఉమ్మడి ఖమ్మంజిల్లాలో భారీ వర్షాలు

మురసు తుపాను ప్రభావంతో భద్రాద్రి కొత్తగూడెంలో కుండపోత వర్షాలు కురిశా యి. వాగులు వంకలూ పొంగిపొర్లాయి. ప లు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వందల ఎకరాల్లో పంట నీట మునిగింది. వర్ష తీవ్రత దృష్టిలో ఉంచుకొని అధికా రులు స్థానికంగా విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. వర్షాల కారణంగా ఎలాంటి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వం ౕరావు అధికారులను ఆదేశించారు.మురసు తుపాను తీరం దాటిన తర్వాత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనిపలు మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. నిన్న ఉదయం నుంచి చెదురు మదురుగా పడిన వర్షాలు రాత్రి నుంచి కుండపోతగా మారాయి. కొన్ని మండలాల్లో 16 నుంచి 20 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. అశ్వరావుపేట, ములకలపల్లి, దమ్మపేట, దమ్ముగూడెం, చర్ల, భద్రాచలం కొత్తగూడెం మండలాల్లో కురిసిన వర్షాలకు వాగులు వంకలూ పొంగి ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాలకు అశ్వారావువేట మండలం పెదవాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. 4500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండటంతో అధికారులు వరద నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు రింగ్ బండ్ కట్టకు గండి పడింది. వేదాంతపురంలో ప్రధాన రోడ్డుపై వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

భారీ వరదతో రహదారిపై నిలిచిన రాకపోకలు

ములకలపల్లి మండలం కంపగూడెం అడ్డరోడ్డు సమీపంలోని, పాములేరు వాగుపై వంతెన ఇప్పటికే కూలిపోయిన నేపథ్యంలో నిర్మించిన తాత్కాలిక రహదారి కోతకు గురైంది. పాల్వంచ దమ్మపేట ప్రధాన రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దమ్మపేట మండలం ప్రధాన రహదారిపైకి వరద నీరు వచ్చి చేరడంతో మండలవాసులు తీవ్ర ఇక్కట్ల పాలైయ్యారు. దమ్మపేట శివారు నెమలిపేట కాలనీ సమీపంలోని నల్ల వీరయ్య చెరువు అలుగుకట్ట తెగి వరద నీరు భారీగా పారుతుంది. డిప్యూటీ శిక్షణ తహసీల్దార్ మురళి కాలనీ ప్రజలను పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ మండలంలోని వరి, పత్తి ఆయిల్ పామ్ తోటలు వందల ఎకరాల్లో నీట మునిగాయి. ఈ నేపథ్యంలో ములకలపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

బేతుపల్లి చెరువు ఘటనపై మంత్రి పొంగులేటి నిరంతర పర్యవేక్షణ

ఖమ్మం, (జనంసాక్షి) : సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు ప్రవహిస్తున్న నేపథ్యంలో సహాయక చర్యలకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది పరిస్థితిపై రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం నిరంతరం పర్యవేక్షించారు. మురసు తుపాను ప్రభావంతో చెరువు వద్ద చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎస్డీఆర్ఎఫ్ బృందం బోటు తిరగబడిన విషయం తెలుసుకున్న మంత్రి.. వెంటనే కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

డీప్‌టెక్ ఆవిష్కరణలకు తెలంగాణలో అపార అవకాశాలు

హైదరాబాద్(జనంసాక్షి):డీప్‌టెక్ రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ వాటిని ప్రజల జీవితాల్లో ప్రత్యక్ష మార్పులు తీసుకొచ్చే ఉత్పత్తులు, సేవలుగా తీర్చిదిద్దడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేసినప్పుడే సాంకేతిక ఆవిష్కరణలకు నిజమైన సార్థకత లభిస్తుందని పేర్కొన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్య సాధనలో సాంకేతిక ఆవిష్కరణలు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు.బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో బుధవారం నిర్వహించిన ఈఎఅఅఎ ఏ100 వేడుకలు, తెలంగాణ డీప్‌టెక్ లీడర్‌షిప్ సమ్మిట్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పాల్గొన్న ఆయనకు ఈఎఅఅఎ చైర్మన్ వీవీఆర్ రాజు, ఈఱఅఎ అధ్యక్షురాలు కేకే మహేశ్వరి, ఈఎఅఅఎ మాజీ అధ్యక్షురాలు, అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు.??ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణను పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూలమైన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం స్పష్టమైన లక్ష్యాలు, విధానాలతో ముందుకు సాగుతోందన్నారు. 2034-35 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పరిశ్రమలకు అనుకూలమైన విధానాలను రూపొందిస్తున్నట్లు వివరించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐఐటీలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, ట్రిపుల్ ఐటీలు, ప్రముఖ ఇంజినీరింగ్ విద్యాసంస్థలు రాష్ట్రానికి ప్రధాన బలమని చెప్పారు. రీజినల్ రింగ్ రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో పాటు హిల్ట్ పాలసీ వంటి వినూత్న విధానాలు పారిశ్రామిక అభివృద్ధికి మరింత ఊతమిస్తాయని తెలిపారు.సాఫ్ట్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్, ఇంజినీరింగ్ వంటి విభిన్న రంగాలకు హైదరాబాద్ కేంద్రంగా ఉందని, ఈ సామర్థ్యాలన్నింటినీ సమన్వయం చేయడం ద్వారా తెలంగాణ డీప్‌టెక్ రంగంలో ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు వేదికగా ఎదగగలదని అన్నారు. ఒక పరిశోధకుడు అభివృద్ధి చేసిన వైద్య నిర్ధారణ పరికరానికి వైద్యులు, ఇంజినీర్లు, తయారీదారుల సహకారం లభించినప్పుడే అది సామాన్యులకు అందుబాటులోకి వస్తుందని వివరించారు. ప్రయోగశాలలో రూపొందిన ఆవిష్కరణకు తొలి వినియోగదారుడు దొరకడం, పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన సదుపాయాలు లభించడం, పెట్టుబడులు సమకూరడం వంటి అంశాలు స్టార్టప్‌లకు ఎదురవుతున్న సవాళ్లని పేర్కొన్నారు. ఈ అడ్డంకులను ప్రభుత్వం, పరిశ్రమలు సంయుక్తంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి పరీక్షా కేంద్రాలు, ధ్రువీకరణ ప్రక్రియకు స్పష్టమైన మార్గదర్శకాలు, ప్రయోగాత్మక కొనుగోళ్లకు అవకాశాలు కల్పించడం ద్వారా నూతన ఆవిష్కరణలను విజయవంతమైన ఉత్పత్తులుగా మార్చవచ్చని సూచించారు.?ఇంధన రంగంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగం, విద్యుత్ నిల్వ సాంకేతికత, విద్యుత్ సరఫరా వ్యవస్థల పనితీరు మెరుగుదల వంటి అంశాల్లో డీప్‌టెక్ ఆవిష్కరణలకు విస్తృత అవకాశాలున్నాయని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసే

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటాం

మొత్తం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ తీసుకున్న నిర్ణయం మేరకు బ్యాంకు ద్వారా కోటి రూపాయల ప్రమాద బీమా కూడా కుటుంబా నికి అందుతుందని వెల్లడించారు.బుధవారం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక పార్థివదేహానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నివాళులర్పించారు.అనంతరం ప్రవళిక తల్లిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ కుటుంబ సభ్యురాలిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు.ప్రమాదం జరిగిన వెంటనే ఆర్టీసీ యాజమాన్యం స్పందించి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రవళికను కాపాడుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనకు కారణమైన వ్యక్తిపై తొలుత హత్యా యత్నం కేసు నమోదు కాగా, ప్రవళిక మృతితో హత్య కేసుగా మార్చి నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు.భవిష్య త్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నా రు.ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు కార్మికుల సంక్షేమం, భద్రతకు సమాన ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. కార్మి కులు ఎవరైనా తప్పుగా ప్రవర్తించినా, ప్రయాణికు లకు ఇబ్బంది కలిగించినా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.అయితే, ఎవరూ చట్టా న్ని చేతుల్లోకి తీసుకుని ఆర్టీసీ సిబ్బందిపై దాడుల కు పాల్పడకూడదని సూచించారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ఇప్పటికే పలు నిర్ణ యాలు తీసుకుందని గుర్తుచేశారు.

సదర్‌కు రాష్ట్ర పండుగ హోదా కల్పించాం

రేవంత్ రెడ్డి సదర్ శుభాకాంక్షలు తెలిపారు. సదర్ సమ్మేళనం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సదర్‌ను అధికారిక పండుగగా నిర్వహిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లో అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు శాంతియుతంగా, సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. సదర్ సంబురాల ద్వారా యాదవులు పండుగ నిర్వహించుకుంటారని తెలిపారు. సదర్ వేడుకలకు రూ.5 కోట్ల నిధులు కేటాయించామని వెల్లడించారు. సదర్ అంటే తెలంగాణ ఆత్మగౌరవమని, ఇది ఓ అద్భుతమైన కార్యక్రమమని సీఎం కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పండుగలాగా జరుపుతున్నామని, తమ ప్రభుత్వం వచ్చాక యాదవులను అన్ని విధాలుగా గౌరవిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో అన్నీ రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని, యాదవులకు సముచిత స్థానం కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. తన చుట్టూ ఎప్పుడూ యాదవులు ఉంటారని, మంత్రివర్గ సమావేశాన్ని వాయిదా వేసుకొని సదర్ వేడుకకు హాజరయ్యానని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి వెల్లడించారు. నగరంలో శాంతి భద్రతలు కాపాడుతూ, అందరిని ఒక తాటిపై ఉంచామని స్పష్టం చేశారు.

ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం అవ్వాలి

సదర్ ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. వ్యవసాయానికి పశుసంపద ఎంతో కీలకమని పశుసంపద అభివృద్ధి ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. సదర్ ద్వారా యాదవ సంస్కృతి ప్రపంచానికి చాటడమే కాదు, ఆర్థిక వ్యవస్థలో వారు భాగస్వామ్యం అవ్వాలని ఆకాంక్షించారు.

రిజర్వేషన్లు కల్పించాలి

యాదవ సమాజ ఐక్యత దేశవ్యాప్తంగా విస్తరించాలని బిహార్ మాజీ డిప్యూటీ సీఎం తేజస్వి యాదవ్ ఆకాంక్షించారు. జనాభా ప్రాతిపదికన అన్ని వర్గాలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతామని స్పష్టం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా హైదరాబాద్‌లో ఈ వేడుకలు నిర్వహించడం ప్రత్యేకమని ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్ అన్నారు. బలహీన వర్గాల ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

యూనిఫాంలపై విద్యార్థుల అభిప్రాయాలు సేకరించండి

హైదరాబాద్(జనంసాక్షి):

విద్యార్థులకు అందించిన యూనిఫాంలపై వారినుంచి అభిప్రాయాలు (ఫీడ్ బ్యాక్) సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు, కిట్ల పంపిణీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. గతంతో పోలిస్తే ఎంతో నాణ్యమైన యూనిఫాంలు, ఆకర్షణీయమైన రంగులు, డిజైన్లతో అందజేశామన్నారు. అయితే, ఆయా రంగులు, డిజైన్లకు సంబంధించి విద్యార్థుల నుంచి అభిప్రాయాలు (ఫీడ్‌బ్యాక్) సేకరించాలన్నారు. అలా చేస్తే ఎక్కువ మంది విద్యార్థులు కోరుకునే రంగులు, డిజైన్లకు భవిష్యత్‌లో ప్రాధాన్యమివ్వచ్చని అన్నారు. యూనిఫాంలతో పాటు టైలు, బెల్టులు, ఐడీ కార్డులు, షూలు, సాక్సులు, ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, కార్పెట్లు, స్కూల్ బ్యాగుల పంపిణీ దాదాపు పూర్తయిందని అధికారులు సీఎంకు తెలియజేశారు. ఒకట్రెండు సంస్థల పరిధిలో కొన్ని వస్తువుల పంపిణీ 95 శాతం వరకు పూర్తయిందని చెప్పారు. ఆ వస్తువుల పంపిణీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాదికి విద్యార్థులకు అందజేసే యూనిఫాంలు, ఇతర సామగ్రికి సంబంధించి విధి విధానాలను (ఎస్‌వోపీ) రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యార్థులకు అందజేసే వస్తువుల జాబితా రూపకల్పన, టెండర్లు , సరఫరా, అందజేత వరకు ప్రతీదీ నిర్దేశిత సమయంలో పూర్తవ్వాలని తెలిపారు. పాఠశాలలు తెరిచిన రోజునే మొత్తం వస్తువులు అందేలా ఇప్పటినుంచే కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.ఈ సమీక్షలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, రాష్ట్ర గిరిజన, వెనుకబడిన తరగతుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా, వివిధ శాఖల అధికారులు షఫీఉల్లా, బాలమాయాదేవి, విజయేందిర బోయి, దివ్య దేవరాజన్, జి.రవి, బి.సైదులు, బీఎం సంతోష్, నవీన్ నికొలస్, సీతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ట్రంప్‌కు చుక్కెదురు

పడిపోయింది. 18-39 ఏళ్ల యువకుల్లో 2024లో ట్రంప్‌నకు 40 శాతం మద్దతు ఇవ్వగా.. ప్రస్తుతం అది 23 శాతానికి తగ్గింది. మహిళల్లోనూ ఇదే తరహా తగ్గుదల కనిపించింది.

మేరీల్యాండ్‌లో మళ్లీ మెరిసిన హైదరాబాదీ..

అమెరికా రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న భారత సంతతి వ్యక్తులు.. తాజా మధ్యంతర ఎన్నికల్లోనూ సత్తా చాటుతున్నారు. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా డెమొక్రాట్ నేత, తెలుగు మూలాలున్న అరుణా మిల్లర్ విజయం సాధించారు. హైదరాబాద్‌లో జన్మించిన అరుణ.. వరుసగా రెండోసారి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఎన్నికవడం విశేషం. అరుణా మిల్లర్ 1964 నవంబర్ 6న హైదరాబాద్‌లో తెలుగు కుటుంబంలో జన్మించారు. ఆమెకు ఏడేళ్ల వయసున్నప్పుడే తల్లిదండ్రులు అమెరికాకు వలస వెళ్లారు.

న్యూయార్క్‌లోని పబ్లిక్ స్కూల్స్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసిన అరుణ.. మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పట్టా పొందారు. దేవ్ మిల్లర్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు సంతానం.ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజినీర్‌గా పనిచేసిన అరుణ.. కాలిఫోర్నియా, వర్జీనియా, హవాయి రాష్ట్రాల్లో దాదాపు 25ఏళ్ల పాటు సేవలందించారు. రోడ్డు భద్రత, ప్రజా రవాణాలో మెరుగైన వసతుల కోసం కృషి చేశారు. 1990లో మేరీల్యాండ్‌కు మకాం మార్చిన ఆమె.. మోంట్‌గోమరీ కౌంటీలో స్థిరపడ్డారు.అనంతరం రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆమె.. డెమొక్రటిక్ పార్టీ కోసం పనిచేశారు. 2010లో తొలిసారి మేరీల్యాండ్ హౌస్ ఆఫ్ డెలిగేట్స్‌కు ఎన్నికై.. 2010 నుంచి 2018 వరకు సభ్యురాలిగా కొనసాగారు.కీలక కమిటీల్లో సేవలందించి ప్రత్యేక గుర్తింపు పొందారు. పలు అవార్డులూ సొంతం చేసుకున్నారు.2022లో మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా పోటీ చేసి విజయం సాధించిన ఆమె.. రాష్ట్రస్థాయి పదవి చేపట్టిన దక్షిణాసియా మహిళగానూ ఘనత సాధించారు. తాజా మధ్యంతర ఎన్నికల్లోనూ సత్తా చాటి మరోసారి ఆ పదవిని సొంతం చేసుకున్నారు.

తెలుగు బాగా మాట్లాడుతా..

"తల్లిదండ్రులు అమెరికాకు వలస వచ్చే ముందు మేం హైదరాబాద్‌లో ఉండేవాళ్లం. కొంతకాలం విజయవాడలో అమ్మమ్మ దగ్గరం ఉన్నాం. అమెరికాలో స్థిరపడినా నేను తెలుగు మరచిపోలేదు. స్పష్టంగా మాట్లాడుతా. శాకాహారానికే ప్రాధాన్యం ఇస్తా. వంట కూడా చేస్తా" అని అరుణ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సాంబారు, గోంగూర, వంకాయ కూరతోపాటు కొన్ని పచ్చళ్లు ఇష్టంగా తింటానని ఓ సందర్భంలో చెప్పారు. మొదట్లో పబ్లిక్ స్పీకింగ్ అంటే ఎంతో భయపడేదాన్నని, కొంతకాలానికి దాన్ని అధిగమించినట్లు తెలిపారు. భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలను పాటిస్తానని, అన్ని మతాలను గౌరవిస్తానని అన్నారు. తొలిసారి లెఫ్టినెంట్ గవర్నర్ పదవి చేపట్టేటప్పుడు భగవద్గీతపై ప్రమాణం చేసినట్టు గుర్తుచేసుకున్నారు.

చరిత్ర సృష్టించిన పియా.. వివేక్ రామస్వామికి ఎదురుదెబ్బ

అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు వెల్లడవుతున్నాయి. ఇప్పటివరకు వెల్లడైన ఫలితాల ప్రకారం డెమొక్రాట్ల హవానే కనిపిస్తోంది. మరోవైపు అగ్రరాజ్యంలో భారత సంతతి నేతలు సత్తా చాటుతున్నారు. పలు కీలక పదవుల కోసం పోటీపడిన ఈ నాయకులు.. ఇప్పటికే పలుచోట్ల ఖాతా తెరిచారు.డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీ పడిన సుహాస్ సుబ్రహ్మణ్యం, అరుణా మిల్లర్, పియా దాండియా విజయం సాధించగా.. రిపబ్లికన్ పార్టీ తరఫున వివేక్ రామస్వామి ఓటమి చవిచూశారు. వర్జీనియా 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి భారత సంతతికి చెందిన సుహాస్ సుబ్రహ్మణ్యం మరోసారి ఎన్నికయ్యారు. 63 శాతానికిపైగా ఓట్లను సాధించిన ఆయన రిపబ్లికన్ నేత దేవ్ బెక్‌విత్‌ను ఓడించారు.

బ్యాలెట్‌లో నా పేరు ఉంటే గెలిచేవాళ్లం

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు ఒక్కొక్కటిగా వెలువడుతున్నాయి. కీలక స్థానాల్లో అధికార రిపబ్లిక్ పార్టీకి గట్టి షాకిస్తూ డెమొక్రాట్లు చరిత్ర సృష్టిస్తున్నారు. ఇప్పటికే పలు సెనెట్ స్థానాలను ట్రంప్ పార్టీ నుంచి లాగేసుకున్నారు. దీంతో ఎగువసభలో డెమొక్రాట్లకు ఆధిపత్యం లభించినట్లయ్యింది. అటు ప్రతినిధుల సభలోనూ డెమొక్రాట్లు ఆధిక్యం సాధించే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీంతో తాజా ఫలితాల పై ట్రంప్ అసహనం వ్యక్తం చేశారు. బ్యాలెట్ పేపర్లో తన పేరు ఉంటే.. ఓడిపోయేవాళ్లం కాదని అన్నారు. తాను పోటీలో ఉండి ఉంటే.. రిపబ్లికన్ పార్టీ అఖండ విజయం సాధించేదంటూ ఆయన ట్రూత్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. అయితే, ఈ ఫలితాలను అంగీకరిస్తున్నానని, డెమొక్రాట్లతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

అమెరికన్లు యుద్ధం వద్దంటున్నారు

టెహ్రాన్(జనంసాక్షి):అమెరికాలో మధ్యంతర ఎన్నికల ఫలితాలు అధికార పక్షానికి ప్రతికూలంగా వస్తున్న వేళ ఇరాన్ స్పందించింది. ఈ ఫలితాలతో ఇరాన్ పట్ల అమెరికా తీరు మారుతుందని ఊహించవద్దని సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ పేర్కొన్నారు. ఇరాన్ పౌరులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇరాన్‌పై అమెరికా మరోసారి భీకర దాడులు చేయవచ్చనే ఊహాగానాల నేపథ్యంలో సుప్రీం లీడర్ నుంచి ఈ స్పందన వచ్చింది.ఇరానీయులు కూడా అమెరికా పట్ల తమ వైఖరిని మునుపెన్నడూ లేనంత స్పష్టంగా అర్థం చేసుకున్నారని మొజ్తాబా పేర్కొన్నారు. అయినప్పటికీ, అమెరికా దాడులకు పాల్పడితే ఇరాన్ ప్రతిస్పందన అత్యంత తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. పశ్చిమాసియాలో అమెరికా స్థావరాలను ధ్వంసం చేయడం, హర్మూజ్ జలసంధిలో పట్టుసాధించడం వంటివి అమెరికా ఆధిపత్యానికి అడ్డుకట్ట వేసే చర్యలేనన్నారు. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన ఫలితాలను ఇరాన్ నేతలు స్వాగతించారు. యుద్ధం వద్దు అనే విషయాన్ని అమెరికన్లు చెబుతున్నట్లు అర్థమవుతోందని, ఇదే సందేశాన్ని తాము కూడా సమర్థిస్తున్నామని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు.

హర్మూజ్‌లో భారత్‌కు రైట్ రైట్..

ఇరాక్, ఖతార్ నౌకలు హర్మూజ్ జలసంధిని దాటవచ్చని స్పష్టం చేశారు. భారత్ నుంచి పశ్చిమాసియా దేశాలకు ఔషధాల సరఫరాను సులభతరం చేసే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఆయా దేశాల నౌకల నుంచి రవాణా రుసుమును మాత్రం వసూలు చేస్తామని పేర్కొన్నారు. 'ప్రస్తుతం హర్మూజ్‌లో రవాణా ఆంక్షల నుంచి భారత్, చైనా, ఇరాక్, ఖతార్‌లకు మినహాయింపు ఇచ్చాము. ఇకపై ఆయా దేశాల నౌకలు జలసంధిలో స్వేచ్ఛగా ప్రయాణిస్తాయి. ఇరాన్ దౌత్య, ఆర్థిక ప్రయోజనాలకు దోహదం చేస్తాయనే కారణంతోనే ఈ మినహాయింపులు ఇచ్చాము. భారత్ నుంచి ఔషధాల దిగుమతిని సులభతరం చేయడానికి, చైనా నుంచి రాజకీయ మద్దతు పొందడానికి ఈ చర్యలు చేపట్టాం' అని అమీర్ హయత్ పేర్కొన్నారు. ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గంగా ఉన్న హర్మూజ్‌లో నౌకాయానంపై ఆంక్షలు కొనసాగుతున్న విషయం తెలిసిందే.



యాదవుల సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు

సదర్ సమ్మేళనాలు దోహదం

□ మంత్రి వాకిటి శ్రీహరి




హైదరాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి) : హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సదర్ సమ్మేళనంలో రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవ సోదరులకు ఆయన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షిస్తూ భావితరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయడంలో సదర్ సమ్మేళనాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుకుంటూ, వాటిని భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. యాదవ సోదరులు ఐక్యతతో ముందుకు సాగుతూ విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. యువత ఉన్నత విద్యను అభ్యసించి, అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలంటే వారి జనాభా, సామాజిక స్థితిగతులకు అనుగుణంగా అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా కులగణనకు ప్రాధాన్యతనిస్తూ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. కులగణన ద్వారా వివిధ సామాజిక వర్గాల వాస్తవ పరిస్థితులను గుర్తించి, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో న్యాయమైన భాగస్వామ్యాన్ని కల్పించేందుకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. సదర్ సమ్మేళనం వంటి కార్యక్రమాలు యాదవ సోదరుల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు, వారి సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.

రోడ్డు ప్రమాద కేసులో నిందితుడికి ఆరు నెలల జైలుశిక్ష

□ 10 వేల జరిమానా విధించిన గణపురం కోర్టు

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 04 (జనంసాక్షి) : రోడ్డు ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌కు స్టేషన్ ఘన్పూర్ న్యాయస్థానం ఆరు నెలల జైలు శిక్షతో పాటు 10 వేల జరిమానా విధించిందని సీఐ శ్రీనివాస్, ఎస్ఐ పిట్ట రాజేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే 2014లో గణపురం (డబ్ల్యూ) పోలీస్ స్టేషన్ పరిధిలో మృతుల కుటుంబ సభ్యు డు ఆకుల రాము తెలిపిన వివరాల ప్రకారం తల్లి ఆకుల ప్రేమలత కి ఆరోగ్యం బాగుండకపోవడం తో చికిత్సనిమిత్తం 05 మే 2014 న కొడుకు ఆకుల శశిధర్ రావు, కుమార్తె కర్ర శైలజ కలిసి ఆమెను హైదరాబాద్‌లోని ఒమేగా ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం, 06 మే 2014 ఉదయం కారులో తిరిగి హనుమకొండకు బయలుదేరారు.ఉదయం 05:45 గంటల ప్రాంతం లో చిన్నపెండ్యాల గ్రామంవద్దకు రాగానే,హనుమ కొండవైపు నుండి హైదరాబాద్ వైపు అతివేగంగా, నిర్లక్ష్యంగా వెళ్తున్న టిప్పర్ లారీ ఎదురుగా వస్తున్న వీరి కారును బలంగా ఢీకొట్టిందని తెలిపారు. ఈ ప్రమాదంలో కారు తీవ్రంగా ధ్వంసమైంది. కారులో ప్రయాణిస్తున్న ఆకుల శశిధర్ రావు, తల్లి ఆకుల ప్రేమలత, సోదరి కర్ర శైలజ లకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. కారు ప్రయాణిస్తుండగా టిప్పర్ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంపైబాధితుడు ఆకుల రాములు అలియా స్ సాయి శ్రీధర్, రాము ఫిర్యాదు మేరకు పోలీసు లు కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై క్రైమ్ నంబర్ 178/2014, సెక్షన్ 304(ఎ) ఐపిసి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసు లో నిందితుడైన నల్గొండ జిల్లా బీబీనగర్ మండ లం గూడూరు గ్రామానికి చెందిన మండా నరసిం హపై గణపురం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రే ట్ కోర్టులో సీసీ నంబర్ 2/2025 ద్వారా విచారణ జరిగింది. కేసులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఎస్ శివలీల సీఆర్‌పీసీ సెక్షన్ 255(2) ప్రకారం నిందితుడికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు 10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో అప్పటి దర్యాప్తు అధికారి బి కిషన్ (ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్) దర్యాప్తు చేపట్టగా, ప్రస్తుత గణపురం (డబ్ల్యూ) పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్,ఎస్‌హెచ్ఓ ఎస్ శ్రీనివాస్ పర్యవేక్షణలో కేసు కోర్టులో కొనసాగింది. ఏపీపీ కిరణ్ కుమార్ వాదనలు వినిపించగా, కోర్టు విధుల్లో సీడీఓ జి సురేష్,పీసీ 3882 సహకరించారు.



మంత్రి సన్నిహితుడు
ఆళ్ల మురళిపై కేసు

□ రూ.6.91 కోట్ల సీఎంఆర్ ధాన్యం పక్కదారి?

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 4 (జనంసాక్షి): మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అనుచరుడు ఆళ్ల మురళిపై కొత్తగూడెం త్రీటౌన్ పోలీసులు ఛీటింగ్ కేసు నమోదు చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టించి ప్రభుత్వానికి దాదాపు రూ.6.91 కోట్ల నష్టం కలిగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే కేసు నమోదైందనే ప్రచారం జరుగుతోంది.

2025-26లో రైతుల నుంచి సేకరించిన 3,300 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించేందుకు కొత్తగూడెం మేదరబస్తీలోని శ్రీజ రైస్ మర్చంట్ (మురళీకృష్ణ రైస్) మిల్లుకు కేటాయించారు. అయితే ఆళ్ల మురళి కేవలం 600 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే అప్పగించి, మిగిలిన 1,751 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పక్కదారి పట్టించినట్లు విజిలెన్స్ విచారణలో తేలినట్లు సమాచారం. అక్టోబర్ 28న పౌరసరఫరాల జిల్లా మేనేజర్ త్రినాథ్‌బాబు బృందం తనిఖీలు నిర్వహించి ధాన్యం మాయమైనట్లు గుర్తించింది. ఆయన ఫిర్యాదుతో ఆళ్ల మురళితోపాటు ఆయన తల్లి అంజనేయమ్మపై పోలీసులు కేసు నమోదు చేశారు. క్రైం నంబర్ 202/2026గా బీఎన్ఎస్ 316(2), 316(3), 318(3) ఆర్/డబ్ల్యూ 3(5) సెక్షన్లతోపాటు నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసు నమోదైంది.

మంత్రి అనుచరుడిపై చర్యలతో చర్చ

మంత్రి పొంగులేటికి అత్యంత సన్నిహితుడిగా, కొత్తగూడెం నియోజకవర్గంలో అధికార పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించే వ్యక్తిగా మురళికి పేరుంది. దీంతో ఆయనపై కేసు నమోదు కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే పోలీసులు కేసు నమోదు చేశారనే ప్రచారం సాగుతోంది. ఈ వ్యవహారం డీజీపీ స్థాయికి వెళ్లిన నేపథ్యంలోనే చర్యలు తీసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు కేసు నమోదైనప్పటికీ మంగళవారం ఉదయం 11 గంటల వరకు ఎఫ్ఐఆర్ ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం గమనార్హం. మురళి ముందస్తు బెయిల్‌కు ప్రయత్నించగా, ఇప్పటికే బెయిల్ వచ్చినట్లేనని స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

పోటీ ప్రపంచానికి సిద్ధం చేయాలి

□ చదువుతోపాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించాలి

□ మారుమూల విద్యార్థులను అగ్రభాగాన నిలిపిన ఘనత ఉపాధ్యాయులదే

□ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క



ములుగు ప్రతినిధి, నవంబర్ 04(జనంసాక్షి) : విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయులు నిత్య స్ఫూర్తిగా నిలుస్తారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, పోటీ ప్రపంచంలో రాణించేలా సిద్ధం చేయాలని కోరారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇంటర్మీడియట్ పాఠశాల విద్యాశాఖ- ఆధ్వర్యంలో పదో తరగతి వార్షిక పరీక్షలు--2027 విద్యార్థుల సంసిద్ధతపై ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమష్టి కృషితో పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో ములుగు జిల్లా ఉత్తమ స్థానాలు సాధించిందని తెలిపారు. గిరిజన ప్రాంతం విద్యలో వెనుకబడి ఉంటుందనే భావనను మార్చి, జిల్లా విద్యార్థుల ప్రతిభను రాష్ట్రానికి చాటిచెప్పారని ప్రశంసించారు. కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తీసుకున్న ప్రత్యేక చర్యలు మెరుగైన ఫలితాలకు దోహదపడ్డాయని అన్నారు. ఉపాధ్యాయుల కృషిని ఎప్పటికీ మర్చిపోమని, వారి కష్టసుఖాల్లో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒక ఉపాధ్యాయుడి జీవితంలో వేలాది మంది విద్యార్థులు ఉంటారని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల ప్రభావం ఎంతో ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులకు జ్ఞానాన్ని అందించేందుకు, వారిని ప్రోత్సహించేందుకు వెచ్చించే సమయం, శ్రమ వారి విజయాల్లో ప్రతిబింబిస్తాయని అన్నారు. విద్యార్థులకు ఇష్టమైన ఉపాధ్యాయులుగా మెలుగుతూ, ఆయా సబ్జెక్టులపై ఆసక్తిని పెంచాలని సూచించారు. మారుమూల ప్రాంతాల నుంచి ఎదిగినవారు తమలాంటి మరెన్నో తరాలు ముందుకు వచ్చేలా కృషి చేయాలని, సొంత ప్రాంతానికి సేవ చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోటీ రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు తగిన ప్రేరణ అందించాలని సూచించారు. సిలబస్‌ను పూర్తి చేసి, పునశ్చరణ, సాధన పరీక్షల ద్వారా విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించాలని తెలిపారు. ఏయే అంశాల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో గుర్తించి, ప్రత్యేక సమయం కేటాయించి బోధించాలని సూచించారు. వసతిగృహాల్లోని విద్యార్థులపైనా ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న తరుణంలో చదువుతోపాటు భావవ్యక్తీకరణ నైపుణ్యాలు, కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించాలని కోరారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల విద్యార్థుల్లో బిడియాన్ని తొలగించి, ఆత్మవిశ్వాసాన్ని నింపాలని సూచించారు. ములుగు జిల్లా విద్యతోపాటు రహదారులు, పర్యాటకం, మౌలిక వసతులు తదితర అన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో సమృద్ధిగా ఉన్న అటవీ సంపద, సహజ వనరులు, సాంస్కృతిక వైభవాన్ని అభివృద్ధికి వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు తమ పరిజ్ఞానం, అనుభవం, పరిశీలనల ఆధారంగా విద్యాభివృద్ధితో పాటు జిల్లా అభివృద్ధికి ఉపయోగపడే ఆలోచనలు, సూచనలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఢడే హేమంత్ సహదేవరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనార్ధన్, జీసీడీఓ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు,
ప్రజాప్రతినిధులు కృషి చేయాలి

□ జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్



ఉట్నూర్ నవంబర్4 (జనంసాక్షి): జిల్లాలో అమరజీవి కుంరం సూరు 29వ వర్ధంతి వేడుకలను ఐటీడీఏ ఆధ్వర్యంలో బుధవారం ఉట్నూర్ మండలం కొలం గూడ గ్రామంలో అత్యంత ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్,ఎంపీ గోడం నగేష్, జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో మంద మకరందు,సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిథులు కుంరం సూరు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగానివాళులర్పించారు.ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ గిరిజనులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపాలని పిలుపునిచ్చారు.భూ సమస్యలు,అటవీ హక్కుల గుర్తింపునకు సంబంధించి కోర్ ఏరియాలు,భూమి కేటాయింపులు,అటవీ ప్రాంత హక్కులపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాలో కొలమ్ జాతికి చెందిన సుమారు 7,000 కుటుంబాలు ఉన్నాయని, 9 శాఖల ద్వారా పీఎం జన్మన్ పథకాన్ని సమర్థవం తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను అనుసరిం చాలని, ఐటీడీఏ పీవో మంద మకరందు మాట్లాడుతూ ఐటీడీఏ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

జువెలరీ షాపులో చోరీ.. నిందితుడి అరెస్ట్

□ నాలుగు తులాల బంగారం స్వాధీనం

□ మేడిపల్లి పోలీసుల చాకచక్యంతో కేసు ఛేదింపు





బోడుప్పల్ (జనంసాక్షి) : జువెలరీ షాపులో బంగారు చెవి రింగులను చోరీ చేసిన కేసును మేడిపల్లి పోలీసులు ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి సుమారు నాలుగు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 2న సాయంత్రం 7 గంటల సమయంలో బోడుప్పల్ వీరారెడ్డి నగర్ ఎక్స్ రోడ్డులోని రాందేవ్ జువెలరీ షాపునకు శ్రీపతి నగేష్ (41) కస్టమర్‌గా వచ్చాడు. షాపు యజమాని పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో అతడి దృష్టి మరల్చి బంగారు చెవి రింగులను అపహరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, ఇతర సమాచారంతో నిందితుడిని గుర్తించి అరెస్టు చేశారు. హనుమకొండ జిల్లా వడ్డేపల్లికి చెందిన శ్రీపతి నగేష్ ఆర్థిక ఇబ్బందులు, అప్పుల కారణంగా చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడించాడని పోలీసులు తెలిపారు. అతడి వద్ద నుంచి నాలుగు తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయ స్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. కేసును త్వరితగతిన ఛేదించి, బంగారు ఆభరణాలను రికవరీ చేసిన పోలీసు అధికారులను, సిబ్బందిని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్, ఉప్పల్ డీసీపీ, ఏసీపీ అభినందించారు. ఈ కేసులో ఇన్‌స్పెక్టర్ జలంధర్ రెడ్డి, డీఎస్ఐ బొలిశెట్టి శ్రీను, హెడ్ కానిస్టేబుల్‌తో పాటు కానిస్టేబుళ్లు రాము, సునీల్, హరిబాబు, వినోద్, శివ, విశాల్ పాల్గొన్నారు. జువెలరీ షాపుల యజమానులు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కస్టమర్లకు బంగారు ఆభరణాలు చూపించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని మల్కాజిగిరి పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

రాజకీయ జోక్యంతోనే ఒప్పందాల అమలులో జాప్యం

□ పెండింగ్ సమస్యలు పరిష్కరించకుంటే మరిన్ని ఆందోళనలు

గోదావరిఖని, జనంసాక్షి: సింగరేణిలో రాజకీయ జోక్యం వల్లే కార్మికులతో కుదిరిన ఒప్పంద డిమాండ్లు అమలు కావడం లేదని ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్ ఆరోపించారు. బుధవారం ఆర్జీ-1 జీఎం కార్యాలయం వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించిన ముట్టడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆగస్టు 27న ఆర్ఎల్‌సీ సమక్షంలో 23 డిమాండ్లపై కుదిరిన ఒప్పందాలకు వెంటనే సర్కులర్లు జారీ చేసి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా నిర్వహిస్తామని హామీ ఇచ్చిన మెడికల్ బోర్డును మూడు నెలలకే నిలిపివేశారని, మారుపేర్ల సమస్య, వీఐటీసీ పూర్తి చేసిన డిపెండెంట్ అభ్యర్థుల నియామకాలు, సొంతింటి పథకం పెండింగ్‌లో ఉన్నాయని విమర్శించారు. గనుల్లో భద్రతా పరికరాలు, యంత్రాల విడిభాగాలు సరఫరా చేయాలని కోరారు. విద్యుత్ సంస్థల నుంచి సింగరేణికి



రావాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘం ఏఐటియుసి ఎన్నికలకు సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేసి, సీఎండీ జోక్యంతో సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీనుతో పాటు పలువురు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ కేసులో సంచలన తీర్పు

□ ఐదుగురికి ఐదేళ్ల జైలు శిక్ష

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 04 (జనంసాక్షి) :కులం పేరుతో దూషించి, సామాజిక బహిష్కరణ చేసిన కేసులో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం దూస్‌గాం గ్రామానికి చెందిన ఐదుగురు విడిసి సభ్యులకు ఎస్సీ, ఎస్టీ కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. దోషులుగా తేలిన ప్రతి ఒక్కరికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10,000 జరిమానా విధించినట్లు కోర్టు తెలిపింది.నిజామాబాద్‌లోని పలు ప్రాంతాల్లో గ్రామభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో పాలన సాగుతుంటుంది. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం కులానికి ఒక పెద్దమనిషి చొప్పున ఎన్నుకొని విడిసిని ఏర్పాటు చేస్తారు. వీరు కాలపరిమితి చివరి రోజున గ్రామానికి లెక్కలు చెప్పి, కొత్త సభ్యులను ఎన్నుకుంటారు.2021 ఆగస్టు 21న కొత్త సభ్యుల ఎన్నిక సందర్భంగా ఎప్పుడు మా మాదిగ కులానికి కాషియర్ పదవి ఇవ్వలేదు, ఈసారి మాకు కావాలి" అని మాదిగ కులానికి చెందిన వ్యక్తులు అడగడంతో వివాదం చెలరేగింది. దీనితో మూన్నూర్ కాపు, రెడ్డి కులాలకు చెందిన వారు వీరిని కులం పేరుతో దూషించి, ఊరిలో డప్పులు కొట్టుకోవద్దని, గ్రామం కులాన్‌పూర్ వారిని తీసుకువచ్చి వీరి ఉపాధికి గండి కొట్టాలని శివారెడ్డి, గంగారెడ్డి, ఇందూర్ రాములు తదితరులు హెచ్చరించారు.బాధితులు డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ జరిపి విడిసి సభ్యులైన మంద లక్ష్మణ్, మంద జనార్ధన్, మంద మోహన్, మంద రాజ్యలక్ష్మి, శివారెడ్డి, గంగారెడ్డి, ఇందూర్ రాములుపై కేసు నమోదు చేసి కోర్టుకు సమర్పించారు.ఈ కేసుకు సంబంధించి సాక్ష్యాధారాలను పరిశీలించిన ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి నారాయణ బుధవారం ఈ తీర్పు వెల్లడించారు. నిందితులలో మంద జనార్ధన్ దుబాయ్ వెళ్లడంతో అతనిపై కేసును స్ప్లిట్ చేశారు. మరో నిందితుడైన ఇందూర్ రాములు విచారణ సమయంలోనే మరణించడంతో ఆయనపై ఉన్న కేసును మూసివేశారు. మిగతా నిందితులు తిరిగి వచ్చిన తర్వాత ఆ కేసుపై మళ్లీ విచారణ జరుగుతుందని న్యాయవర్గాలు తెలిపాయి. ప్రాసిక్యూషన్ తరఫున ఎస్సీ, ఎస్టీ కోర్టు పి.పి. దయాకర్‌గౌడ్ వాదనలు వినిపించారు.

గుంతలమయంగా గ్రామీణ రహదారులు

□ నిత్యం ప్రమాదాల భయం!

□ శంకుస్థాపనలకే పరిమితమైన మరమ్మతులు..

□ ప్రజల ప్రాణాలతో చెలగాటం..

□ రహదారుల దుస్థితితో గ్రామస్తుల అవస్థలు



కుబీర్, అక్టోబర్ 04 (జనంసాక్షి): కుబీర్ మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు గుంతలమయంగా మారి ప్రయాణికులకు నరకం చూపిస్తున్నాయి. రహదారులపై తారు పూర్తిగా దెబ్బతిని కంకర తేలడంతో పాటు అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నిత్యం ప్రమాదాల భయంతో ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా దోదర్న, కస్ర, సోనారి, బెల్గాం సరిహద్దు వరకు, రంజని తదితర గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి.

రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇచ్చే క్రమంలో గుంతలను తప్పించుకోలేక వాహనాలు అదుపుతప్పుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు చేరి వాటి లోతు తెలియక ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. నిత్యం పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే రైతులు, వ్యవసాయ కూలీలు, చిరు వ్యాపారులు, విద్యార్థులు ఈ రహదారులపై ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్ల దుస్థితితో ద్విచక్ర వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయని, అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. గర్భిణులు, వృద్ధులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని ఆసుపత్రులకు తరలించే సమయంలో రహదారులపై కుదుపులతో ఇబ్బందులు తప్పడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు సైతం వేగంగా వెళ్లలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, కుబీర్ నుంచి దోదర్న వెళ్లే రహదారి మరమ్మతులు, ప్యాచ్‌వర్క్ పనుల కోసం ఇటీవల ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భూమిపూజ నిర్వహించారు. దీంతో తమ రహదారి సమస్యకు పరిష్కారం లభిస్తుందని గ్రామస్తులు ఆశించారు. అయితే భూమిపూజ జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. శంకుస్థాపన కార్యక్రమాలకే పరిమితం కాకుండా పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే రహదారులను బాగు చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని అభిప్రాయపడుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి దెబ్బతిన్న రహదారులను పరిశీలించాలని, తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా నాణ్యతతో కూడిన శాశ్వత పనులు చేపట్టాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించి రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
5 నవంబర్ 2026

అబ్దుల్ ఎల్‌-సయీద్ గెలుపు..

ట్రంప్ విద్వేష రాజకీయాలకు చెంపపెట్టు!

సంపాదకీయం

అమెరికా ప్రజాస్వామ్యం మతవిద్వేషానికి, జాత్యహంకారానికి, వ్యక్తిగత అవమానాలకు తలవంచబోదని మధ్యంతర ఎన్నికల ఫలితాలు చాటిచెప్పాయి. ముఖ్యంగా మిచిగన్ సెనేట్ ఎన్నికల్లో డెమోక్రటిక్ అభ్యర్థి అబ్దుల్ ఎల్‌-సయీద్ విజయం అమెరికా రాజకీయాల్లో చారిత్రక పరిణామం. ఆయన గెలుపు రిపబ్లికన్లకు, రైట్‌వింగ్ శక్తులకు మింగుడుపడని అంశంగా మారింది. ఎందుకంటే ఆయనను ఓడించడానికి ప్రత్యర్థులు అభివృద్ధి, ఆర్థిక విధానాలు, ప్రజా సమస్యలను అస్త్రాలుగా చేసుకోలేదు. ఆయన పేరు, మతం, ముస్లిం గుర్తింపునే లక్ష్యంగా చేసుకున్నారు. చివరకు అదే విద్వేష ప్రచారానికి ఓటర్లు తమ ఓటుతో సమాధానం చెప్పారు.

అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా అబ్దుల్ ఎల్‌-సయీద్‌ను పదేపదే ఎగతాళి చేశారు. ఆయన పేరును వక్రీకరించారు. ముస్లిం బ్రదర్‌హుడ్‌తో సంబంధాలున్నాయంటూ, జిహాదీ అంటూ తీవ్రమైన ఆరోపణలు చేశారు. అమెరికా సెనేట్‌లోకి అడుగుపెట్టడానికి కూడా ఆయనకు అర్హత లేదన్నట్టుగా మాట్లాడారు. ఒక దేశ అధ్యక్షుడి స్థాయిలో ఉండి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థిపై ఇంతటి విద్వేషపూరిత ప్రచారం చేయడం ఎంతటి దిగజారుడుతనమో అర్థం చేసుకోవచ్చు. ఆరోపణలు చేయడం సులభమే. కానీ వాటికి ఆధారాలు చూపించాల్సిన బాధ్యత కూడా ఉంటుంది. రాజకీయ ప్రత్యర్థిని మతం పేరుతో అనుమానాస్పద వ్యక్తిగా చిత్రీకరించడం ప్రజాస్వామ్యమా?

ట్రంప్‌కు, ఆయన మద్దతుదారులైన రైట్‌వింగ్ శక్తులకు ఒక విషయం అర్థం కావాలి. అమెరికా అంటే ఒక్క మతానికి, ఒక్క జాతికి, ఒక్క వర్గానికి చెందిన దేశం కాదు. వివిధ దేశాల నుంచి వలస వచ్చిన ప్రజల శ్రమ, ప్రతిభ, భాగస్వామ్యంతో నిర్మితమైన సమాజం. ఆ దేశంలో పుట్టిన ఒక ముస్లిం అమెరికన్‌కు సెనేటర్‌గా ఎన్నికయ్యే హక్కు లేదా? అమెరికా రాజ్యాంగం కల్పించిన సమానత్వాన్ని మతపరమైన గుర్తింపులతో కొలవడం ఎవరి హక్కు? ప్రజాస్వామ్యంలో అభ్యర్థి మతం కాదు, ప్రజలకు అందించే సేవలు, విధానాలు, సమర్థతే ఎన్నికల ప్రాతిపదిక కావాలి.

అబ్దుల్ ఎల్‌-సయీద్ విజయం ఇక్కడే ప్రత్యేకతను సంతరించుకుంది. అమెరికా సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లింగా ఆయన చరిత్ర సృష్టించబోతున్నారు. ట్రంప్ మద్దతుతో బరిలోకి దిగిన రిపబ్లికన్ అభ్యర్థి మైక్ రోజర్స్‌ను ఓడించడం సాధారణ రాజకీయ పరిణామం కాదు. తన పేరు, తన మతం గురించి అవమానకర వ్యాఖ్యలు చేసిన వారికి ఆయన విజయం సమాధానంగా నిలిచింది. ప్రచారంలో తన పేరు, మతాన్ని లక్ష్యంగా చేసుకున్నారని చెబుతూ, ప్రజల గ్యాస్, నిత్యావసరాల ధరల సమస్యలకు తన పేరు, మతం కారణం కాదని ఆయన చేసిన వ్యాఖ్యలు ట్రంప్ ప్రచారంలోని అసలు డొల్లతనాన్ని బయటపెట్టాయి.

మరోవైపు అమెరికా ప్రజల అసలు సమస్యలను కూడా ఈ ఎన్నికలు ముందుకు తెచ్చాయి. పెరుగుతున్న ధరలు, వైద్య ఖర్చులు, ఉద్యోగ భద్రత, ఆర్థిక అసమానతలు ప్రజలను వేధిస్తున్నాయి. వీటికి పరిష్కారాలు చూపాల్సిన పాలకులు మాత్రం ప్రత్యర్థుల పేర్లు, మతాలు, వ్యక్తిగత జీవితాల చుట్టూ రాజకీయాలను నడిపిస్తున్నారు. ప్రజలకు కావాల్సింది విద్వేష ప్రసంగాలు కాదు.. మెరుగైన జీవితం. ఎన్నికల ప్రచారంలో మతవిద్వేషాన్ని రెచ్చగొట్టవచ్చేమో కానీ, ప్రజల ఇంటి బడ్జెట్‌ను ఆ ప్రసంగాలు ఆదుకోవు.

ఈ ఫలితాలు ట్రంప్‌కు మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా మతం, జాతి పేరుతో రాజకీయాలు చేస్తున్న శక్తులకూ ఒక హెచ్చరిక. మెజారిటీ మద్దతు ఉందన్న అహంకారంతో మైనారిటీల హక్కులను కించపరచడం, భిన్నాభిప్రాయాలను దేశద్రోహంగా చిత్రీకరించడం, వలస వచ్చినవారిని శత్రువులుగా చూపించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. రైట్‌వింగ్ రాజకీయాలు ఎంతగా ప్రచారం చేసినా, చివరికి ఓటరు తన విచక్షణతో నిర్ణయం తీసుకోగలడని మిచిగన్ తీర్పు నిరూపించింది. ఒక్క అబ్దుల్ ఎల్‌-సయీద్ విజయం రిపబ్లికన్ పార్టీ అంతమైందని చెప్పడానికి సంకేతం కాకపోవచ్చు. కానీ విద్వేషమే ఎన్నికల విజయానికి శాశ్వత మార్గం కాదని మాత్రం స్పష్టంగా చెప్పింది. ట్రంప్ తన ప్రత్యర్థిని పేరుతో పిలవలేకపోయినా, అమెరికా ఓటర్లు ఆయనకు సెనేటర్‌గా గుర్తింపు ఇచ్చారు. ఇదే ఈ ఎన్నికల్లోని అసలైన రాజకీయ వ్యంగ్యం. ట్రంప్ తన నోటితో అవమానించిన వ్యక్తికి అమెరికా ఓటర్లు తమ ఓటుతో గౌరవం కల్పించారు. విద్వేష రాజకీయాలకు ప్రజాస్వామ్యం ఇచ్చిన సమాధానం ఇదే!

అబ్దుల్ ఎల్‌-సయీద్ మిచిగన్ సెనేట్ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి మైక్ రోజర్స్‌ను ఓడించి అమెరికా సెనేట్‌కు ఎన్నికైన తొలి ముస్లింగా చరిత్ర సృష్టించారు.

జైలు గోడల మధ్య కుల గోడలేనా!?



జైలు అంటే నేరం చేసిన వ్యక్తికి చట్టప్రకారం శిక్ష అమలయ్యే ప్రదేశం. నేరం చేసిన వ్యక్తి స్వేచ్ఛను పరిమితం చేయవచ్చు కానీ అతడి మానవ గౌరవాన్ని కాదు. న్యాయస్థానం విధించిన శిక్షకు మించి కులం పేరుతో అదనపు శిక్ష విధించే అధికారం ఎవరికీ లేదు. కానీ దేశంలోని కొన్ని జైళ్లలో కులవివక్ష, అంటరానితనం, వృత్తిపరమైన వివక్ష కొనసాగుతున్నాయన్న వాస్తవం భారత ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రశ్నార్థకం చేస్తోంది. జైళ్లలో కులవివక్షపై స్పందించని రాష్ట్రాల తీరును సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టడం ఈ వ్యవస్థలోని లోపాలను మరోసారి బయటపెట్టింది. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వపు హక్కును కల్పించింది. కులం, మతం, ప్రాంతం ఆధారంగా వివక్షను నిషేధించింది. అంటరానితనాన్ని పూర్తిగా రద్దు చేసింది. గౌరవప్రదమైన జీవితం ప్రతి మనిషి ప్రాథమిక హక్కుగా గుర్తించింది. ఈ రాజ్యాంగ సూత్రాలు జైలు గేటు దగ్గరికి వచ్చేసరికి వర్తించవా..? నేరం చేశాడనే కారణంతో ఒక వ్యక్తికి స్వేచ్ఛను నిరాకరించవచ్చు. కానీ అతడి కులం ఆధారంగా పనులు కేటాయించడం, సామాజిక నేపథ్యాన్ని బట్టి వివక్ష చూపడం ఏ న్యాయసూత్రం ప్రకారం సమర్థనీయం..? నేరం వ్యక్తిగతమైనది. కులం జన్మతో ఆపాదించబడిన సామాజిక గుర్తింపు. ఈ రెండింటినీ కలిపి చూడటమే అసలు సమస్య. 2024 అక్టోబర్‌లో సుకన్య శాంతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ విషయంలో కీలకమైనది. వివిధ రాష్ట్రాల జైలు నిబంధనల్లో ఉన్న కులవివక్షాపూరిత నిబంధనలను రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించింది. ఖైదీలకు కులం ఆధారంగా పనులు కేటాయించడం, పారిశుద్ధ్య పనులను నిర్దిష్ట వర్గాలకే పరిమితం చేయడం, సామాజిక నేపథ్యం ఆధారంగా ఖైదీలను వేరు చేయడం వంటి పద్ధతులను తప్పుబట్టింది. జైలు నిబంధనల్లో మార్పులు చేసి కులవివక్షకు తావులేకుండా చూడాలని రాష్ట్రాలను ఆదేశించింది. అయినప్పటికీ ఆదేశాల అమలులో ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతుండటం ఆందోళనకరం. తాజాగా 23 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కేంద్ర హోంశాఖ కోరిన సమాచారాన్ని సమర్పించకపోవడంపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. నివేదికలు సమర్పించకపోతే ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులను వ్యక్తిగతంగా కోర్టుకు పిలిపించాల్సి వస్తుందని హెచ్చరించింది. 2027 జనవరి 13లోగా నివేదికలు సమర్పించాలని తుది గడువు విధించింది. దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన రాజ్యాంగపరమైన ఆదేశాల అమలుపై రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం చిన్న విషయం కాదు. సామాజిక న్యాయం గురించి మాట్లాడే పాలకులు తమ పరిధిలోని సంస్థల్లోనే కొనసాగుతున్న వివక్షను తొలగించడానికి ఎందుకు చొరవ చూపడం లేదన్నది ప్రశ్న. అయితే జైలు మాన్యువళ్లలోని వివక్షాపూరిత నిబంధనలను తొలగించడంతోనే సమస్య పరిష్కారమైనట్లు కాదు. కాగితాలపై సమానత్వం ప్రకటించడం వేరు.. ఆచరణలో అమలు చేయడం వేరు. ఖైదీలకు పనులు కేటాయించే విధానం, వంటశాలలు, పారిశుద్ధ్య నిర్వహణ, బ్యారక్‌లలో నివాస ఏర్పాట్లు, అధికారుల ప్రవర్తన.. ప్రతి అంశంలోనూ వివక్షకు తావులేకుండా చూడాలి. జైళ్లలో కులవివక్షపై స్వతంత్ర పర్యవేక్షణ ఉండాలి. బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. వివక్షకు పాల్పడే అధికారులపై బాధ్యతాయుతమైన చర్య లు తీసుకోవాలి. లేదంటే నిబంధనల మార్పులు కేవలం అధికారిక ప్రకటనలకే పరిమితమవుతాయి. నిజానికి జైళ్లలో కులవివక్ష అనేది జైలు వ్యవస్థకు మాత్రమే సంబంధించిన సమస్య కాదు. సమాజంలో పాతుకుపోయిన కులాధిపత్య భావజాలం ప్రభుత్వ సంస్థల్లోకి ఎలా చొరబ డుతుందో చెప్పడానికి ఇదొక ఉదాహరణ. బయట సమాజంలో కులం పేరుతో మనుషుల మధ్య అంతరాలు సృష్టించి, జైళ్లలోకి వచ్చిన తర్వాత కూడా అదే వివక్షను కొనసాగిస్తే సామాజిక సంస్కరణలకు అర్థమేముంటుంది..? జైలు వ్యవస్థ లక్ష్యం కేవలం శిక్ష అమలు చేయడం మాత్రమే కాదు. ఖైదీలలో పరివర్తన తీసుకురావడం, వారు తిరిగి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించేలా అవకాశం కల్పించడం కూడా. అలాంటి వ్యవస్థలోనే కులవివక్ష కొనసాగితే పరివర్తనకు బదులు పాత అసమానతలనే తిరిగి ఉత్పత్తి చేసినట్లవుతుంది. ఖైదీల హక్కుల గురించి మాట్లాడటం నేరాన్ని సమర్థించడం కాదు. నేరం చేసినవారు చట్టప్రకారం శిక్ష అనుభవించాల్సిందే. అదే సమయంలో వారికి రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు కూడా కొనసాగాలి. స్వేచ్ఛను కోల్పోయినంత మాత్రాన సమానత్వాన్ని కోల్పోయినట్లు కాదు. శిక్ష అనేది న్యాయస్థానం నిర్ణయించేది. ఒక వ్యక్తి ఏ పని చేయాలి, ఏ హోదాలో ఉండాలి, ఎలాంటి గౌరవం పొందాలి అనేది అతడి కులం నిర్ణయించకూడదు. ఈ కనీస సూత్రాన్ని గుర్తించలేని జైలు వ్యవస్థ న్యాయవ్యవస్థ లక్ష్యాన్నే దెబ్బతీస్తుంది. ప్రభుత్వాలు రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం గురించి తరచూ మాట్లాడుతుంటాయి. కానీ వాటిని అమలు చేయాల్సిన సంస్థల్లోనే కులవివక్ష కొనసాగితే ఆ మాటలకు విలువ ఏముంటుంది..? సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడం ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడిన అంశం కాదు. అది రాజ్యాంగబద్ధమైన బాధ్యత. రాష్ట్రాలు నివేదికలు సమర్పించడంతోనే సరిపెట్టకుండా, జైళ్లలో వాస్తవ పరిస్థితులను సమీక్షించి, వివక్షకు కారణమవుతున్న విధానాలను పూర్తిగా తొలగించాలి. ఈ విషయంలో న్యాయస్థానం పర్యవేక్షణ కూడా నిరంతరం కొనసాగాలి. జైలు గోడలు మనిషి స్వేచ్ఛను నిర్బంధించవచ్చు. కానీ రాజ్యాంగం కల్పించిన సమానత్వపు హక్కును నిర్బంధించలేవు. నేరానికి శిక్ష ఉండాలి.. కులానికి కాదు. జైళ్లలో కులవివక్షకు ముగింపు పలకడం అంటే కేవలం ఖైదీల హక్కులను కాపాడటం కాదు. రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వాన్ని ఆచరణలో నిలబెట్టడం. సమాజాన్ని మార్చాలనుకునే ప్రజాస్వామ్య వ్యవస్థ ముందుగా తన సంస్థల్లోని వివక్షను తొలగించాలి. జైలు గోడల మధ్య కులగోడలు కూలినప్పుడే రాజ్యాంగ సమానత్వానికి నిజమైన అర్థం లభిస్తుంది.



దారా
rajenderdamera@gmail.com

ఇంకెప్పుడు మేల్కొంటారు?



దీర్ఘకాలికంగా నీ శ్రమలు దోచుకోవడానికి, ప్రకృతి వనరులైన భూసంపదను పొందడానికి.. సుమారు నాలుగు వేల సంవత్సరాల క్రితమే దేవుడు పేరుతో, మతం పేరుతో కులాన్ని సృష్టించారు. నీవు పుట్టింది నాకు సేవ చేయడానికే అన్నారు. నీకు చదువు సంపద జ్ఞానం ఉండొద్దు అన్నారు. ఇదంతా నిజమేనని నీవే అనుకునేంత విధంగా, నిన్ను పురాణ గాథల ద్వారా పూర్తిగా నమ్మించారు. నీ చైతన్య జ్ఞానం వికసించకుండా, నీలో బానిసత్వాన్ని పెంచి పోషించారు. అంబేద్కర్ రాజ్యాంగం, కమ్యూనిస్టుల పోరాటం ఈ దేశంలో నిన్ను కళ్ళు తెరిపించింది. నీ ఆత్మ గౌరవాన్ని నిలబెట్టింది. కానీ ఏం ఫలితం? బతుకులో సుఖంవస్తే, గతం మరిచిపోయినట్లుగా.. స్వార్థంతో నువ్వు నీ జాతిని మర్చిపోయావు, వాడి సంకలో చేరిపోయావు. మళ్లీ ఇప్పుడు పాత కథే మొదలవుతోంది. అన్ని రంగాల్లో దేశం ఎంత అభివృద్ధి అవుతున్నా, నీ స్థానం అదే అంటున్నారు. మేము ఏం చేసినా, నీవు మమ్మల్ని ప్రశ్నించొద్దు అంటున్నారు. ఇదే ధర్మం అంటున్నారు. రెండంచుల కత్తి వోలె ఒకవైపు మనుస్మృతిని, మరొకవైపు ప్రభుత్వాధికారాన్ని.. రెండూ ఏకకాలంలో ప్రయోగిస్తున్నారు. మన అస్తిత్వానికి పునాది అయిన, మన ఓటు హక్కునే లేకుండా చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్ లోని యోగి ఆదిత్యనాథ్ పాలనలో 1.27 కోట్ల హిందూ ప్రజల ఓట్లు తొలగించబడ్డాయి అనీ తెలుస్తోంది. చొరబాటు దారుల ఓట్లను, డబల్ ఓట్లను తొలగించడానికే ఈ సర్ ను తెచ్చాము అనే సాకులు చెబుతూ.. ఇప్పుడు బతికున్న మన భారత ప్రజల ఓట్లను తొలగిస్తున్నారు. మన రాజ్యాంగం మనకు ఇచ్చిన ఓటు హక్కును కాలరాస్తున్నారు. మన కళ్ళ ముందు ఇంత అరాచకం జరుగుతున్నా, కళ్ళు తెరవని ఓ నా ప్రియమైన బానిస బిడ్డలారా! ఇకనైనా మేలుకోండి! మతమౌఢ్యాన్ని వదిలించుకోండి! అలనాడు బ్రహ్మనాయుడు, బ్రహ్మంగారు హిందూమతం ద్వారానే సమానత్వాన్ని బోధించినప్పుడు.. నేడు హిందూ రక్షకులమని చెప్పకునే ఈ ఆరెస్సెస్ బిజెపి వాళ్లు.. అదే హిందూ మతం పేరు చెప్పుకుంటూ, సమాజంలో అసమానత్వాన్ని అరాచకాన్ని ఎందుకు పెంచి పోషిస్తున్నారు? ఆదానీ అంబానీ లాంటి వ్యాపారస్తులకు, మన భారత ప్రజల సంపదనంతా ఎందుకు దోచిపెడుతున్నారు? మణిపూర్ లో నిత్యం మారణకాండ ఎందుకు జరుగుతోంది? కులం పేరుతో నేటికి దళితుల మీద దాడులు ఎందుకు జరుగుతున్నాయి? వీళ్ళంతా భారతీయులు కాదా? ప్రజలంతా సమానం కాదా? ఏ సంస్కృతిని ఈ దేశంలో వీళ్ళు పెంచి పోషిస్తున్నారు? ఆలోచించండి. ఇదంతా చేస్తున్నదీ.. హిందూ రాజ్యం పేరుతో ఈ దేశంలో మళ్లీ చాతుర్వర్ణ వ్యవస్థను నిలబెట్టడానికే. మళ్లీ మనల్ని బానిసలుగా మార్చడానికే..

అందుకే ఇకనైనా కళ్ళు తెరవండి! దళిత బహుజన శ్రామిక వర్గాల ప్రజల మీద జరుగుతున్న, ఈ కుట్రలు కుతంత్రాలను అర్థం చేసుకోండి. భవిష్యత్ తరం బాగు కోసమైనా మేల్కోండి.



- ముద్దగౌని సుభాష్
సామాజిక ఉద్యమ రచయిత
ఫోన్: 9000904284



కొత్త జన్మ ఎత్తాలనీ

ఏన్నెలలో సొగసంతా
ఏటి పాలేనటరా!!
ఎంకీ పాట.. విన్నప్పుడల్లా..
పైరుల్లో తిరిగి.. అడవిని చుట్టేసి
పల్లెల్లో సేద తీరి
కొత్త జన్మ ఎత్తాలనే కోరిక చుట్టేస్తుంది
పండు ఒకటి చిట్లి,
విత్తనం ఏ పక్షిరెక్కలకో తగులుకొని
సుదూరతీరాలు ప్రయాణించి
సారవంతమైన నేలలో రాలినట్టు
పచ్చదనపు ప్రయాణంలో
కొండా, కోనలు నాకు
స్వాగతం పలికినట్టు గమ్మత్తుగా
అడవిని దర్శించాను
అడవిలో నుంచి చిన్న పిట్ట ఒకటి
ఎగిరి వచ్చి నా భుజం మీద వాలినట్టు
నీలాకాశంలో మేఘాలు
తెరచాప ఎత్తినట్టు
జీవితం ఫలమంతమయ్యే
గాఢమైన కోరిక ఒకటి ఫలించింది
బహుళపక్షం తదియ రాత్రి
కొండమీద చంద్రుడు పలకరిస్తూ
తాకిన వసంత మారుతం
యూకలిప్టస్ తోటల
పత్రహరితంలో సుగంధ తైలం
ఏదో తయారవుతున్నట్టు
ఆ దారిలో నడిచే ప్రతి ఒక్కరికి
ఆయాచితంగా
స్వస్థత చేకూర్చే గాలి
తగిలినట్టుగా వుంది
కృష్ణపక్షపు రాత్రుల్లో వజ్రాలు వెదజల్లినట్టుగా
ఆకాశమంతా చిన్న చిన్న నక్షత్రాలు
పువ్వులన్నిటిమీద నక్షత్ర దూళి
రాలి పడినట్టు
వెన్నెల తెరలు తెరలుగా కురిసి
లిపి లేని ప్రేమ లేఖలా
అల్లిబిల్లిగా అల్లుకుంది
గిరిజనులు ప్రకృతి పండగలతో
గ్రామాన్ని వెలిగిస్తారేమో!!
వాళ్ళ దింసా నృత్యం
అడవికి ఒక ప్రాచీన జీవనోత్సవం
వెన్నెల రాత్రి నాట్యం చూడ్డానికి
వచ్చిన వన దేవతల
అపరిచిత ప్రకంపన
అనుభవంలోకి వచ్చినట్టయ్యేది
నెత్తిన ఘూటం పెట్టుకున్న
అమ్మవారిలా తురాయి చెట్టు
రుధిర వర్ణం అల్లుకున్న పూలతో
పోరాట జెండా
ఎగుర వేసినట్టుండేది
హేమంతం అసాంతం
ఎటు చూసినా నవ్వుతు కనిపించే
పాల పూలతో అడవి ముస్తాబుఅయ్యేది
మహారణ్యాంలో
వేసవి చల్లదనపు గాలులు
రాత్రంతా కురిసిన
రాధామనోహరల సౌందర్యం
వైశాఖ మాసపు కృష్ణ మేఘాలు
తెల్లటి కొంగల బారులు
వడివడిగా వచ్చి
హడావిడిగా కురిసి వెళ్లిపోయే
నల్లటి మబ్బులు
పున్నమి రాత్రి పల్లెలో
ఎడ్ల బండి మీద ప్రయాణం
వైశాఖ మాసంలో మామిడి
తొలి పూత గాలి తరగలు
పాటగా అల్లుకోవడం
అన్నీ అద్భుతమే!!!
వసంతంలో వాన,
చైత్రంలో పొద్దున పూట
వైశాఖంలో మధ్యాహ్నం వేళ
అడవి అంతా పలకరిస్తుంది
కొండలమీద..పచ్చగా ప్రజ్వరిల్లే
రేలేపూల వెల్లువ
కళ్లారా చూడాలి
ఆc పూలు పాడే పాటలు
మనసేట్టి వినాలి
అడవిని నిద్రపోనివ్వని
వడ్రంగిపిట్ట చప్పుళ్ళు
చెట్టు చెట్టుకి కోకిల కూజితాలు
మనస్సు పరవశించి
భావాలు ఒదిగి గమ్మత్తుగా
అక్షరాలు తడిసిపోయిన లేఖలా
అర్థం కాకుండా వుంది
సంధ్యా కాంతి చిట్లి
నీటి బిందువుపై పడి
రంగురంగు దారాలుగా
ఊగుతున్నఇంద్రధనస్సు ఐనట్టు
బూరుగుచెట్ల కాయలు పగిలి
దూది గాల్లో తేలిపోవడం..
పాలపుంతకే చిల్లుపడినట్టు
వెన్నెల పల్లెంతా పరుచుకుంది
వనం వదిలి వెళ్ళిపోవడంలో మనస్సు బాధ
వ్యధలకి సుధలకి మధ్య
యోజనాల దూరం..
గతించిన కాలం జ్ఞాపకాలుగా
పచ్చగా చిగురిస్తున్నాయి
మనస్సుకు వసంతం వచ్చిందేమో!!

(ప్రతి ఏడు పాడేరు ఏజెన్సీలో అల్లూరి నిర్మించిన భరతమాత ఆశ్రమం ప్రయాణపు దారిలో కలిగిన ఆనందం)

అనిత కృష్ణ
9490876621

మరో స్పార్టకస్ నల్లా నర్సింహులు

ముప్పై ఏండ్ల కిందట ఉమ్మడి వరంగల్ జిల్లా పాలకుర్తిలో మేడే ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎడ్లబండ్లపై ప్రభలు, ఎర్రచొక్కాల వాలంటీర్లు, కార్యకర్తల కవాతులతో గ్రామ వీధులన్నీ ఎర్రబారాయి. గ్రామమంతా తోరణాలతో అలంకరించా రు. కళాకారులు ఆలపించిన విప్లవ గీతాలతో జనసంద్రమంతా హోరెత్తింది. విద్యార్థి సంఘం కార్యక్రమాల్లో అప్పుడప్పుడు పాల్గొంటున్న నేను, ప్రతి మేడే రోజున ఇంటి దగ్గర వేపచెట్టు చిటారు కొమ్మకు ఎర్రజెండా కట్టి ఆనందించడం మాత్రమే తెలుసు. కానీ ఆ రోజు జరిగిన మేడే ఉత్సవాలను చూసినప్పుడు కామ్రేడ్ నల్లా నర్సింహులు రాసిన 'సాయుధ పోరాటం - జ్ఞాపకాలు' పుస్తకంలోని అనేక ఘటనలు, అమరుల త్యాగాలు, పోరాట గాథలు గుర్తుకొచ్చాయి. ఆ పుస్తకాన్ని అంతకుముందు సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ జీడి సోమనర్సయ్య నాకు అందించారు. ఆ తర్వాత గూడూరుకు వెళ్లిన సందర్భంలో ఆ గ్రామానికి చెందిన ఓ ఎరుకల కళాకారుడు నాలుగు పాటలు పాడి నాలో ఉత్తేజాన్ని నింపాడు. అందులో ఒక పాట...

"కడవెండి గ్రామాన నల్లోల నర్సిమ్మ, పేరు జెప్పి గుంజికొట్టెరా దొరగాడ, నీకైన మొనగాడురా..."

ఈ పాట ఆ కళాకారుడి నోట విన్నప్పుడు నిజంగానే ఒంటిపై రోమాలు నిక్కబొడుచుకున్నాయి. నల్లా నర్సింహులు గొప్పతనం గురించి ఆనాటి తరం నుంచి అనేకమంది నోట వినే అవకాశం లభించడం విశేషం. 1993 వరకు ఈ నేలపై జీవించి, ప్రజా ఉద్యమాలతో మమేకమైన నల్లా నర్సింహులు మరో స్పార్టకస్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రాచీన రోమ్‌లో బానిసత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన స్పార్టకస్ మాదిరిగానే, భూస్వామ్య బానిసత్వంలో మగ్గుతున్న ప్రజలకు విముక్తి కల్పించేందుకు నర్సింహులు నికరంగా పోరాడారు. మరణం తప్పదని తెలిసినా, మూడు కేసుల్లో ఉరిశిక్షలు ఖరారైనా, తన ఉన్నతాశయం కోసం ఉక్కుమనిషిలా నిలబడ్డారు.

వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా తిరుగుబాటు

విస్నూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి తల్లి జానమ్మ దొరసాని కడవెండిలో భూస్వామిగా ప్రజలను వెట్టిచాకిరీతో పీడించేది. ఆ పీడనకు గురైన కడవెండి గ్రామంలో నల్లా లచ్చమ్మ, లచ్చయ్య దంపతులకు 1926 సెప్టెంబర్ 2న నల్లా నర్సింహులు జన్మించారు. వీరిది చేనేత కార్మిక కుటుంబం. ఆ రోజుల్లో ఉర్దూ మాధ్యమంలో ఏడో తరగతి వరకు చదువుకున్న నర్సింహులు ఉపాధి కోసం కొంతకాలం జానమ్మ దగ్గర గుమాస్తాగా పనిచేశారు. అక్కడ జానమ్మ దొరసాని ఆగడాలను, ప్రజలపై ఆమె సాగిస్తున్న దౌర్జన్యాలను కళ్లారా చూసి చలించిపోయారు. పదిహేడో ఏటనే తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. అందుకు ఎర్రజెండాయే సరైన మార్గమని నమ్మి విప్లవబాట పట్టారు. జనగాం ప్రాంతంలో నల్లా నర్సింహులు పేరు ప్రతి ఇంటా వినిపించేది. ఆయన దళం వస్తుందంటే భూస్వాములు ఇళ్లు విడిచి పారిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఒకే రోజు ఆరేడు రజాకార్ కేంద్రాలపై, భూస్వాముల ఇళ్లపై దాడులు నిర్వహించి సంచలనాలకు కేంద్రబిందువుగా మారారు.

ఆంధ్ర మహాసభ ఏర్పాటు.. కార్యదర్శిగా నర్సింహులు


1944 అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా కడవెండిలో ఒక కమిటీని ఏర్పాటు చేశారు. దావీదు రెడ్డి అధ్యక్షుడిగా, నల్లా నర్సింహులు కార్యదర్శిగా ఎన్నికయ్యారు. దొడ్డి మల్లయ్య, మచ్చ రామయ్య, మాచర్ల కొండయ్య తదితరులు ఈ నిర్మాణంలో కీలకంగా వ్యవహరించారు. 1945 ఫిబ్రవరిలో పాలకుర్తిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఆంధ్ర మహాసభ నాయకుడు ఆరుట్ల రామచంద్రారెడ్డిని హత్య చేయడానికి విస్నూరు దేశ్‌ముఖ్ రామచంద్రారెడ్డి గూండాలను పాలకుర్తికి పంపించాడు. సభ ప్రారంభమైన సమయంలోనే గూండాలు అలజడి సృష్టించేందుకు ప్రయత్నించగా, వాలంటీర్లు వారిని ఎదుర్కొని తరిమికొట్టారు. ఆరుట్ల రామచంద్రారెడ్డిని మారువేషంలో మరోచోటికి తరలించారు. మొండ్రాయికి చెందిన జాటోతు దర్యా నాయక్, నల్లా నర్సింహులు ఆ రాత్రి కొండాపురం వెళ్లి బస చేశారు. ఈ ఘటన పాలకుర్తి కుట్ర కేసుగా చరిత్రలో నిలిచింది. కొద్దికాలంలోనే జనగాం తాలూకా ఆంధ్ర మహాసభ అధ్యక్షుడిగా రాగి నర్సింహులు, ఉపాధ్యక్షుడిగా బుచ్చిరెడ్డి, కార్యదర్శిగా నల్లా నర్సింహులు ఎన్నికయ్యారు. కడవెండి దొరసానికి చెందిన 80 పుట్ల వరి ధాన్యాన్ని జప్తు చేయించడంలో నర్సింహులు కీలక పాత్ర పోషించారు. దీంతో జానమ్మ దొరసాని తన కొడుకు విస్నూరు దేశ్‌ముఖ్‌తో కలిసి మోహన్‌రెడ్డి, నర్సింహులును హత్య చేయడానికి కుట్ర పన్నారు.

కొమరయ్య మరణం.. నెరవేరని దొరసాని లక్ష్యం!

అప్పటివరకు జరిగిన పరిణామాలను రాష్ట్ర పార్టీ నాయకత్వానికి వివరించేందుకు జూలై 3న నర్సింహులు హైదరాబాద్ వెళ్లి రాష్ట్ర పార్టీ ఆర్గనైజర్ ఎస్వీకే ప్రసాద్‌ను కలిశారు. జూలై 4న కడవెండిలో దేశ్‌ముఖ్ గూండాలు అల్లర్లు సృష్టించారు. కమ్యూనిస్టు కార్యకర్తల ఇళ్లపై రాళ్లతో దాడులు చేశారు. ఇదే సమయంలో స్థానిక నాయకుడు యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి నాయకత్వంలో వందమంది కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో దొడ్డి కొమురయ్య ప్రాణాలు కోల్పోయారు. ఆయన అన్న మల్లయ్యతో పాటు మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మోహన్‌రెడ్డి, నర్సింహులును హత్య చేయాలన్న దొరసాని కుట్ర మాత్రం ఫలించలేదు. ఈ రక్తపాత ఘటన తెలంగాణ అంతటా అగ్నిని రాజేసింది. దొడ్డి కొమురయ్య వీరమరణంతో రైతాంగ ఉద్యమం సాయుధ పోరాటంగా కీలక మలుపు తిరిగింది.

జైలు నుంచి తప్పించుకొని.. గెరిల్లా శిక్షణ

పోరాట క్షేత్రంలో కీలక నాయకుడిగా ఎదిగిన నర్సింహులును 1946 అక్టోబర్‌లో అరెస్టు చేసి ధర్మాపురం క్యాంపునకు తరలించారు. 18 రోజుల తర్వాత జనగాం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి నల్లగొండ జైలుకు పంపించారు. ఆ తర్వాత హైదరాబాద్, మహబూబ్ నగర్ జైళ్లకు తరలించారు. 1947 జనవరిలో నల్లా నర్సింహులు, యర్రంరెడ్డి మోహన్‌రెడ్డి జైలు నుంచి తప్పించుకున్నారు. కర్నూలు మీదుగా విజయవాడ చేరుకున్నారు. అక్కడే ఉండి గెరిల్లా యుద్ధ శిక్షణ పొందారు. కృష్ణా జిల్లాలోని ఒక గ్రామంలో పార్టీ కీలక నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, భీంరెడ్డి నర్సింహారెడ్డి తదితరులతో కలిసి ఆయుధ శిక్షణ తీసుకున్నారు. కొండపల్లి గుట్టల్లో శిక్షణ పూర్తిచేసుకుని తిరిగి జనగాం ప్రాంతానికి చేరుకున్నారు. దేవరుప్పుల గ్రామంలో మోహన్‌రెడ్డి ఆశ్రయం పొందగా, నర్సింహులు బంజర గ్రామానికి వెళ్లారు. పార్టీ వ్యతిరేకులు అందించిన సమాచారంతో మోహన్‌రెడ్డి అరెస్టయ్యారు. ఆయనపై మూడు కేసులు నమోదు చేసి హైదరాబాద్ సెంట్రల్ జైలుకు తరలించారు. మోహన్‌రెడ్డి నర్సింహులుతో లేకపోవడంతో నర్సింహులు అరెస్టు నుంచి తప్పించుకున్నారు.



కడవెండి గ్రామంలో ఉద్యమాన్ని అణచివేయాలనే లక్ష్యంతో భూస్వాములకు, పోలీసులకు తొత్తుగా మారిన పట్వారి ఈటూరు నరసింహారావును శిక్షించాలని దళం నిర్ణయించింది. 1947 నవంబర్‌లో ఒకరోజు తెట్టెకుంట పొలం వద్దకు వెళ్తున్న నరసింహారావును మాటువేసి పట్టుకున్న దళం అతనిపై దాడి చేసింది. ఈ దాడిలో అతను మరణించాడు. కోలుకొండ గ్రామంలో దేశ్‌ముఖ్ ఏజెంట్లు రంగయ్య, అబ్దుల్ నబీ, ఈరవెన్ను గ్రామంలో ఒక భూస్వామి దళం చేతిలో హతమయ్యారు. దేవరుప్పుల గ్రామంలో దేశ్‌ముఖ్ మరో ఏజెంటు అబ్బాస్ అలీని చితకబాదారు. కోమాళ్లపల్లి భూస్వామి ప్రతాప్‌రెడ్డిపై 60 మందితో కూడిన దళం దాడి చేసి హతమార్చింది. ఇలా అనేక ప్రాంతాల్లో భూస్వామ్య శక్తులపై దాడులు నిర్వహించి వారికి గుణపాఠం నేర్పారు. జనగాం తూర్పు ప్రాంతంలో దళాల జైత్రయాత్రలు ప్రారంభమయ్యాయి. 11 మందితో కూడిన దళం గ్రామాలు తిరుగుతుంటే ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దాదాపు వంద గ్రామాల్లో ఈ జైత్రయాత్ర కొనసాగింది. భూస్వాముల ఇళ్లపై దాడులు చేసి తుపాకులు, ఇతర ఆయుధాలను సమకూర్చుకున్నారు.



- మామిండ్ల రమేష్ రాజా
రాష్ట్ర కార్యదర్శి సీపీఐ (ఎంఎల్) లిబరేషన్, తెలంగాణ.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

- రైతుల సమక్షంలోనే సమగ్ర భూ సర్వే : మంత్రి పొంగులేటి శ్రీనువాసు రెడ్డి
- వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమి సర్వే పూర్తి చేయడమే లక్ష్యం



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04 (జనంసాక్షి) :
రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు రైతులకు భద్రతతో కూడిన భూ హక్కులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర భూ సర్వే చేపడుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రైతుల సమక్షంలోనే భూముల రీసర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని సర్వే చేసి, వివాదరహిత భూ రికార్డులు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలో భూ సర్వే, రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, హౌసింగ్ అంశాలపై జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో భూమికి సంబంధించిన సమగ్ర, భద్రతతో కూడిన రికార్డులు, పాస్‌పుస్తకాలు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమన్నారు. అధికారుల నిరంతర పర్యవేక్షణ.. రీసర్వే చేపట్టే గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని మంత్రి సూచించారు. ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించడంతోపాటు కనీసం వారంలో ఒకరోజైనా సర్వే జరుగుతున్న గ్రామాలను సందర్శించాలని ఆదేశించారు. తొలి విడతలో రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన రెవెన్యూ గ్రామాల్లో సర్వేను వేగవంతంగా చేపడతామన్నారు. మండల స్థాయి అధికారులను యాదృచ్ఛికంగా ఎంపిక చేసి, పెండింగ్ దరఖాస్తులు, ప్రజల అభ్యంతరాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలపై నేరుగా చర్చిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం.. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను అధికారులు దాచిపెట్టకుండా స్పష్టంగా వివరించాలని మంత్రి సూచించారు. ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలు, పరిష్కారానికి అవసరమైన ప్రభుత్వ అనుమతులు, మార్గదర్శకాలపై ఉన్నది ఉన్నట్లుగా తెలియజేస్తే సంబంధిత అధికారులకు అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేస్తామని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలను నిజాయితీగా పరిష్కరించే అధికారులను ప్రభుత్వం అభినందిస్తుందని, ఉద్దేశపూర్వకంగా సమస్యలను తప్పుదోవ పట్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాదాపు 125 ఏళ్ల క్రితం జరిగిన సర్వే తర్వాత రాష్ట్రంలో ఇంత విస్తృత స్థాయిలో సమగ్ర భూ సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. సర్వే నంబర్లు ఒకచోట ఉండటం, భూముల వాస్తవ స్వాధీన స్థితి మరోచోట ఉండటం వంటి సమస్యలకు ఈ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, పట్టా భూముల సమస్యలు, భూముల హద్దుల వివాదాలను గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 22-ఏకు సంబంధించి ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, మెమోల పరిధిలోకి రాని సమస్యలు ఏవైనా ఉంటే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమగ్ర భూ సర్వే విజయవంతానికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద రావు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు కాలే యాదయ్య, మనోహర్ రెడ్డి, అరికెపూడి గాంధీ, బండారు లక్ష్మారెడ్డి, ఈర్లపల్లి శంకర్, మర్రి రాజశేఖర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి
రైతులు రీ సర్వేకు సహకరించాలి

పారదర్శకంగా భూ రీ సర్వే ఆర్ఐ గోపాల్, జేపీఓ శ్రీవర్ధన్

రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం పొందాలి



వికారాబాద్, నవంబర్ 4 (జనంసాక్షి): బంట్వారం మండల పరిధిలోని మంగ్రాస్‌పల్లిలో బుధవారం బంట్వారం మండల ఆర్ఐ గోపాల్, మంగ్రాస్‌పల్లి జేపీఓ శ్రీవర్ధన్ ఆధ్వర్యంలో భూ రీ సర్వే కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించారు. రైతుల భూ సమస్యల పరిష్కారం, భూముల సరిహద్దుల నిర్ధారణ, భూ రికార్డుల్లో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమానికి రైతులందరూ సంపూర్ణ సహకారం అందించాలని అధికారులు కోరారు. ఇందులో భాగంగా గ్రామంలోని 7, 8, 9, 10, 11, 12, 13, 14, 15 సర్వే నంబర్లలో భూముల రీ సర్వే చేపట్టారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతి పట్టాదారు రైతు భూ రీ సర్వే ప్రాముఖ్యతను గుర్తించి, తమ భూములకు సంబంధించిన పత్రాలు, వివరాలను సర్వే సిబ్బందికి అందుబాటులో ఉంచాలని సూచించారు. సర్వే సమయంలో రైతులు స్వయంగా హాజరై తమ భూముల హద్దులు, సరిహద్దుల గుర్తింపులో అధికారులకు సహకరించాలని కోరారు.భూ రీ సర్వే అనేది రైతుల భూములకు సంబంధించిన సమస్యలను గుర్తించి పరిష్కరించుకోవడానికి ఒక మంచి అవకాశం. భూముల హద్దుల విషయంలో భవిష్యత్తులో తలెత్తే వివాదాలను తగ్గించడంతో పాటు, భూ రికార్డుల్లో స్పష్టత తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కాబట్టి రైతులు ఎలాంటి అపోహలకు తావివ్వకుండా అధికారులకు పూర్తి సహకారం అందించి, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మంగ్రాస్‌పల్లి ఉపసర్పంచ్ రియాజోద్దీన్, సర్వేయర్లు శ్రీకాంత్, భరత్, వార్డు సభ్యులు పంజుగుల మల్లేశం, ఫకృద్దీన్, పంజుగుల అంజిలయ్య, కావలి అనంతి, మౌలానా, చాంద్ పాషా, సంజీవ్, నవీన్ కుమార్, నర్సిములు, గ్రామ ప్రజలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ డీకే అరుణ లేఖతో కదిలిన ఆర్టీసీ అధికారులు

- పలు గ్రామాలు, తండాలకు బస్సు సౌకర్యంపై స్పందన
- క్షేత్రస్థాయిలో రహదారి పరిశీలించిన కోస్గి డిపో మేనేజర్
- విద్యార్థులు, ప్రజల ప్రయాణ కష్టాలకు త్వరలో పరిష్కారం

బొంరాస్‌పేట, నవంబర్ 04 (జనంసాక్షి): మండల పరిధిలోని పలు గ్రామాలు, తండాలకు బస్సు సౌకర్యం కల్పించాలన్న స్థానికుల విజ్ఞప్తిపై మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ స్పందించారు. బాపల్లి తండా, తుంకిమెట్ల, బొంరాస్‌పేట, మెట్లకుంట, లోతుకుంట తండా తోపాటు పరిగి మండలంలోని గడిసింగాపూర్‌కు బస్సులు నడపాలని స్థానిక బీజేపీ నాయకులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోస్గి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఎంపీ లేఖ రాశారు. ఎంపీ లేఖపై స్పందించిన డిపో మేనేజర్ బుధవారం కోస్గి నుంచి పరిగి వరకు మెట్లకుంట, లోతుకుంట తండా మీదుగా బస్సు రాకపోకలకు అనువైన రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చాలాకాలంగా బస్సు సౌకర్యం లేక విద్యార్థులు, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు త్వరలో తొలగుతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు. బస్సు సౌకర్యం కల్పించేందుకు అధికారులు స్పందించడంపై హర్షం తెలిపారు. డిపో మేనేజర్ వెంట బీజేపీ నాయకులు ఉప్పు జగదీశ్వర్, రాజారామ్‌రెడ్డి, సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయొద్దు

- ఈ నెల 6న హైదరాబాద్‌లో భారీ ధర్నా
- కూలీల హక్కులను హరించే చర్యలను అడ్డుకోవాలి
- ఏటా 200 రోజుల పని.. రోజుకు రూ.800 కూలీ ఇవ్వాలి
- ధర్నాలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: ఎం.వెంకటయ్య



బొంరాస్‌పేట్, నవంబర్ 04 (జనంసాక్షి): గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలని, కూలీల హక్కులను కాపాడాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాలో ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం బొంరాస్‌పేట్ మండల కేంద్రంలో నాయకులు ధర్నా కరపత్రాలను విడుదల చేశారు.ఈ సందర్భంగా వెంకటయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు బస్సు చంద్రయ్య, కొత్తూరు చంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గడంతో పేదలు, వ్యవసాయ కార్మికులు వలసబాట పట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కొత్త మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీల ఏర్పాటు పేరుతో గ్రామాలను పట్టణ ప్రాంతాల్లో విలీనం చేయడం వల్ల ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిలిచిపోయి వేలాది మంది కూలీలు ఉపాధి కోల్పోతున్నారని పేర్కొన్నారు.
కూలీలకు ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని, రోజుకు రూ.800 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయడంతోపాటు పని ప్రదేశాల్లో తాగునీరు, వైద్య కిట్లు, వేసవి అలవెన్సులు కల్పించాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల ఖాళీలను భర్తీ చేయాలని, పట్టణ ప్రాంతాల్లో విలీనమైన గ్రామాల్లోనూ ఉపాధి హామీ పనులు కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6న హైదరాబాద్‌లో జరిగే ధర్నాలో కూలీలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పథక పరిరక్షణ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజు, వెంకటయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులున్నా ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు మోకాలడ్డెందుకు?

- కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంపై ముప్పా రామారావు ఫిర్యాదు
- పలు కాలనీల్లో నిలిచిన రిజిస్ట్రేషన్లు
- అక్రమ వసూళ్ల ఆరోపణలపై సమగ్ర విచారణకు డిమాండ్
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04 (జనంసాక్షి): చట్టబద్ధమైన పత్రాలు, సంబంధిత అనుమతులు ఉన్నప్పటికీ ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు అడ్డంకులు సృష్టించడంపై సమగ్ర విచారణ జరిపించాలని దమ్మాయిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్పా రామారావు డిమాండ్ చేశారు. కీసర సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులపై బుధవారం పద్మశాలి సంఘం ప్రతినిధులతో కలిసి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని భవన ఋషి, నాగ పద్మశాలి టౌన్‌షిప్, సాయిబృందావన్ కాలనీ, అయ్యప్ప కాలనీ, సిద్ధార్థ నగర్, మారుతి నగర్ తదితర ప్రాంతాల్లో ప్లాట్ల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయని తెలిపారు. సర్వే నంబర్లు 388, 407, 408, 409 పరిధిలోని ప్లాట్లకు విక్రేతల వద్ద చట్టబద్ధమైన పత్రాలు, జీహెచ్ఎంసీ అనుమతులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు చేయడం లేదని ఆరోపించారు. దీంతో కొనుగోలుదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.
కొన్ని డాక్యుమెంట్లకు స్టాంప్ వెండర్ల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసేందుకు అనుమతిస్తూ, మరికొన్ని సందర్భాల్లో పెద్ద మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. చట్టబద్ధమైన పత్రాలు, అనుమతులున్న ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు ఆటంకాలు తొలగించి కొనుగోలుదారులకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాండాల యాదగిరి గౌడ్, పద్మశాలి టౌన్‌షిప్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సదానంద్ గౌడ్, సంయుక్త కార్యదర్శి కోలా నరసింహ గౌడ్, ఎగ్జిక్యూటివ్ బాడీ సభ్యుడు ఎం.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్-సిటీ గ్రేడ్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన సిఎంసి కమిషనర్



శేరిలింగంపల్లి, నవంబర్ 4 (జనంసాక్షి) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి. సృజన బుధవారం ఖాజాగూడ, ఐఐఐటి జంక్షన్లవద్ద జరుగుతున్న హెచ్-సిటీ గ్రేడ్ సెపరేటర్ పనులతోపాటు సైబరాబాద్ పరిధిలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కీలక మౌలిక సదుపాయాల అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ తనిఖీలో భాగంగా సిఎంసి కమిషనర్ తోపాటు చీఫ్ ఇంజనీర్, చీఫ్ సిటీ ప్లానర్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్, శేరిలింగంపల్లి జోన్ సిటీ ప్లానర్, డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పనులను వేగవంతం చేసి పెండింగ్‌లోవున్న అన్ని పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులద్వారా ట్రాఫిక్ రాకపోకలు సులభతరం కావడంతోపాటు, ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రజలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని కమిషనర్ పేర్కొన్నారు. పనుల పురోగతిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, సంబంధిత శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని, పనులు సకాలంలో పూర్తి కావడానికి ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. సైబరాబాద్ పరిధిలో పట్టణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంతోపాటు మెరుగైన ట్రాఫిక్ నిర్వహణకు సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎల్లప్పుడూ కృత నిశ్చయంతో ఉంటుందని సిఎంసి కమిషనర్ తెలియజేశారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు కోట్‌పల్లి విద్యార్థి ఎంపిక

కోట్‌పల్లి నవంబర్ 04 (జనంసాక్షి): కోట్‌పల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి కె. మహేష్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పాఠశాలతో పాటు మండలానికి గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి చంద్రప్ప విద్యార్థి మహేష్‌ను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ పాల్గొని ప్రతిభ చాటేలా అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు అక్షర ఎంపిక

ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ

దోమ, (జనంసాక్షి): పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థిని అక్షర రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 బాలికల వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా అక్షర విజయంపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ఈ విజయాన్ని అందుకుందని కొనియాడారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.







అంతా సిద్ధం..అనుమతులే ఆలస్యం?

రూ.27.50 కోట్లతో కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగుపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం

- అటవీశాఖ అనుమతులు రాగానే పనులు ప్రారంభం
- అటవీ,ఆర్‌అండ్‌బీ అధికారుల సంయుక్త సర్వే పూర్తి
- వంతెన నిర్మాణానికి హద్దుల గుర్తింపు. సాంకేతిక వివరాల సేకరణ
- గడ్డమీది గంగారం అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి మొలకల బావి సమీపం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం
- ధారూర్, కోట్‌పల్లి, బంట్వారం,పెద్దేముల్ మండలాలతో పాటు కర్ణాటకకు సులభతర రాకపోకలు



ధారూర్,నవంబర్ 04(జనంసాక్షి) : ధారూర్-కోట్‌పల్లి రహదారిపై కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి మార్గం సుగమమవుతోంది. ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.27.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు జారీ చేసింది.అయితే అటవీ ప్రాంతానికి సంబంధించిన అనుమతులు రావాల్సి ఉండటంతో పనుల ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. అటవీశాఖ అనుమతులు అందిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.ఈ వంతెన నిర్మాణంతో పాటు గడ్డమీది గంగారం అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి మొలకల బావి సమీపం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టే ప్రతిపాదన ఉంది.అటవీ, రోడ్లు భవనాల శాఖ అధికారులు ఇప్పటికే సంయుక్తంగా సర్వే పూర్తి చేసి, హై లెవెల్ బ్రిడ్జి నిర్మించాల్సిన ప్రాంతంలో హద్దులను గుర్తించారు. వంతెన నిర్మాణానికి అవసరమైన సాంకేతిక వివరాలు,స్థల పరిశీలన ప్రక్రియను కూడా అధికారులు చేపట్టారు.ఈ పనికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం రోడ్లు,భవనాల శాఖ ద్వారా ఎండీఆర్-ప్లాన్ కింద రూ.27.50 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. 2026 ఫిబ్రవరి 24న జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఫిబ్రవరి 26న మెమో నంబర్ 2561 ద్వారా సంగారెడ్డి రోడ్లు,భవనాల శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌కు తదుపరి సాంకేతిక వివరాలు సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రతిపాదిత వంతెనకు సంబంధించిన స్థల ప్రణాళిక,ప్రస్తుతం ఉన్న వంతెన పునాది వివరాలు, రహదారి రేఖాంశ విభాగం, వాగు అడ్డ విభాగాలు,పాత వంతెన ఛాయాచిత్రాలు,భూగర్భ మట్టి పరిశీలన నివేదిక, పరివాహక ప్రాంతం, నీటి ప్రవాహ సామర్థ్యానికి సంబంధించిన వివరాలను సమర్పించాలని సూచించారు.హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే ధారూర్, కోట్‌పల్లి, బంట్వారం,పెద్దేముల్ మండలాల ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. అంతేకాకుండా కర్ణాటక రాష్ట్రానికి వెళ్లే వాహనదారులకు కూడా ప్రయాణ దూరం, సమయం తగ్గి రాకపోకలు సులభతరం కానున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా,వ్యాపార కార్యకలాపాలు,ప్రజల నిత్య ప్రయాణాలకు ఈ రహదారి ఎంతో ఉపయోగకరంగా మారనుంది.ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం,అధికారులు సర్వే పూర్తి చేసి హద్దులు గుర్తించడం వంటి ప్రక్రియలు పూర్తయిన నేపథ్యంలో ఇక అటవీశాఖ అనుమతులే కీలకంగా మారాయి.అనుమతులు ఎప్పుడు వస్తాయి.?నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయి.?అన్నదానిపై ఈ ప్రాంత ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కోట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో
అధికారుల ఇష్టారాజ్యం!

తహసీల్దార్ మినహా.. మిగతా అధికారులకు సమయపాలన లేదా.?

- సమయానికి విధులకు హాజరుకాని కొందరు అధికారులు.
- కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ప్రజల పడిగాపులు.
- ప్రభుత్వ నిబంధనలు ఉన్నా,అమలులో మాత్రం నిర్లక్ష్యం.
- ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి : ప్రజలు

కోట్‌పల్లి నవంబర్ 04(జనంసాక్షి): ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు సకాలంలో సేవలు అందించాల్సిన అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోట్‌పల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో సమయపాలన గాడి తప్పిందనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. తహసీల్దార్ మినహా మిగతా కొందరు అధికారులు సమయానికి కార్యాలయానికి హాజరుకావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్దిష్ట సమయానికి విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన అధికారులు ఆలస్యంగా రావడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
భూములకు సంబంధించిన పనులు, ధ్రువపత్రాలు, ఇతర రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో వ్యయప్రయాసలకోర్చి ప్రజలు తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. అయితే సంబంధిత అధికారులు సమయానికి అందుబాటులో లేకపోవడంతో పనులు జరగక గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు పనులు వదులుకొని కార్యాలయాలకు వస్తే, మరోవైపు అధికారులు అందుబాటులో లేకపోవడంతో తిరిగి వెనుదిరగాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.
ప్రభుత్వం ప్రజలకు పారదర్శకమైన పాలన అందించాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఆదేశాలు జారీ చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం కొందరు అధికారుల తీరు మారడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. తహసీల్దార్ సమయానికి విధులకు హాజరవుతున్నప్పటికీ మిగతా అధికారుల విషయంలో ఈ పరిస్థితి ఎందుకు కొనసాగుతోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అంటున్నారు.
ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కోట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల హాజరు, సమయపాలనపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. విధులకు ఆలస్యంగా హాజరవుతున్న వారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని, కార్యాలయానికి వచ్చే ప్రతి ఒక్కరికీ సకాలంలో సేవలు అందేలా పర్యవేక్షణ పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ కార్యాలయాలే ప్రజలను నిరీక్షణకు గురిచేస్తే పాలనపై నమ్మకం ఎలా కలుగుతుందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

తహసిల్దార్ వివరణ :

ఈ విషయంపై వివరణ కోరేందుకు తహసీల్దార్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. అనంతరం కార్యాలయంలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని సందేశం పంపగా, తాను సమావేశంలో ఉన్నానని, రేపు ఫోన్ చేస్తానని సమాధానమిచ్చారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
05 నవంబర్ 2026

సైబర్ నేరాలపై అప్రమత్తతే అసలైన రక్షణ

● జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 4 (జనం సాక్షి) : సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ సైబర్ నేరాల రూపాలు కూడా మారుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తమ వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని సురక్షితంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు సూచించారు. సైబర్ నేరాల నివారణలో భాగంగా ప్రతి నెల మొదటి బుధవారం నిర్వహిస్తున్న సైబర్ జాగ్రత్త దివాస్ కార్యక్రమంలో భాగంగా బుదవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించే పోస్టర్లను జిల్లా ఎస్పీ అదనపు ఎస్పీ కె. శంకర్ తో కలిసి విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ షాపింగ్, యూపీఐ, నెట్ బ్యాంకింగ్ వంటి సేవలను వినియోగించే సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా సైబర్ నేరగాళ్లకు అవకాశం కల్పిస్తుందని తెలిపారు. తెలియని లింకులు, ఆకర్షణీయమైన ఆఫర్లు, నకిలీ వెబ్‌సైట్లు, ఫేక్ యాప్‌లు, మోసపూరిత కాల్స్ ద్వారా ప్రజలను మోసం చేస్తున్నారని హెచ్చరించారు.

సైబర్ మోసాల నుంచి రక్షణకు ప్రజలు రక్షణ పొందాలంటే వినికిడి, చూపు, స్పర్శ, వాసన, అభిరుచి వంటి పంచేంద్రియాల సమాచారాన్ని అనవసర యాప్‌లు లేదా వెబ్‌సైట్లకు ఇవ్వకూడదు. తెలియని వ్యక్తులతో వీడియో కాల్స్, ఆన్‌లైన్ చాటింగ్‌లో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు. అనుమానాస్పద



లింకులు, ఫేక్ మెసేజ్‌లు, తెలియని యాప్‌లను ఓపెన్ చేయకూడదనీ ,తెలియని వ్యక్తులు పంపిన లింకుల ద్వారా యాప్‌లు డౌన్‌లోడ్ చేయవద్దు. సైబర్ నేరగాళ్లు అడిగినప్పటికీ ఓ టి పి, పి ఐ ఎన్, పాస్‌వర్డ్ వంటి వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దనీ, పబ్లిక్ ఔఅ-ఖీఅ, అనుమానాస్పద నెట్‌వర్క్‌లలో బ్యాంకింగ్ లేదా ఇతర ఆర్థిక లావాదేవీలు చేయవద్దు. మొబైల్ ఫోన్, యాప్‌లు, సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. అవసరం లేని యాప్‌లకు కెమెరా, మైక్రోఫోన్, కాంటాక్ట్స్ వంటి అనుమతులు ఇవ్వకూడదు.

ఆన్‌లైన్ షాపింగ్ సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు

భారీ డిస్కౌంట్లు, తక్కువ ధరల పేరుతో వచ్చే సందేశాలను నమ్మి మోసపోవద్దని పోలీసులు సూచించారు. నకిలీ వెబ్‌సైట్ల ద్వారా ప్రజలను మోసం చేసే అవకాశం ఉన్నందున, వెబ్‌సైట్ యొక్క సరైన అడ్రస్‌ను పరిశీలించిన తర్వాతే కొనుగోళ్లు చేయాలని తెలిపారు. తెలియని లింకులపై క్లిక్ చేయకుండా, వీలైనంత వరకు నమ్మకమైన వెబ్‌సైట్లు, అధికారిక యాప్‌ల ద్వారా మాత్రమే షాపింగ్ చేయాలని సూచించారు. డిజిటల్ చెల్లింపుల్లో అప్రమత్తత అవసరం ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు అధికారి, యూపీఐ ప్రతినిధి లేదా ఇతర సంస్థల ప్రతినిధినని చెప్పినా వెంటనే నమ్మవద్దని తెలిపారు. ఇ మెయిల్ లేదా సోషల్ మీడియా ద్వారా వచ్చిన అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని సూచించారు. ఖూ× ద్వారా డబ్బు పొందడానికి ౫= కోడ్ స్కాన్ చేయాల్సిన అవసరం లేదని, డబ్బు పంపే సమయంలో మాత్రమే జాగ్రత్తగా వివరాలు నమోదు చేయాలని తెలిపారు. ఫోన్ కాల్‌లో ఎవరైనా బ్యాంకు వివరాలు, ఖూ,ఖ×చీ లేదా పాస్‌వర్డ్ అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పకూడదని హెచ్చరించారు.

అప్రమత్తతే సైబర్ భద్రతకు మొదటి అడుగు

సైబర్ నేరాల బారిన పడిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే అధికారిక సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని జిల్లా పోలీసులు తెలిపారు. ప్రజల భద్రతే లక్ష్యంగా, సైబర్ నేరాలపై నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ జిల్లా పోలీసులు ముందుకు సాగుతున్నారని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ మధు మోహన్



మల్దకల్, నవంబర్ 4 (జనంసాక్షి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీసర్వే పనులను ఎలాంటి తగాదాలకు అస్కారం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు.మల్దకల్ మండలంలోని బూడిదపాడు గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను అదనపు కలెక్టర్ మధుమోహన్ బుధవారం క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని సమీక్షించారు. క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహణ తీరును, సంబంధిత రికార్డులను పరిశీలించి,పనుల అమలులో ఎదురవుతున్న అంశాలపై అధికారులతో చర్చించారు.పునఃసర్వే ప్రక్రియను పారదర్శకంగా, సమన్వయంతో నిర్వహిస్తూ,నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రీ సర్వేతో భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.సర్వేకు లైసెన్స్ సర్వేయర్ల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.ఈ పర్యటనలో సర్వే ఏడి నూకరాజు, మల్దకల్ తహసీల్దార్ ఝాన్సీరాణి,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

● రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం
● కోహెడ ఏఎంసి చైర్ పర్సన్ బోయిని నిర్మల- జయరాజు
● పలు గ్రామాలలో ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కోహెడ, నవంబర్ 4 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని కోహెడ ఏఎంసి చైర్ పర్సన్ బోయిని నిర్మల – జయరాజు అన్నారు.బుధవారం మండలంలోని నాగ సముద్రాల వింజపల్లి, తీగలకుంట పల్లి గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్థానిక సర్పంచ్ పెరుక సరితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యాన్ని విక్రయించి మద్దత్తు ధరను ఆర్జించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమాలలో ఏపిఎం శ్రీనివాస్, సీసీ శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్ లు మ్యాకల స్వర్ణ లత – సురేందర్ రెడ్డి, అన్నాడి శ్రీజ – జీవన్ రెడ్డి, నాగసముద్రాల, తీగలకుంట పల్లి గ్రామాల ఉప సర్పంచ్ లు పర్వతం సారయ్య, రాగుల మహేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చింతలపల్లి జనార్దన్ రెడ్డి, వార్డు సభ్యులు జేరిపోతుల పద్మ, పండుగ స్వామి, చింతలపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాంకాల కిషన్, దూలం శ్రీనివాస్, పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ పారునంది కరుణాకర్, వివో అధ్యక్షురాలు సుధగోని లక్ష్మి, కార్యదర్శి అప్పిన లావణ్య, వివోఏ చిట్యాల భాగ్యలక్ష్మి, ఆయా గ్రామాల ఐకేపీ సంఘాల మహిళలు, సెంటర్‌ల నిర్వాహకులు, రైతులు గుంటాల శివారెడ్డి, పెరుక రాజ మల్లయ్య, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం అందించాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్



బెజ్జంకి, నవంబర్ 4 (జనం సాక్షి) : మండలంలోని ముత్తన్నపేట గ్రామంలో కరువు పరిస్థితులు,సాగునీటి కొరతతో ఎండిపోయిన పంటలను బుధవారం సీపీఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్ ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి,రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ అప్పులు చేసి సాగు చేసిన పంటలు నీటి కొరతతో కళ్లముందే ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల రూపంలో పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు కేవలం ఓదార్పు సరిపోదని,ప్రభుత్వం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేయాలని కోరారు.ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందించడంతో పాటు తదుపరి పంట సాగుకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు యెదల వనేశ్,మండల సహాయ కార్యదర్శి కల్లూరి బాలమల్లు పరశు రాములు,సంఘ తిరుపతి,బోనగిరి శ్రవణ్,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి దొంతర వేణి మహేష్,ఏఐవైఫ్ మండల అధ్యక్షుడు రాకేష్,కనగండ్ల చంద్రయ్య కుంభం రాములు,బర్ల రాజు,చిన్న తిరుపతిరెడ్డి,రామచ శేఖర్,కనగండ్ల కనకయ్య,రొడ్డ చరణ్,తిరుపతి,గొర్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు చెక్ పెట్టేలా సమగ్ర రీసర్వే

● అదనపు కలెక్టర్ టి. వినోద్ కుమార్

వనపర్తి, నవంబర్ 4 (జనం సాక్షి) : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా పక్కాగా భూ రికార్డులు రూపొందించేందుకు భూ సమగ్ర రీసర్వే కీలకమని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ అన్నారు. రీసర్వే పనులను వేగవంతం చేస్తూ, రైతుల భాగస్వామ్యంతో పూర్తి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం వనపర్తి మండలంలోని నాచహల్లి, కొత్తకోట మండలంలోని నాంచారమ్మపేట, పుల్లారెడ్డికుంట గ్రామాల్లో కొనసాగుతున్న భూ సమగ్ర రీసర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన సర్వే పనుల పురోగతి, సంబంధిత రికార్డులను తనిఖీ



చేసి రెవెన్యూ, సర్వే శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్ణీత గడువులోగా రీసర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సర్వే నిర్వహణలో గ్రామస్తులు, రైతులను భాగస్వాములను చేస్తూ ముందస్తు సమాచారం అందించాలని సూచించారు. ముఖ్యంగా భూముల కొలతలు చేపట్టే సమయంలో సంబంధిత భూ యజమానులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో హాజరయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. భూ యజమానుల సమక్షంలోనే కొలతలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో సరిహద్దులు, భూ హక్కులకు సంబంధించిన వివాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. సర్వేలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా నాణ్యతతో కూడిన రికార్డులు రూపొందించాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో వనపర్తి తహసీల్దార్ రమేష్ రెడ్డి, కొత్తకోట తహసీల్దార్ సుభాష్ నాయుడు, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల అక్షరాస్యతతోనే ఆర్థిక స్వావలంబన..



వనపర్తి బ్యూరో, నవంబర్ 4 (జనం సాక్షి) : మహిళల అక్షరాస్యతే ఆర్థిక స్వావలంబనకు పునాది అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహిళలు చదువుకుంటే ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు కుటుంబం, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించే అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నదే తన ఆకాంక్ష అని స్పష్టం చేశారు. బుధవారం కొల్లాపూర్ నియోజకవర్గం పానగల్ మండలం తెల్లరాళ్లపల్లి గ్రామంలోని నిరక్షరాస్య మహిళలకు చదువు నేర్చుకునేందుకు మంత్రి పలకలు, బలపాలు పంపిణీ చేశారు. వీటి కొనుగోలుకు గతంలోనే రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన ఆయన, అక్షరాస్యత కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని సూచించారు. ఇందులో భాగంగా గ్రామంలోని మహిళలకు ప్రతిరోజూ ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహించి చదువు నేర్పించాలని సర్పంచ్ జంబలయ్యను ఆదేశించారు. ఉపాధ్యాయుల నియామకం, తరగతుల నిర్వహణకు తన వంతు సహాయంగా మరో రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. చదువుకు వయసుతో సంబంధం లేదని, నేర్చుకోవాలనే ఆసక్తి ఉంటే ఏ వయసులోనైనా అక్షరజ్ఞానం సాధించవచ్చని మంత్రి పేర్కొన్నారు. మహిళల్లో చదువుపై ఆసక్తిని పెంచేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. గ్రామంలో ముందుగా చదవడం, రాయడం నేర్చుకునే మహిళకు రూ.5 వేల నగదు బహుమతి అందజేస్తామని వెల్లడించారు. మహిళల అక్షరాస్యతను పెంపొందించి వారిని ఆర్థికంగా, సామాజికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.

బీసీల హక్కుల సాధనకై అక్షర పోరాటం పుస్తకావిష్కరణ



జడ్చర్ల, నవంబర్ 4 (జనంసాక్షి) : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ రచించిన బీసీల హక్కుల సాధనకై అక్షర పోరాటం పుస్తకాన్ని బుధవారం స్థానిక విలేకరులు ఆవిష్కరించారు . ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు కృష్ణ, సురేందర్ మాట్లాడుతూ బీసీల సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. సామాజిక న్యాయం లక్ష్యంగా రచించిన పుస్తకం యువతలో చైతన్యం నింపుతుందని, రచయిత కృష్ణ యాదవ్ మరిన్ని ప్రజా సమస్యలపై రచనలు చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జడ్చర్ల ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, బీసీ జాగృతి సేన రాష్ట్ర కార్యదర్శి రఘునందన చారి, మండల అధ్యక్షులు గొడుగు నరసింహులు, సురభి విజయకుమార్, శివశంకర్, లింగంపేట్ శేఖర్, గోపాల్, చెన్నయ్య, రామస్వామి పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు సమగ్ర ఏర్పాట్లు..



వనపర్తి, నవంబర్ 4 (జనం సాక్షి) : జిల్లాలో వీధి కుక్కల నియంత్రణకు చేపట్టే జంతు జనన నియంత్రణ (ఏబీసీ) కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖీమ్యా నాయక్ అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన అన్ని వైద్య, మౌలిక సదుపాయాలను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. బుధవారం నాగవరం శివారులోని జంతు జనన నియంత్రణ కేంద్రం, డంపింగ్ యార్డును ఆయన సందర్శించి అక్కడి నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జంతు జనన నియంత్రణ కేంద్రంలో వీధి కుక్కలకు నిర్వహిస్తున్న శస్త్రచికిత్సలు, అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించి చెత్త వేరు చేసే ప్రక్రియ, వ్యర్థాల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తడి, పొడి చెత్తను పద్ధతి ప్రకారం వేరు చేసే పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వ్యర్థాల సేకరణ, నిల్వ, నిర్వహణకు పటిష్టమైన వ్యవస్థను అమలు చేయాలని, డంపింగ్ యార్డులో నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఇటీవల డంపింగ్ యార్డులో జరిగిన అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అగ్నిమాపక నివారణ చర్యలు, భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బోగస్ ఓట్లను ఏరివేయాలి

● అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి
● ఎమ్మెల్సీ అంజిరెడ్డి



రామచంద్రపురం, నవంబరు 4 (జనం సాక్షి) : ఓటరు జాబితాలో నకిలీ ఓట్లను ఎప్పటికప్పుడు గుర్తించి తొలగించాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. భారతీనగర్‌లో నిర్వహించిన మేధావుల చర్చా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రత్యేక పరిస్థితులు, వలస ఓటర్ల సమస్యలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన ఆవశ్యకతపై మేధావులతో చర్చించినట్లు తెలిపారు. పారదర్శక ఎన్నికలతోనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా చూడటంతోపాటు, బోగస్ ఓట్ల ఏరివేతలో ప్రజలు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్‌గౌడ్, సీనియర్ నాయకులు రఘువేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి గర్వించదగ్గ కవయిత్రి మొల్ల..!

● నన్నయ్య ఆది కవి అయితే మొల్ల ఆది కవయిత్రి
● తెలుగు సాహిత్య చరిత్రలో మొల్లకు ప్రత్యేక స్థానం
● అచ్చ తెలుగుతో రామాయణం రచించిన ధీర వనిత

శ్రీరంగాపురం, నవంబర్ 4 (జనం సాక్షి) : తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ తెలుగుజాతి గర్వించదగ్గ రచయిత్రి అని మాజీ కుమ్మర సంఘం జిల్లా అధ్యక్షులు, కౌన్సిలర్ బొడ్డుపల్లి పరుశురాం, శ్రీరంగాపూర్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు కుమ్మరి గోవిందు కొనియాడారు.బుధవారం వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపురం మండల అధ్యక్షుడు, యువజన అధ్యక్షుల ఆధ్వర్యంలో కుమ్మరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల నవంబర్ 11న వనపర్తి జిల్లా కేంద్రంలో మన కుల ఆడపడుచు, కవయిత్రి మొల్లమాంబ విగ్రహ భూమిపూజ కార్యక్రమం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేతుల మీదుగా నిర్వహించబడుతుందన్నారు. తెలుగుజాతికి విలువైన రత్నం మొల్ల అని, నన్నయ్య ఆదికవి అయితే ఆది కవయిత్రి మొల్ల అని కీర్తించారు. తెలుగు సాహిత్య చరిత్రలో రచయిత్రి మొల్లకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. మహా కవయిత్రి మొల్ల మన తెలుగు రచయిత కావడం మన అదృష్టమన్నారు. నాటి కాలంలో రాజుల ఆస్థానాల అండ లేకుండా ఒక కావ్యం రాయలేరని, కాని మొల్ల ఏ రాజాస్థానం అండ లేకుండా అచ్చ తెలుగులో రామాయణం రచించి ఆ శ్రీరాముడికే అంకితమిచ్చారని ప్రశంసించారు. ప్రపంచ దేశాల్లో ఇప్పటికీ మన తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు నిలబడ్డాయంటే దానికి కారణం రామాయణం ఒక్కటేనని పేర్కొన్నారు. రామాయణాన్ని అచ్చ తెలుగులో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో రచించిన మహా కవయిత్రి మొల్ల విగ్రహ భూమి పూజకు వనపర్తి జిల్లా పరిధిలోని కుమ్మర కుటుంబ సభ్యులందరూ, కుల పెద్దలు, యువత, బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని మన కుమ్మర్ల ఐక్యతను చాటుకోవాలని



పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో పెద్దలు బొడ్డుపల్లి మన్యం, సంఘం మండల అధ్యక్షులు శేఖర్, యూత్ అధ్యక్షులు సురేష్ ల్యాబ్, తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే

- భూముల రీసర్వేతో భూసమస్యలకు శాశ్వత పరిష్కారం
- భూముల రీసర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఆత్మకూర్‌లో భూ రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్



ఆత్మకూర్ నవంబర్ 4 (జనం సాక్షి): భూముల రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం ఆత్మకూరు మండలం బ్రాహ్మణ పల్లి రెవెన్యూ లోని కామారం గ్రామం లో జరుగుతున్న భూముల రీ సర్వే తీరును హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంకా ఎన్ని ఎకరాలలో సర్వే పూర్తి చేయాల్సి ఉందనే వివరాలను భూములు, కొలతలు శాఖ ఏడీ నూర్ సింగ్, సర్వేయర్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఎన్ని రోవర్లతో సర్వే నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. అక్కడ ఉన్న స్థానిక రైతులతో సర్వే తీరు గురించి కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భూముల సరిహద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాలను కచ్చితంగా నమోదు చేసే దిశగా రీసర్వే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. భూముల రీసర్వేను పూర్తి చేయడంలో రైతులు సహకరించాలని సూచించారు. సర్వే సమయం లో రైతులు తమ భూమి హద్దులను సరిగా చూపించాలని అన్నారు. సర్వేయర్లు సర్వే సమయం లో జాగ్రత్తలు వహించాలని సూచించారు. పారదర్శకంగా చేపడుతున్న భూముల రీసర్వేతో రైతుల భూ హక్కులకు భరోసా లభిస్తుందన్నారు. రీసర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులు, సర్వేయర్లకు సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి,కామారం సర్పంచ్ తోట లక్ష్మీ, ఇతర అధికారులు, సర్వేయర్లు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కరువు ప్రభావిత రైతులకు బ్యాంకుల ద్వారా ఉపశమనం కల్పించాలి

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): జిల్లాలో కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రభావిత మండలాల రైతులకు బ్యాంకుల ద్వారా అవసరమైన ఆర్థిక సహాయం అందించి ఉపశమనం కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బ్యాంకు అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ ఐడీఓసీ సమావేశ మందిరంలో ఎల్డీఎం ఆధ్వర్యంలో ప్రత్యేక జిల్లా స్థాయి కన్సల్టేటివ్ కమిటీ, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కరువు పరిస్థితులు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణపై సమీక్షించారు. జిల్లాలో కాటారం, మహాముత్తారం, మహాదేవపూర్, మల్హర్ రావు, కొత్తపల్లి గోరి మండలాలను కరువు ప్రభావిత మండలాలుగా ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ, ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం పంట రుణాల పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని, 12 నెలల మారటోరియంతో పాటు చెల్లింపు గడువును 36 నెలల వరకు పొడిగించే వెసులుబాటు ఉందని వివరించారు. రైతులపై రుణ చెల్లింపుల ఒత్తిడి తీసుకురావద్దని, మానవతా దృక్పథంతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. జిల్లాలో గత సీజన్‌లో లక్ష 5 వేల ఎకరాల్లో వరి సాగు జరగగా, ఈ సీజన్‌లో నీటి లభ్యత దృష్ట్యా 38 వేల ఎకరాలకే పరిమితం చేసేలా వ్యవసాయ శాఖ ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. సమావేశంలో ఎల్డీఎం నాగరాజు, ఆర్‌బీఐ ఏజీఎం యశ్వంత్ సాయి, నాబార్డ్ ఏజీఎం చైతన్య, జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

చిన్న కాళేశ్వరం భూసేకరణ వేగవంతం చేయాలి..

చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా భూసేకరణ స్థితిగతులు, పెండింగ్ అవార్డులు, మ్యుటేషన్లు, టైటిల్ వివాదాలు, ప్రభుత్వ భూములపై సమగ్రంగా సమీక్షించారు. సర్వే నంబర్ల వారీగా భూమి వివరాలు, అవార్డు స్థితి, యాజమాన్య హక్కులపై స్పష్టత ఉండాలని, పెండింగ్ భూములపై నివేదిక రూపొందించాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ నుంచి రావాల్సిన మ్యుటేషన్ ప్రతిపాదనలను వెంటనే పంపించాలని, భూసేకరణలో జాప్యం లేకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

తాడిచర్ల డేంజర్ జోన్ లో అర్హులందరికీ న్యాయం జరగాలి..

తాడిచర్ల డేంజర్ జోన్ పరిధిలోని అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్‌లో జెన్‌కో, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2022కు ముందు నిర్మించిన ఇళ్లలో గ్రామ పంచాయతీ అనుమతులు పొందిన ఇళ్లను మాత్రమే అర్హత ప్రాతిపదికన పి.ఎన్.లో చేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో జెన్‌కో సర్వేలో ఒకే వ్యక్తి పేరుపై ఒకటి కంటే ఎక్కువ ఇంటి నంబర్లు కేటాయించినట్లు గుర్తించిన నేపథ్యంలో అసలైన లబ్ధిదారులను గుర్తించి రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒరిజినల్ పిటిషన్లను పరిశీలించి ఆమోదించబడిన పిటిషన్లు, ఖచ్చితమైన ఇంటి నంబర్ల ఆధారంగా ఆర్ అండ్ ఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జెన్‌కో సీఈ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ పై అవగాహన..

ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డులు, వ్యక్తిగత వివరాలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రవేశపెడుతున్న నూతన ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానంపై బుధవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ సంచాలకులు కె. పార్వతీ దేవి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరిగింది. ప్రస్తుత హెచ్ఆర్ఎంఎస్ స్థానంలో కొత్త ఈ-హెచ్ఆర్ఎంఎస్ విధానం, ఉద్యోగుల వివరాల నమోదు, పరిపాలనా ప్రక్రియలు, సాఫ్ట్‌వేర్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఉప కోశాధికారులు అజహర్ షరీఫ్, జీవన్ రెడ్డి, సతీష్, సహాయ పే అండ్ అకౌంట్స్ అధికారి శ్రీనివాసరావు నాయకత్వం వహించి వివరించారు.

పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

- మాజీ మంత్రి దయాకర్ రావు



పాలకుర్తి, నవంబరు 04 (జనంసాక్షి) : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పలు రంగాలకు పెద్దపీట వేశామని, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్రావు అన్నారు. బుధవారం మండల కేంద్రం లో గ్రాడ్యుయేషన్ పట్టా పొందిన వారిని కలిసి తప్పకుండా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఇంటింటికి తిరిగి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడారు. ఖమ్మం, నల్లగొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారుప్రతి ఒక్క గ్రాడ్యుయేషన్ కలిగి ఉన్న వారు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా వ్యతిరేక పాలనపై బీఆర్ఎస్ శ్రేణులు గ్రాడ్యుయేట్లకు పూర్తిగా అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట నాయకులు పసునూరి నవీన్, నల్ల నాగిరెడ్డి, మాచెర్ల ఎల్లయ్య, పుస్కూరి శ్రీనివాసరావు, సర్పంచులు కమ్మగాని విజయ,బానోతు మహేందర్, ఉప సర్పంచులు గాదపాక కిరణ్, లకావత్ నాగరాజు, నాయకులు రేపాల అశోక్, వీరమనేని సోమేశ్వర్రావు, పాము శ్రీనివాస్. మామిండ్ల శోభన్ బాబు. కమ్మగాని సుధాకర్. పసుల వెంకటేష్. తదితరులు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్‌లో బీ-టెక్ విద్యార్థిని ఆత్మహత్య!

- ఆమె మృతికి అమృతండాకు చెందిన బోడ సుమన్ కారణం అంటూ బంధువుల ఆరోపణ...
- చెన్నారావుపేటలో నెలకొన్న ఉద్రిక్తత





చెన్నారావుపేట, నవంబర్ 4 (జనంసాక్షి) : బిటెక్ చదువుతున్న విద్యార్థిని హాస్టల్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... వరంగల్ జిల్లా నర్సంపేట మండలం చంద్రయ్య పల్లి గ్రామ శివారు బుచ్చి నాయక్ తండాకు చెందిన అజ్మీర కమల- సమ్మయ్య దంపతుల కుమార్తె వైష్ణవి మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్ పూర్ ఐఐఐటి డీఎం యూనివర్సిటీలో బిటెక్ సిఎస్సి థర్డ్ ఇయర్ చదువుతుంది. హైదరాబాద్ లోని ఓ ప్రైవేట్ సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న చెన్నారావుపేట మండలంలోని అమృతండా గ్రామానికి చెందిన బోడ సుమన్ తో పరిచయం ఏర్పడింది. ఆమెను సుమన్ మోసం చేయడంతో మనస్థాపానికి గురైన ఆమె హాస్టల్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. దీనికి కారణం సుమన్ అంటూ మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో అమృ తండాకు వెళ్లి సుమన్ ఇంటి ముందు వేసి ధర్నా చేయడానికి ప్రయత్నించగా విషయం తెలుసుకున్న నెక్కొండ సీఐ ఫణిందర్, చెన్నారావుపేట ఎస్సై పొన్నాల గోవర్ధన్, నెక్కొండ ఎస్సై శ్రావణ్ కుమార్ లు చెన్నారావుపేట పోలీస్ సిబ్బందితో పోలీస్ స్టేషన్ ముందు బుధవారం అడ్డుకున్నారు. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసులతో కొద్దిసేపు వాగ్వివాదానికి దిగారు. విద్యార్థిని వైష్ణవి మృతికి కారణం సుమనేనంటూ అతనిపై చర్యలు తీసుకోవాలని గొడవకు దిగారు. సుమన్ పనిచేస్తున్న సాఫ్ట్ వేర్ కంపెనీకి వైష్ణవి రెజ్యూమ్ పంపిందని దీంతో ఒకే ఏరియాకు సంబంధించిన వారమంటూ ఆమెతో మాటలు కలిపిన సుమన్ వైష్ణవిని మోసం చేశాడంటూ అందుకే వైష్ణవి ఆత్మహత్య చేసుకొని చనిపోయిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. పోలీసులు పోలీస్ స్టేషన్ ముందు వైష్ణవి మృతదేహాన్ని అడ్డుకోవడంతో చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ వద్ద ప్రధాన రహదారిపై కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అనంతరం నెక్కొండ సిఐ ఫణిందర్, ఎస్సై పొన్నాల గోవర్ధన్, నెక్కొండ ఎస్సై శ్రావణ్ కుమార్సుమన్ పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటారని నచ్చ చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు వైష్ణవి మృతదేహాన్ని అంబులెన్స్ లో తీసుకొని అక్కడి నుండి తిరిగి వెళ్లిపోయారు.



రామప్ప దేవాలయ ఈవోను, ఇన్స్‌పెక్టర్లకు సన్మానం

వెంకటాపూర్ (రామప్ప), నవంబర్ 04 (జనంసాక్షి): వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయ కార్యనిర్వాహణాధికారి ఇమ్మడి భాస్కర్ తోపాటు ఆలయ ఇన్స్‌పెక్టర్ అనిల్‌ను బుధవారం వెంకటాపూర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఓద్దుల మురళి ఆధ్వర్యంలో జర్నలిస్ట్ లు ప్రత్యేకంగా కలిశారు. రామప్ప దేవాలయ అభివృద్ధికి పాటుపడుతున్న ఆలయ కార్యనిర్వానాధికారి భాస్కర్ తోపాటు ఇన్స్పెక్టర్ అనిల్ ను జర్నలిస్టులు శాలువాలతో ఘనంగా సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకటాపూర్ జర్నలిస్టులు బేతి సతీష్ యాదవ్, పిల్లలమర్రి శివ, గోరంటాల విజయ్ కుమార్, దండపెల్లి సారంగం గౌడ్, పిల్లలమర్రి రాము, గునుగంటి హరీష్, భానోత్ యోగితోపాటు పూజారులు హరీష్ శర్మ,ఉమాశంకర్, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భార్యకు తలకొరివి పెట్టిన భర్త!



చెన్నారావుపే ట, నవంబర్ 4 (జనం సాక్షి) : కట్టుకున్న భార్యకు భర్త తలకొరివి పెట్టిన సంఘటన మండలంలోని అక్కల్ చెడ గ్రామంలోని కట్టయ్యపల్లెలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన ఈగ ఉమాదేవి అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు మానస, మౌనిక ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేకపోవడంతో కట్టుకున్న భర్త ఈగ సాగర్ తలకొరివి పెట్టిన సంఘటన పలువురిని కంటతడి పెట్టించింది.

రైతులు ఆరుతడి పంటలు సాగు చేసే విధంగా ప్రోత్సహించాలి

- జిల్లా కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 (జనంసాక్షి) : రాబోయే యాసంగి సీజన్ లో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి వ్యవసాయ అధికారులకు సూచించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో వ్యవసాయ శాఖ కార్యక్రమాలపై వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆరుతడి పంటలు సాగు చేసే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఖేత్ బచావో యోజన లో భాగంగా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలిసి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వానాకాలం పంటలు ఎండిపోయిన రైతుల వివరాలు సేకరించి తుది జాబితా తయారు చేయాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీ లో అర్హులైన రైతుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏ డి ఏ లు ఆదిరెడ్డి,అవినాష్ వర్మ, టెక్నీకల్ ఏవో కమలాకర్, మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

కరువును శాస్త్రీయంగా అంచనా వేయడంలో ప్రభుత్వం విఫలం

- కేంద్ర ప్రభుత్వం రాష్టానికి 50 వేల కోట్ల కరువు సహాయం అందించాలి..
- కలెక్టరేట్ ధర్నాలో ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్..



వరంగల్ ప్రతినిధి, నవంబర్ 4 (జనం సాక్షి): కరువును క్షేత్రస్థాయిలో పరిశీలించి శాస్త్రీయంగా అంచనా వేయకుండా పెరుగుతున్న కరువు తీవ్రతతో అల్లాడుతున్న ప్రజలకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తున్నారని ఇప్పటికైనా తక్షణమే వరంగల్ జిల్లా మొత్తాన్ని అధిక కరువు ప్రాంతంగా ప్రకటించి తక్షణ కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఎంసిపిఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఎంసీపీఐ(యు) వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకశిలా పార్కు నుంచి ర్యాలీ నిర్వహించి స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ ధర్నా ఉద్దేశించి జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో కేవలం 8 మండలాలని మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించి మిగతా ఐదు ప్రకటించకపోవడం అన్యాయం అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్టానికి 50వేల కోట్ల కరువు నిధిని కేటాయించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. భూగర్భ జలాలు అడుగంటి చెరువులు కుంటల్లో నీరు లేక రైతులు వేసిన పంటలన్నీ ఎండిపోయి దిగుబడి తగ్గి పెట్టుబడి రాక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే పట్టించుకోకపోవడం అలాగే ఉపాధి పనులు తగ్గిపోయి వ్యవసాయ కూలీలు కార్మికులు పనుల కోసం ఎదురు చూస్తున్నారని ఇలాంటి పరిస్థితుల్లో జిల్లా కరువు తీవ్రతను జిల్లా యంత్రాంగం సరిగా అంచనా వేయడంలో వైఫల్యం చెందిందన్నారు. జిల్లాలోని అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు తక్షణమే వరంగల్ జిల్లా అధిక కరువు ప్రాంతంగా ప్రకటించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. తక్షణమే కరెంటు కోతలను నివారించి రైతులకు నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. 14 రకాల నిత్యవసర వస్తువులను పేదలందరికీ ఉచితంగా అందించాలన్నారు. కరువుతో పంటలు కోల్పోయిన రైతాంగానికి పత్తి మిర్చి ఎకరాకు 50,000 మొక్కజొన్న వరి పంటలకు ఎకరాకు 30 వేలు ఇతర పంటలకు 20వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మోర్తాల చందర్ రావు గోనె కుమారస్వామి మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు తక్షణమే 200 రోజుల పని దినాలు కల్పించి 400 రూపాయల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు రాష్ట్ర మొత్తాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి సహాయకచల చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలోరాష్ట్ర కమిటీ సభ్యులు కుసుంబా బాబురావు ముక్కెర రామస్వామి నగర కార్యదర్శి మాలోతు సాగర్, పార్టీ రాష్ట్ర జిల్లా నాయకులు సింగతి సాంబయ్య, నర్ర ప్రతాప్, వంగల రాగసుధ, కనకం సంధ్య, నాగెల్లి కొమురయ్య, సింగతి మల్లికార్జున్, సుంచు జగదీశ్వర్, బలుసుకూరి నరసయ్య, గణిపాక ఓదెలు, మహమ్మద్ ఇస్మాయిల్ ,ఐతం నాగేష్, మాలి ప్రభాకర్, నరసయ్య గూడ సురేష్, ఉడుత గణేష్ లతోపాటు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.


విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు తీపికబురు

- ఇంటి నుంచే పింఛను, వైద్య సేవల పునరుద్ధరణపై రెండు రోజుల అవగాహన
- ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్



రెబ్బెన, నవంబర్ 4 (జనంసాక్షి): విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు పింఛను, వైద్య సేవలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాల పునరుద్ధరణపై రెండు రోజుల పాటు అవగాహన కల్పించనున్నట్లు బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీరమేష్ తెలిపారు. డిజిటల్ ధ్రువీకరణ పత్రాల ప్రచార కార్యక్రమం 5.0లో భాగంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. గోలేటి జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 16, 17 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు విశ్రాంత ఉద్యోగులు పింఛను పునరుద్ధరణ కోసం జీవన్ ప్రమాణ్ ధ్రువీకరణ పత్రాన్ని, వైద్య సేవల కోసం ఆరోగ్య కార్డు పునరుద్ధరణను ప్రధానంగా మీ సేవా కేంద్రాల ద్వారా చేయించుకుంటున్నారని వివరించారు. ఇకపై మీ సేవా కేంద్రాలకు వెళ్లకుండానే తమ సొంత చరవాణి (మొబైల్ ఫోన్) ద్వారా ఇంటి వద్ద నుంచే పునరుద్ధరణ చేసుకునే విధానంపై సీఎంపీఎఫ్, సింగరేణి అధికారులు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఆధార్ కార్డు, జీవన్ ప్రమాణ్, వైద్య సేవల పథకానికి సంబంధించిన పత్రాల ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. అవసరమైన వివరాలు, పత్రాలు అందుబాటులో ఉంటే అక్కడికక్కడే పునరుద్ధరణ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

శాంతిఖని గనిపై ఏఐటీయూసీ ధర్నా



బెల్లంపల్లి, నవంబర్ 4, (జనంసాక్షి) : బెల్లంపల్లి పట్టణంలోని శాంతిఖని గనిపై బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం గని మేనేజర్ సంజయ్ కుమార్ సిన్హాకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మంతెన రమేష్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ దాసరి తిరుపతి గౌడ్ మాట్లాడుతూ ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహించి ఎక్కడి వారికి అక్కడే హాస్పిటల్ లో ఇన్వాలిడేషన్ చేయాలన్నారు. టీజీ జెన్ కో, ట్రాన్స్కో నుండి రావాల్సిన 59వేల కోట్ల రూపాయలను వెంటనే సింగరేణి సంస్థకు చెల్లించాలన్నారు. మైన్స్ మీద మెటీరియల్ కొరత లేకుండా సరిపడు పని ముట్లు ఇవ్వాలన్నారు. పార్క్ పై ఇన్కమ్ టాక్స్ ను సర్కులర్ రిలీజ్ చేయాలన్నారు. సొంత ఇంటి పథకాన్ని వెంటనే సింగరేణి కార్మికులకు అందరికి ఇవ్వాలన్నారు. గనులపై నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రాజ్ కుమార్, మంతెన భాస్కర్, అమ్జత్ ఖాన్, రాజేశం, బుచయ్య, మైన్స్ కమిటీ సభ్యులు, సేఫ్టీ కమిటీ సభ్యులు, క్యాంటీన్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు కార్మికులు పాల్గొన్నారు.

సింగరేణి ఒప్పందాలను వెంటనే సర్క్యులర్ రూపంలో విడుదల చేయాలి


- ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ



రామకృష్ణాపూర్, నవంబర్04 (జనంసాక్షి): సింగరేణి సంస్థలో డైరెక్టర్ల స్థాయిలో, స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో కార్మిక సంఘాలతో కుదిరిన ఒప్పందాలను ఎలాంటి జాప్యం లేకుండా సర్క్యులర్ రూపంలో విడుదల చేయాలని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రటరీ అక్బర్ అలీ డిమాండ్ చేశారు. బుధవారం రామకృష్ణాపూర్ సీహెచ్‌పీలో ఫిట్ సెక్రటరీ హరి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం సీహెచ్‌పీ ఎస్ఈ చంద్రమౌళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అక్బర్ అలీ మాట్లాడుతూ కార్మికులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సొంతింటి కల, పర్క్‌పై ఆదాయపు పన్ను మినహాయింపులు, మారుపేర్ల మార్పులు, క్యాడర్ స్కీమ్ తదితర అంశాలను వెంటనే అమలు చేయాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత గుర్తింపు కార్మిక సంఘంపై ఉందన్నారు. సింగరేణి సంస్థ ఆర్థికంగా బలహీనపడుతున్నట్లు కనిపిస్తోందని, ఐదు కోల్ బ్లాకులకు కొబ్బరికాయ కొట్టే పరిస్థితి కూడా లేకపోవడంపై కార్మికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. సంస్థ ఆర్థిక పరిస్థితి ఇందుకు కారణమా? లేక మరేదైనా కారణముందా? అన్న విషయాన్ని యాజమాన్యం స్పష్టం చేయాలని కోరారు. గుర్తింపు కార్మిక సంఘంతో జరిగిన అన్ని ఒప్పందాలను సర్క్యులర్ల రూపంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని గనులపై బుధవారం ధర్నాలు నిర్వహించి యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. బుధవారం సాయంత్రం జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఇప్పకాయల లింగయ్య, సీహెచ్‌పీ కమిటీ సభ్యులు సీతారామారావు, అబ్బాస్, డొక్కు శ్రీను, శ్రీధర్, సిరాజ్, మండల శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, క్రాంతి, జంగం శ్రీనివాస్, ఆవుల మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ కె.హరిత



ఆసిఫాబాద్, నవంబర్ 4 (జనం సాక్షి) : జిల్లాలో తాగునీ టికి ఎలాంటి ఇబ్బం దులు తలెత్త కుండా ప్రతిరోజు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల కలెక్టర్ ఛాంబర్ లో పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఇంట్రా గ్రిడ్ అధికారులతో త్రాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుండి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, ప్రతి బోరు, సింగిల్ పేజ్ మోటారు, ఓవర్ హెడ్ ట్యాంకులు, గ్రిడ్ పైప్ లైన్ల పనులను పరిశీలించి, మరమ్మత్తు ఉన్నట్లయితే వెంటనే చేపట్టాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి త్రాగునీటి సమస్య రాకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, మిషన్ భగీరథ ఈ.ఈ. రాకేష్, ఇంట్రా గ్రిడ్ ఈ.ఈ. ఎం.ఎ. సిద్ధికి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
05 నవంబర్ 2026

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 4 (జనం సాక్షి) : జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని, బియ్యం కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాస రెడ్డితో కలిసి జిల్లాలో బియ్యం ధరల నియంత్రణ, సరఫరా వ్యవస్థ నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులు, లీగల్ మెట్రోలజి, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులతో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ బియ్యం నిత్యావసర వస్తువని, ప్రజలకు నిర్ణీత ధరలకు బియ్యం అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. జిల్లాలో బియ్యం విక్రయించే ప్రతి దుకాణంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను స్పష్టంగా తెలియజేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఏ పరిస్థితుల్లోనూ బియ్యం విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. బీపీటీ, కేఎన్ఎం రకం బియ్యం కిలో రూ. 66, ఆర్ఎన్ఆర్., తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటీ, జేఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79గా రిటైల్ విక్రయ ధరలను నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ధరలను ప్రతి రిటైల్ వ్యాపారి తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. జిల్లాలో బియ్యం ధరల నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మిల్లర్ల నుంచి రిటైల్ వ్యాపారుల వరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలయ్యేలా క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్, డి ఎం సివిల్ సప్లయ్ మల్లికార్జున బాబు, లీగల్ మెట్రోలాజి అధికారి, సంబంధిత శాఖల అధికారులు, మిల్లర్లు, హోల్ సేల్, రిటైల్ విక్రయదారులు, శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- 2000 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి పనులు
- సభకు హాజరు కాని అధికారులపై చర్యలు తప్పవు
- ప్రజలకు సేవ చేసే వారి ఉండండి లేకపోతే బదిలీ చేసుకోండి
- అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం
- శాసనసభ్యులు,మండుల సామేలు

తుంగతుర్తి, నవంబర్ 4 (జనం సాక్షి) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్రాన్ని గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు రేవంత్ సర్కార్ కృషి చేస్తుందని స్థానిక శాసనసభ్యులు మండుల సామేలు అన్నారు, బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు, ఇప్పటికే తాను గుడిసెలు గల ఇల్లు ఎన్ని ఉన్నాయో సర్వే ద్వారా తెలుసుకున్నానని విడతల వారీగా అందరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరులో ప్రాధాన్యత ఇస్తానని అన్నారు, మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎంతమంది ఇల్లు పూర్తి చేసుకున్నారని వివరాలు హౌసింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు, రెండో విడతలు కూడా అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. మూడు సంవత్సరాల తన పదవి కాలంలో 2000 కోట్లకు పైగా నిధులు వెచ్చించి నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సిసి రోడ్ల ఏర్పాటు కు ప్రాధాన్యత ఇచ్చి నిర్మించినట్లు తెలిపారు, పేద విద్యార్థుల కోసం తిరుమలగిరిలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుతో దాదాపుగా 2500 మంది విద్యార్థులకు ఉచిత విద్య అందునున్నట్లు తెలిపారు, నియోజకవర్గ కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటుతోపాటు త్వరలో నూతన కోర్టు భవన నిర్మాణంతో పాటు ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు, మండలంలో అన్ని ప్రాథమిక జిల్లా పరిషత్ పాఠశాల లో మౌలిక వసతుల ఏర్పాటుకు తాను కృషి చేస్తున్నట్టు చెప్పారు, ముఖ్యంగా ప్రహరీ గోడలు, మూత్రశాలలు నిర్మించేందుకు నివేదిక సిద్ధం చేయాలని కోరారు, ఈ సమావేశానికి ఉన్నతాధికారులు హాజరుకాక తమ కిందిస్థాయి సిబ్బందిని పంపడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు, ముఖ్యంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి అధికారులు హాజరు కాకపోవడంతో వారికి వెంటనే మెమోలు అందించాలని ఎంపీడీవోను ఆదేశించారు, సభకు ఆలస్యంగా హాజరైన పంచాయతీరాజ్ డిఇ లింగ్యనాయక్ ను మూడు సంవత్సరాల కాలంలో నీవు చేసిన అభివృద్ధి పనులు ఏమి చేశావు సభకు చెప్పాలని కోరారు, కేవలం ఉద్యోగం చేస్తున్నావని నీవు వెంటనే ఇక్కడినుండి బదిలీ చేయించుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు, రావులపల్లి రోడ్డు, మరియు కొత్తగూడెం గోరంట్ల రోడ్డు నిర్మాణ పనులు ఎందుకు జరగడంలేదని దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని అధికారులను ప్రశ్నించారు, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు, రోడ్లు సరిగా లేక



ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అధికారిగా మీరు ఏం చేస్తున్నారని ఆగ్రహించారు, ప్రజలకు సేవ చేయాల్సిన అధికారులు ఆ దిశగా పనిచేయడం లేదని అన్నారు, ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాలను పర్యటించి సమస్యలు తెలుసుకుని పరిష్కరించవలసిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు, ప్రస్తుతం ఏలినినో ప్రభావం ఉన్న దృశ్య రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలి అని అన్నారు. ఈ మేరకు ఆయా గ్రామాలలో నెలకొన్న సమస్యలను అధికారులతో పాటు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు, అంతకుముందు నూతన సర్పంచులను శాలువాలతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఎంపీడీవో చలపతి, తాసిల్దార్ దయానందం, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రేపటి గౌడ్, నాయకులు దాసరి శ్రీను తో పాటు గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ రోడ్డుపై అడుగడుగునా గుంతలు

- ప్రమాదాలకు నిలయంగా మారిన రహదారి
- విద్యార్థులు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు తప్పని తిప్పలు



భద్రాచలం, నవంబర్ 4 (జనంసాక్షి) : భద్రాచలం పట్టణంలోని ఐటీడీఏ రహదారి అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో నిత్యం రాకపోకలు సాగించే విద్యార్థులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి దుస్థితిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తూ, అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

విద్యార్థుల భద్రతపై ఆందోళన

ఐటీడీఏ రహదారి పరిసరాల్లో పలు పాఠశాలలు ఉండటంతో ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, సైకిళ్లపై పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు గుంతల కారణంగా ప్రమాదాల బారినపడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు దాటే సమయంలో, వాహనదారులు గుంతలను తప్పించుకునే క్రమంలో ప్రమాదాలు జరిగే ముప్పు ఉందని పేర్కొంటున్నారు. రాత్రివేళ మరింత ప్రమాదకరం రహదారిపై ఏర్పడిన గుంతలను తప్పించుకునేందుకు ద్విచక్ర వాహనదారులు అకస్మాత్తుగా వాహనాలను పక్కకు మళ్లించాల్సి వస్తోందని స్థానికులు చెబుతున్నారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలతో ఢీకొనే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రివేళల్లో గుంతలు సరిగా కనిపించక వాహనదారులు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థులు, ప్రజలు అధికంగా సంచరించే ప్రధాన రహదారిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగి చిన్నారులు గాయపడిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఐటీడీఏ రోడ్డుపై గుంతలను వెంటనే పూడ్చివేసి, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి రహదారిని ప్రమాదరహితంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

కండక్టర్ ప్రవళిక మృతికి సంతాపంగా ఆర్టీసీ కార్మికుల నిరసన

- భద్రాచలం డిపో ఎదుట ఆందోళన
- స్వచ్ఛందంగా బస్సుల నిలిపివేత



భద్రాచలం, నవంబరు 4 (జనంసాక్షి) : బస్సులో నుంచి తోసివేయడంతో మృతి చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతికి సంతాపం తెలియజేస్తూ భద్రాచలం ఆర్టీసీ డిపో కార్మికులు బుధవారం నిరసన చేపట్టారు. ఆమె మృతికి సంతాపంగా కార్మికులు స్వచ్ఛందంగా బస్సులను నిలిపివేసి డిపో ఎదుట ఆందోళన నిర్వహించారు. విధి నిర్వహణలో ఉండగా జరిగిన ఈ ఘటనలో కండక్టర్ ప్రవళిక ప్రాణాలు కోల్పోవడం కార్మిక వర్గాన్ని కలచివేసింది. ఆమె మృతికి సంతాపంగా డిపో కార్మికులు విధులు నిలిపివేసి నిరసనలో పాల్గొన్నారు. డిపో ఎదుట కార్మికులు పెద్ద సంఖ్యలో చేరి ప్రవళికకు సంతాపం తెలియజేశారు. కార్మికుల నిరసనతో డిపో పరిసరాల్లో ఆందోళన వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

దమ్మపేటలో వరద బీభత్సం..

- భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తం
- ఆలయ ప్రాంగణాల్లోకి వరద నీరు..
- లోతట్టు ప్రాంతాలు జలమయం



దమ్మపేట, నవంబర్ 4 (జనం సాక్షి) : దమ్మపేట మండలంలో మురుసు తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి.ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో వరద నీరు చేరి జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.లోతట్టు ప్రాంతాలు జలమయమవుతుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.భారీ వర్షాల ధాటికి కొన్ని ప్రాంతాల్లో ఆలయ ప్రాంగణాల్లోకి సైతం వరద నీరు చేరింది. దీంతో భక్తులు,స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.మరోవైపు వాగులు,వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.పలు చోట్ల వ్యవసాయ భూములు నీట మునిగి రైతులు నష్టభయంతో ఉన్నారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి,వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని పర్యవేక్షించి ఎటువంటి ప్రాణహాని కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. మల్లెపూలు వాగులో మహిళ చిక్కుకోగా సమాచారం తెలుసుకున్న మంత్రి తుమ్మల వెంటనే స్పందించి కొత్తగూడెం అధికారులకు తెలియజేయగా రెస్కూ టీం తక్షణమే స్పందించి మహిళను కాపాడారు.లోతట్టు ప్రాంతాల ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు అందించారు.ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా, ఉధృతంగా ప్రవహించే వాగులు,వంకలు దాటే ప్రయత్నం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.వర్షాలు తగ్గుముఖం పట్టి సాధారణ పరిస్థితులు నెలకొనాలని ప్రజలు ఆశిస్తున్నారు.

రైతు కష్టం నీటి పాలు

- మురుసు తుఫానుతో ఆగమాగం అయిన వరి పంట
- కోతకొచ్చిన వరి పంట నీటి పాలు

పెనుబల్లి, నవంబర్ 4 (జనం సాక్షి) : మురుసు తుఫాను ప్రభావంతో రైతు కష్టం నీటిపాలైంది. పెనుబల్లి మండలంలో మురుసు తుఫాను ప్రభావంతో కురిసినభారీ వర్షాలకు కోతకు వచ్చిన వరి పంట నీటి పాలు కావడంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.వరి కంకులు ఈని అర్రువంచే సమయంలో రైతులు వరి మళ్ళల్లో నీటిని వెళ్లగొట్టి మళ్ళను ఎండ గట్టి కోతలు మొదలు పెడతారు. సరిగ్గా ఇదే సమయంలో మురుసు



తుపాను ప్రభావంవల్ల భారీ వర్షాలు కురవడంతో వరి పంట నీటి పాలు అయ్యింది. కోతలు కోసి దాన్యం కాటా వేసే సమయంలో మురుసు తుఫాను రైతుల పాలిట శాపంగా మారింది.

ఎస్‌డబ్ల్యూసీ గోదాంలో కలెక్టర్, ఎస్పీ తనిఖీలు



కోదాడ, నవంబర్ 4 (జనం సాక్షి) : గోదాంలలో బియ్యం నిల్వ, నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చేయొద్దని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కోదాడ సమీపంలోని బాలాజీనగర్ ఎస్‌డబ్ల్యూసీ గోదాంను జిల్లా కలెక్టర్, ఎస్పీ కె. నరసింహ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. గోదాంలోని బియ్యం నిల్వలను, నిర్వహణ తీరును పరిశీలించారు. స్టాక్ రికార్డులను తనిఖీ చేయడంతో పాటు బియ్యం శాంపిల్స్ సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. పరీక్ష ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసే సన్న బియ్యాన్ని జాగ్రత్తగా నిల్వ చేయాలని సూచించారు. బియ్యం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని గోదాం మేనేజర్, టెక్నికల్ అసిస్టెంట్లకు స్పష్టం చేశారు. నిల్వ చేసే విధానం, భద్రతా ప్రమాణాలు, ఫస్ట్ ఇన్ ఫస్ట్ అవుట్ (ఎఫ్ఐఎఫ్ఓ) పద్ధతిని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

హమాలీలకు లేబర్ కార్డులు..

గోదాంలో పనిచేస్తున్న హమాలీలతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తమకు లేబర్ కార్డులు ఇప్పించాలని వారు కోరగా కలెక్టర్ వెంటనే స్పందించారు. సంబంధిత లేబర్ అధికారితో మాట్లాడి జిల్లాలోని ఆరు బఫర్ గోదాంలలో పనిచేస్తున్న హమాలీలందరికీ లేబర్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హమాలీల ఇతర సమస్యలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో హమాలీలు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూర్యనారాయణ, జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, తాసిల్దార్ సంతోష్ కిరణ్ ఎస్‌డబ్ల్యూసీ మేనేజర్ సందీప్, టెక్నికల్ అసిస్టెంట్లు భాస్కర్ రెడ్డి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాల పరిష్కారానికి భూ రీ సర్వే

- గోపల్‌దిన్నేలో భూ రీసర్వేను ప్రారంభించిన అధికారులు



ఇటిక్యాల, నవంబర్ 4 (జనం సాక్షి) : రైతుల పొలాల వద్ద భూతగాధాల పరిష్కారం కై ప్రభుత్వం చేపట్టే భూ రీ సర్వే పనులు పారదర్శకంగానిర్వహించాలని ఇటిక్యాల తహసిల్దార్ శ్రీకాంత్ రెడ్డి సర్వేయర్లను ఆదేశించారు. బుధవారం మండలంలోని గోపల్ దిన్నె గ్రామంలో భూ రీ సర్వే పనులను మండల సర్వేయర్ హరికృష్ణ. ఆర్. ఐ. మదన్ మోహన్. లైసెన్స్ డ్ సర్వేయర్లతో కలిసి భూ రికార్డుల ప్రకారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూములను కాపాడడంతోపాటు భూ తగాదాలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూముల రీ సర్వే పనులు చేపడుతుందని నిబంధనలను అనుసరించి సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, హద్దుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. రైతుల పొలాల సర్వే విషయంలో పక్క పొలం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఇరుపక్షాల సమక్షంలో నిష్పక్షపాతంగా సర్వే చేయాలని ఆయా గ్రామాల సర్పంచులు భూ సర్వేకు సహకరించాలని, ప్రజలకు ఏమైనా సందేహాలు ఉంటే అధికారులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిపిఓ నరసింహ. గ్రామ పెద్దలు బుజ్జి రెడ్డి. మహేశ్వర్ రెడ్డి. అనంత రెడ్డి. గ్రామ కాంగ్రెస్ నాయకుడు మహేశ్వర్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

- మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 4 (జనం సాక్షి) : మురుసు తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో వరి, పత్తి, ఇతర సాగు పంటలు తీవ్రంగా దెబ్బతినడం పట్ల బీఆర్ఎస్, మాజీ లోక్ సభ పక్ష నేత ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంటలు వర్షాల కారణంగా నీటమునిగి, నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టంపై సమగ్ర సర్వే నిర్వహించి, నష్టాన్ని అంచనా వేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. పంటలు దెబ్బతిన్న ప్రతి రైతును గుర్తించి, నష్టపరిహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పెట్టుబడుల భారం, సాగు ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రకృతి వైపరీత్యం మరింత నష్టాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టి, వారికి అండగా నిలవాలని నామ కోరారు.

వృత్తి నైపుణ్యాలతో గిరిజన యువతకు స్వయం ఉపాధి

- ఐటీడీఏ పీవో బి.రాహుల్

భద్రాచలం, నవంబర్ 4 (జనంసాక్షి) : గిరిజన నిరుద్యోగ యువతీ యువకులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకొని స్వయం ఉపాధి పొందడంతో పాటు వివిధ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. శిక్షణతో పాటు ఆదాయ మార్గాలపై అవగాహన పెంచుకొని, నేర్చుకున్న నైపుణ్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బుధవారం ఐటీడీఏ ప్రాంగణంలోని యువజన శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఇప్పటివరకు శిక్షణ పొందిన వారి సంఖ్య, ప్రస్తుతం శిక్షణ తీసుకుంటున్న యువతీ యువకులు, రాబోయే శిక్షణ తరగతులకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి, వారు నేర్చుకుంటున్న నైపుణ్యాల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, ఫీల్డ్ టెక్నీషియన్, కంప్యూటర్ అండ్ పెరిఫెరల్స్, వేర్‌హౌస్ సూపర్‌వైజర్ వంటి కోర్సులను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తిచేసుకొని ఉద్యోగాల్లో చేరినప్పుడు ఆత్మవిశ్వాసంతో మాట్లాడే నైపుణ్యాన్ని అలవర్చుకోవాలని, మనసులోని భయాన్ని విడనాడాలని అన్నారు. కంప్యూటర్ అండ్ పెరిఫెరల్స్ కోర్సులో భాగంగా సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, నిర్వహణతో పాటు ల్యాప్‌టాప్ మరమ్మతుల వంటి అదనపు సాంకేతిక నైపుణ్యాలను కూడా నేర్పించాలని శిక్షకులకు సూచించారు. నూతన నైపుణ్య శిక్షణ కోర్సులపై గిరిజన యువత దృష్టి సారించాలని తెలిపారు. బ్యూటీషియన్, థెరపిస్ట్, ఎంబ్రాయిడరీ శిక్షణ పొందిన యువతులు సొంతంగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని సూచించారు. శిక్షణను వృథా చేయకుండా జీవనోపాధికి ఉపయోగించుకోవాలని, ప్రస్తుతం శిక్షణ పొందుతున్న యువతీ యువకులు తమ తోటి వారిని కూడా నైపుణ్య శిక్షణ వైపు



ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, యువజన శిక్షణ కేంద్రం మేనేజర్ శ్రీనివాస్, ఫ్యాకల్టీలు అనురాధ, జయప్రకాష్, దీనకుమారి, జ్యోతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
05.11.2026



తెలంగాణ రక్షణ సేన బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి

తెలంగాణ రక్షణ సేన జిల్లా నూతన కమిటీల నియామకం

పెద్దపల్లి,నవంబర్ 04(జనంసాక్షి) : క్షేత్రస్థాయిలో తెలంగాణ రక్షణ సేన పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దడంతో పాటు బడుగు,బలహీన వర్గాల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పార్టీ బీసీ సెల్ కమిటీలను నియమించాం అని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పెద్దపల్లి జిల్లా అధ్యక్షురాలు శిరవేణి స్వప్న,నియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొమురయ్య స్పష్టం చేశారు పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆదే శాల మేరకు పెద్దపల్లి జిల్లా,నియోజకవర్గ మరియు మండల స్థాయి నూతన కమిటీలను స్థానిక ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్య క్షురాలు శిరవేణి స్వప్న,పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు సలేంద్ర కొముర య్య అధికారికంగా ప్రకటించారు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా ఉస్తెం శ్రీనివాస్,జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడిగా భోగాని శంకర్ గౌడ్,పెద్దపల్లి నియోజకవర్గ స్పోర్ట్స్ వింగ్ అధ్యక్షురాలిగా దాడి ప్రవంతి బాధ్యతలు స్వీకరించారు. మండల స్థాయి కమిటీల్లో భాగంగా పెద్దపల్లి రూరల్ అధ్యక్షుడిగా ఉప్పు ఘట్టేష్,ప్రధాన కార్యదర్శిగా ఎంచెర్ల స్వామి నియమితులు కాగా,సుల్తానాబాద్ రూరల్ అధ్యక్షుడిగా మల్యాల కరుణాకర్,ప్రధాన కార్యదర్శిగా పోసాని కృష్ణలకు బాధ్యతలు అప్పగించారు.అనంతరం జిల్లా అధ్యక్షురాలు శిరవేణి స్వప్న,నియోజకవర్గ అధ్యక్షు డు సలేంద్ర కొమురయ్య మాట్లాడుతూ వెనుకబడిన, బడుగు,బలహీన వర్గాల హక్కుల సాధన కోసం నూతన కమిటీల ప్రతినిధులు సైనికుల్లా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.తమపై సంపూర్ణ విశ్వాసంతో గురుతర బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితకు నూతన బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉస్తెం శ్రీనివాస్, కమిటీల బాధ్యులు కృతజ్ఞతలు తెలుపగా,కొత్తగా ఎన్నికైన వారికి స్థానిక నాయకులు,కార్యకర్తలు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలకు బెంచీల వితరణ

పెద్దపల్లి,నవంబర్ 04(జనంసాక్షి) : అప్పన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు ఎంకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 బెంచీలను వితరణ చేశారు.ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ మల్క కొమరయ్య వీటిని సమకూర్చారు. విద్యార్థులకు కూర్చునేందుకు సరైన సౌకర్యం లేదని తెలుసుకుని బెంచీలు అందించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా కొమరయ్య మాట్లాడుతూ తనకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధికి సహకరించడం బాధ్యతగా భావిస్తున్నానన్నారు. గతంలో పాఠశాలకు ఆర్చ్, గేటు కూడా అందించినట్లు తెలిపారు. బెంచీల వితరణపై పాఠశాల యాజమాన్యం,ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఎంకే ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



మున్సిపల్ కార్పొరేషన్ పరిస్థితి...

పేనం మీది నుంచి పొయ్యిలోకి..

- దంపుయార్డు సమస్య, విలీన గ్రామాల అభివృద్ధి, అంతర్గత రోడ్లు అభివృద్ధి, పౌర సేవలపై దృష్టి సారించాలి
- రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం పై ప్రత్యేక దృష్టి సారిస్తుంది
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 04 (జనంసాక్షి): :మున్సిపల్ కార్పొరేషన్ పరిస్థితి పేనం మీది నుండి పొయ్యిలో పడ్డట్టయిందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఎద్దేవా చేశారు. సుడా చైర్మన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ పాలకవర్గంలో కీలకంగా వ్యవహరించిన వారే నేడు బిజెపి పాలకవర్గంలో ఉన్నారని నరమాంసం అలవాటుపడ్డ వారిని సాధువులుగా మారమంటే ఎలా సాధ్యమని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ ను ప్రశ్నించారు. గత పాలకవర్గం పై అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రజలు బీజేపీ మాయమాటలు నమ్మి ఓటు వేశారని కానీ పరిస్థితి పేనం మీది నుండి పొయ్యిలో పడ్డ చందంగా మారిందని నరేందర్ రెడ్డి విమర్శించారు. ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని ముఖ్యంగా ఒకవైపు డంపు యార్డు సమస్య మరొక వైపు విలీన గ్రామాల డివిజన్లలో అనేక రోడ్లు తట్టెడు మట్టి పోయని పరిస్థితి ఉందని, నగరంలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, పౌర సేవలు సరిగా అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వీటిపై శ్రద్ధ వహించాల్సింది పోయి వీటన్నిటినీ గాలికి వదిలేసి 4 రోజులకొకసారి మీడియా ముందుకు వచ్చి ఇదిగో అదిగో అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని నరేందర్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం పై ప్రత్యేక దృష్టి సారించిందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని యుఐడిఎఫ్ కు పూర్తి నిధులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని యూసిఎఫ్ లో 75 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని ఇవే కాకుండా కరీంనగర్ అభివృద్ధికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, లక్ష్మణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వం తరపున రావాల్సిన నిధులు మంజూరు చేయించడానికి సిద్ధంగా ఉన్నారని ఇప్పటికైనా చిల్లర మల్లర కొట్లాటలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. బిఆర్ఎస్ నాయకుడి వద్ద నిజంగానే ఆడియో రికార్డులు ఉంటే వెంటనే ప్రజల ముందు పెట్టాలని అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేసే దమ్ము రెండు పార్టీల నాయకులకు లేదని నరేందర్ రెడ్డి అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్ గంట శ్రీనివాస్, నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, జీడి రమేష్, దన్న సింగ్, షబానా మహమ్మద్, దండి రవీందర్, మామిడి సత్యనారాయణ రెడ్డి, కుర్ర పోచయ్య, లక్కిరెడ్డి కిరణ్ రెడ్డి, సాయిరాం, జిలుకర రమేష్, ఖలీల్, సుదర్శన్, హనీఫ్, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యతోనే విలువ..

విద్యార్థులకు గైడ్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్

కరీంనగర్ టౌన్, నవంబర్ 04 (జనంసాక్షి):విద్యతోనే మనిషికి గౌరవం, విలువతో పాటు సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుందని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తమ కలలను సాకారం చేసుకోవాలని పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్‌ను 200 మందికి పైగా విద్యార్థులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యంగా బాలికలు విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆడపిల్ల చదువుకుంటే కొన్ని తరాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. విద్యతోనే సమాజంలో సమూల మార్పులు సాధ్యమని, విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా లక్ష్య సాధన కోసం కృషి చేయాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులు వందకు వంద మార్కులే లక్ష్యంగా చదవాలని అన్నారు.దివంగత మాజీ ఎంపీ సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ ఆశయాలకు అనుగుణంగా గత 26 ఏళ్లుగా విద్యార్థులకు గైడ్స్ పంపిణీతో పాటు ఉన్నత విద్యకు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఎంఐఎం పార్టీ తరఫున ఇప్పటివరకు నాలుగు లక్షల మందికి పైగా విద్యార్థులకు విద్యా సహకారం అందించినట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం కరీంనగర్ పట్టణ అధ్యక్షుడు, 61వ డివిజన్ కార్పొరేటర్ మహమ్మద్ అతీఫ్ (అతీనా), మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, పార్టీ నాయకులు మోసిన్ మోహియుద్దీన్, అజర్ దబీర్, ఖమరుద్దీన్, బర్కత్ అలీ, ఖుర్షిద్, కార్పొరేటర్లు ఇబ్రహీం, మజీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా బయోమైనింగ్..

- రోడ్లపై పశువులను వదిలితే.. కేసులు పెట్టండి
- డంపింగ్ యార్డును సందర్శించిన కలెక్టర్



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనంసాక్షి: ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. నాగారం శివారులోని డంపింగ్ యార్డును కలెక్టర్ బుధవారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో రోజువారీగా ఇంటింటికి తిరిగి సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు సగటున ఎంత పరిమాణంలో చెత్తను శుద్ధి చేస్తున్నారు, ఎరువును ఎవరికి అందజేస్తున్నారు తదితర వివరాలను ఆరా తీశారు.ప్రతి రోజు సగటున 600 మెట్రిక్ టన్నుల చెత్తను బయో మైనింగ్ జరుపుతుండగా, దానిని వెయ్యి మెట్రిక్ టన్నులకు పెంచాలని కలెక్టర్ సూచించారు. డంపింగ్ యార్డు ప్రాంతంలో ఖాళీ స్థలాలను గుర్తించి విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, పచ్చదనం పెంపొందించాలని అన్నారు. డంపింగ్ యార్డు ప్రాంతం అంతా కవర్ అయ్యేలా సోలార్ ప్యానెల్స్ తో పని చేసే సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వ్యర్థాల శుద్ధి ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. డంపింగ్ యార్డు ప్రదేశంలోని రోడ్డుకు ఆనుకుని ఇరువైపులా వ్యర్థాలను పొగ చేయకుండా దూరంగా తరలించాలని అన్నారు. రోడ్లపై పశువులను వదిలితే కేసులు నమోదు చేయండి రోడ్లపై ఎక్కడబడితే అక్కడ పశువులు సంచరించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. డంపింగ్ యార్డు ప్రాంతంతో పాటు నగరంలోని ప్రధాన రహదారులపై ఆవులు, ఇతర పశువులు ఎక్కడబడితే అక్కడ సంచరిస్తుండడం గమనించిన కలెక్టర్ అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. రోడ్లపై పశువుల సంచారం వల్ల వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని పశువులు రోడ్లపై సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. రోడ్లపై పశువులను వదిలితే కేసులు నమోదు చేయాలని, జరిమానాలు విధించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఇతర అధికారులు ఉన్నారు.

ఉపకరణాల వితరణ

పెద్దపల్లి,నవంబర్ 04(జనంసాక్షి) : తమ తల్లిదండ్రులు సత్తమ్మ ,అంజయ్యల జ్ఞాపకార్థం రూ.3.5 లక్షల విలువైన ఉపకరణాలకు అందజేసేందుకు ముందుకు వచ్చిన కరీంనగర్ ఆర్ కె ఆగ్రోస్ అధినేత మియాపురం నాగరాజు,రామకృష్ణలనుమంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు



నాగరాజు సోదరులు మంత్రి నివాసంలో ఆయ నను కలిసి తమ సేవా కార్యక్రమాల గురించి వివరించారు. కరీంనగర్ జిల్లా కొండయ్య పల్లి గ్రామపంచా యతీకి రూ.1.5 లక్షల విలువైన పారిశుధ్య పరికరా లను అందజేస్తున్నట్టు తెలిపారు. మంథని నియోజకవర్గం ముత్తారం కస్తూర్బా బాలికల వసతి గృహానికి రూ.2 లక్షల విలువైన ఆటోమేటిక్ చపాతీల తయారీ యంత్రాన్ని బహూకరించనున్నట్టు వారు వెల్లడించారు.ఈ యంత్రం ద్వారా గంటకు 500 చపాతీలను తయారు చేయవచ్చు. తెలంగాణ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ స్టేట్ అసిస్టెంట్ డైరెక్టర్ బర్ల రాజు, అడవి శ్రీరాంపూర్ ఉప సర్పంచ్ అనవేన హరిత,తిరుపతిలు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం



జూలపల్లి (జనంసాక్షి) : కాచాపూర్ గ్రామానికి చెందిన దాడి రోహిణి ఇటీవల మృతి చెందగా రోహిణి నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ద్వారా కుటుంబ సభ్యుల అనుమతితో మృతి అనంతరం రెండు జీవితాలకు వెలుగునిచ్చే విధంగా ఫౌండేషన్ వారు కుటుంబ సభ్యుల అనుమతి మేరకు నేత్రాలను దానం చేశారు.బుధవారం కాచాపూర్ లో రోహిణి సంస్మరణ సభ నిర్వహించగా కుటుంబ సభ్యులకు, బంధువులకు సదాశయ ఫౌండేషన్ వారు మాట్లాడుతూ నేటి తరంలో ఎంతోమంది యువత,అకాల మరణం చెందడం ద్వారా వారి వారి కుటుంబాలను ఒప్పించి ఒక మృతి చెందిన వ్యక్తి ఆరుగురికి మరొక జీవితాన్ని ఇవ్వగలరని, ఎవరైనా మృతి చెందితే వారి అవయవాలు దానం చేయడంతో ఎంతో పుణ్య కార్యక్రమాలు చేసినంత అవుతుందని ప్రతి జిల్లా గ్రామాలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, హన్మకొండ జిల్లా అధ్యక్షులు కారేటి శంకర్ రావు,క్యాతం మల్లేశం,బాలసాని సంతోష్,అడ్వకేట్,ఫౌండేషన్ ప్రతినిధి నూతి సురేష్ కుమార్ నేత్ర,అవయవ,శరీర దానాలపై అవగాహన కల్పించారు.నేత్రదాత భర్త దాడి మురళి యాదవ్ కుమార్తెలు శ్రీవల్లి,శ్రీనిధి, కాచాపూర్ గ్రామ ఉపసర్పంచ్,దాడి మనోహర్,రాజవ్వ,అసిస్టెంట్ రిజిస్ట్రర్ ఆఫ్ కోపరేటివ్ డిపార్ట్మెంట్ జమున,ఎల్లావుల జ్యోతి,తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన అట్రాసిటీ కేసుల పరిష్కారం

- బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 04(జనంసాక్షి): ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం చేకూర్చాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ముందుగా జిల్లాలో ఇటీవల నియామకమైన నూతన కమిటీ సభ్యులను సన్మానించారు.ఇంచార్జి జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయ లక్ష్మి, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న, ట్రైబల్ వెల్ఫేర్, మత్స్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి పనులపై వివరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేసి చార్జ్ షీట్ వేస్తే బాధితులకు న్యాయంతోపాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం అందుతుందన్నారు.ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వ శాఖల సహకారంతో జిల్లాలో అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు బాధితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.జిల్లాలో ఎస్సీ, ఎస్టీ పథకాల ప్రయోజనాలు అందిపుచ్చుకునేలా, అలాగే వారి సమస్యలను జిల్లా యంత్రాంగానికి తెలియజేసేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల కింద ఇప్పటి వరకు రూ.1, 81,57,500 పరిహారం అందించామని వెల్లడించారు. ప్రతి నెలా చివరి రోజున అన్ని మండలాల్లో ఆయా శాఖల ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాలు, ఉపకార వేతనం, విదేశీ విద్యా, వివిధ ప్రభుత్వ సబ్సిడీ, ఉపాధి కల్పన పథకాలలపై సభ్యులు అవగాహన కల్పించాలని సూచించారు. స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ కొనసాగుతుందని తెలిపారు.ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ.. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో విచారణ వేగంగా పూర్తి చేస్తున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఇట్టి సమావేశంలో డీఆర్ఓ జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, పరిశ్రమల శాఖ జీఎం హనుమంతు, జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి.నరేష్ నాయక్, బీపేట రాజు, భూక్య రమేష్, బడుగు లింగయ్య, జోగు రవీందర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తోట లహరి, వీర రమణయ్య, చింతోజు భాస్కర్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శరవేగంగా పెద్దపల్లి అభివృద్ధి

ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు

పెద్దపల్లి,నవంబర్ 04(జనంసాక్షి) : పెద్దపల్లి పట్టణంలోని 5వ వార్డులో రూ. 3.85 కోట్లతో, 9వ వార్డులో 2.45 కోట్లతో, 10వ వార్డులో రూ.3.24 కోట్లతో మరియు 11వ వార్డుల్లో 2.93 కోట్ల యూ.ఐ.డి.ఎఫ్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపనలు చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపెద్దపల్లి పట్టణంలో రూ.62.23 కోట్ల యూ.డి.ఐ.ఎఫ్ నిధులు మంజూరు చేసుకోవడం జరిగిందని వాటితో పెద్దపల్లి పట్టణం సుందరంగా మారుతుందని అన్నారు. పట్టణంలో గత సంవత్సరం టీ.యూ.ఎఫ్.ఐ.డి.సి నిధుల ద్వారా రూ.35 కోట్లు మంజూరు చేసి పట్టణంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. అలాగే డి.ఎం.ఎఫ్.టి నిధుల ద్వారా రూ.15 కోట్లు మంజూరు చేసుకుని శరవేగంగా పలు వార్డుల్లో అభివృద్ధి చేశామని పెద్దపల్లి పట్టణంలో రూ. 7 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ఏర్పాటు చేస్తున్నామని నిధులు కూడా మంజూరు అయ్యాయని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని రోడ్ల డ్రైనేజీల నిర్మాణ విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటించి అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు ఎప్పటికప్పుడు అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని సూచనలు చేశారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలో నూతన బస్సు డిపో,బైపాస్ రోడ్డు,ప్రభుత్వ ఆసుపత్రి ఆధునీకరణ,డబల్ రోడ్లు,సెంట్రల్ లైటింగ్లు మరియు అనేక రకాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రజలందరూ గమనించాలి అని విజ్ఞప్తి చేశారు.పట్టణంలో ప్రజలకు ఎలాంటి సౌకర్యాలు, అభివృద్ధి పనులు అవసరం ఉన్నా ప్రజా ప్రతినిధులను మరియు అధికారులను సంప్రదించాలని వాటిని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు మరియు పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,కమిషనర్ ఆకుల వెంకటేష్ స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,వార్డు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

జూలపల్లి,నవంబర్ 04(జనంసాక్షి) : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు, భాషా నైపుణ్యాలు, రాత సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పకడ్బందీగా అమలు చేయాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. బుధవారం జూలపల్లిలోని జడ్పీహెచ్ఎస్ లో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశం ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,లి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రెమిడియేషన్, ఏ ఎక్స్ ఎల్ ఎ 1, ఎఫ్.ఎల్.ఎన్. తరగతుల నిర్వహణను మండల విద్యాధికారులు (ఎం.ఈ.ఓలు), ప్రధానోపాధ్యాయులు (హెచ్.ఎం.లు) నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.తెలుగు,ఆంగ్లం,గణితం సబ్జెక్టుల్లో నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని,విద్యార్థుల నమోదు, అభ్యసన ఫలితాలు, ఇతర పరిపాలనా అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి,వారి అవసరాలకు అనుగుణంగా అదనపు బోధన అందించాలని తెలిపారు. రాత నైపుణ్యాల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ 100 రోజుల కార్యాచరణలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.తెలుగు,ఆంగ్లం, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు నిర్వహిస్తున్న రెమిడియేషన్ తరగతులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా గణితంలో కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం అనే నాలుగు ప్రాథమిక ప్రక్రియల్లో ప్రతి విద్యార్థి వంద శాతం నైపుణ్యం సాధించేలా బోధన చేపట్టాలని తెలిపారు.తరగతుల వారీగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేస్తూ, ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించని విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎం.ఈ.ఓలు, హెచ్.ఎం.లకు సూచించారు.ఏ ఎక్స్ ఎల్ ఏ1 కార్యక్రమంలో విద్యార్థుల నమోదు ప్రక్రియను పూర్తి చేయడంతో పాటు, డిజిటల్ అభ్యసన విధానం ద్వారా విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,తదితరులు పాల్గొన్నారు.



గ్రిడ్‌కు సోలార్‌ప్లాంట్ విజయవంతంగా అనుసంధానం

పెద్దపల్లి,నవంబర్ 04(జనంసాక్షి) : సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్‌ను విద్యుత్ గ్రిడ్‌కు విజయవంతంగా అనుసంధానం చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.రాష్ట్రంలోనే సహకార సంఘాల ఆధ్వర్యంలో నాలుగు సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసిన జిల్లాగా పెద్దపల్లి గుర్తింపు పొందిందని పేర్కొన్నారు.బుధవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలోని ట్రాన్స్‌కో కార్యాలయం, విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఒక మెగావాట్ సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ సింక్రనైజేషన్ ప్రక్రియను లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి పరిశీలించారు.సోలార్ ప్లాంట్లను అధికారికంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, వచ్చే వారం ప్రభుత్వ విప్ శాసనసభ్యులు సమయం తీసుకొని రాఘవాపూర్ లో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా సహకార అధికారి శ్రీమాల, ట్రాన్స్‌కో ఎస్.ఈ. గంగాధర్, రెడ్ కో డి.యం. మనోహర్,టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.



పైలాన్ కూల్చివేత దుర్మార్గం

- వెంటనే పునరుద్ధరించాలి.. కక్షసాధింపు చర్యలతో గత అభివృద్ధిని
- చెరిపివేయలేరు: కోరుకంటి చందర్..



గోదావరిఖని, జనంసాక్షి:స్థానిక లేబర్ కోర్టు ఎదుట ఉన్న పైలాన్‌ను కూల్చివేసిన ఘటనను రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పాలనలో రామగుండం ప్రాంతంలో జరిగిన అభివృద్ధికి, ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన పైలాన్‌ను కక్షపూరితంగా కూల్చివేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కౌశిక హరి తో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ పాలనలో రామగుండం నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించామని, కార్పొరేషన్ పరిధిలోని ప్రతి ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, ప్రతి గల్లీలో రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేశామని చందర్ గుర్తుచేశారు. ప్రజల అవసరాల కోసం కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన అభివృద్ధి పనులకు సంబంధించిన గుర్తులను తొలగిస్తే భవిష్యత్ తరాలకు ఆ అభివృద్ధి ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. గత పాలనలో జరిగిన అభివృద్ధి ఆనవాళ్లను చెరిపివేయడం ద్వారా ప్రజల జ్ఞాపకాల నుంచి వాటిని తొలగించలేరని అన్నారు. పైలాన్ కూల్చివేత సమయంలో తాము శాంతియుతంగా నిరసన తెలిపి, జేసీబీలను నిలిపివేయాలని కోరినా పోలీసులు పట్టించుకోలేదని చందర్ ఆరోపించారు. పోలీసుల వ్యవహారశైలి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉందని, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే భావన కలిగించేలా పోలీసుల చర్యలు ఉన్నాయని విమర్శించారు. ప్రస్తుత పాలకులు రామగుండం ప్రాంతానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని చందర్ డిమాండ్ చేశారు. అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్లాల్సిన పాలకులు గతంలో నిర్మించిన కట్టడాలను కూల్చివేయడంపై దృష్టి పెట్టడం సరికాదన్నారు. ప్రజల్లో విద్వేషాలు సృష్టించడం, వివాదాలకు తావివ్వడం మినహా పాలకులు సాధిస్తున్నదేమిటని ప్రశ్నించారు. రాజ్యాంగబద్ధంగా ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను విస్మరించి అభివృద్ధి నిర్మాణాలను ధ్వంసం చేయడం తగదన్నారు. ప్రజలు, కార్మికులు, డ్రైవర్లు ఈ కక్షసాధింపు చర్యలను గమనిస్తున్నారని చందర్ పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌తో పాటు సంబంధిత అధికారులు ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రజల నుంచి తగిన ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కూల్చివేసిన పైలాన్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మేకల సమ్మయ్య, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
5 నవంబర్ 2026

పల్లగుట్ట విధ్వంసాన్ని అడ్డుకుంటాం

- చాడ వెంకట్‌రెడ్డి హెచ్చరిక.. పరిరక్షణకు ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలి
- ప్రకృతి సంపదను కొల్లగొడితే సహించేది లేదు
- భూగర్భ జలాలు, పర్యావరణ సమతుల్యతకు ముప్పు
- అక్రమ తవ్వకాలపై సమగ్ర విచారణ చేపట్టాలి
- అధికారులు స్పందించకుంటే ప్రజా ఉద్యమం



ముస్తాబాద్, నవంబర్ 04 (జనం సాక్షి): ముస్తాబాద్ మండలం నామాపూర్, గూడూరు గ్రామాల మధ్య ఉన్న పల్లగుట్టను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని సీపీఐ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పల్లగుట్టను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ప్రకృతి సంపదకు నిలయమైన గుట్టను ధ్వంసం చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని, రెండు గ్రామాల ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటానికి సీపీఐ సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని స్పష్టం చేశారు. కొండలు, గుట్టలను ఇష్టారాజ్యంగా తవ్వడం ప్రకృతి సమతుల్యతను దెబ్బతీయడమేనని అన్నారు. గుట్టల విధ్వంసంతో సహజ నీటి ప్రవాహాలకు ఆటంకం కలగడంతోపాటు భూగర్భ జలాల పునరుద్ధరణకు విఘాతం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వృక్షసంపద, జీవుల ఆవాసాలు నాశనమవుతాయని, దుమ్ము, ధూళి కాలుష్యంతో సమీప గ్రామాల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో ప్రకృతి సంపదను నాశనం చేస్తే భవిష్యత్ తరాలకు పర్యావరణ సంక్షోభమే మిగులుతుందని హెచ్చరించారు. పల్లగుట్ట తవ్వకాలకు సంబంధించిన అనుమతులు, నిబంధనలను అధికారులు పరిశీలించాలని, అక్రమాలు ఉన్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గుట్ట విధ్వంసంపై సమగ్ర విచారణ జరిపి తవ్వకాలను నిలిపివేయాలని కోరారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమానికి గూడూరు మాజీ సర్పంచి సాకలి రమేష్ అధ్యక్షత వహించగా సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, కడారి రాములు, గీస బిక్షపతి, చెరుకు ఎల్లం, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి దారిన పైలాన్ కూల్చివేయడం హేయనీయం

- కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విధ్వంసాన్ని ప్రశ్నించినందుకే టిఆర్ఎస్.. టీబీజీకేఎస్‌పై కేసులు
- టీబీజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి



గోదావరిఖని, జనంసాక్షి :
రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రభుత్వ, ప్రజా ఆస్తులను కూల్చి వేస్తున్న కాంగ్రెస్ చర్యలకు వ్యతిరేకంగా పోరాడాలని టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామమూర్తి పిలుపునిచ్చారు. బుధవారం గోదావరిఖని యూనియన్ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఆర్ జీ వన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని సూచిస్తూ ఏర్పాటుచేసిన పైలాన్‌ను దొడ్డిదారిన కూల్చివేయడం ఆక్షేపనీయమని అన్నారు. సింగరేణి క్వార్టర్లను కూల్చివేసి షాపింగ్ కాంప్లెక్స్ లను నిర్మించడం, సింగరేణి స్థలాలలో కార్మికేతరులకు భవనాలు నిర్మించుకోవడానికి అనుమతించడం, కార్మికుల షెడ్లను కూల్చి వేయడం లాంటి ద్వంద్వ నీతిని ఖండించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న దుర్మార్గాలను, దోపిడిని ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులపై అక్రమ కేసులు బనాయించడాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. మున్సిపల్, పోలీస్ అధికారులు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు అనుకూలంగా వ్యవహరించడం తగదని వారన్నారు. పట్టణంలోని ఇందిరా గాంధీ విగ్రహంతో పాటు, వివిధ ముఖ్య కూడలి ప్రాంతాలలోని ప్రమాదకరమైన విగ్రహాలు, నిర్మాణాలపై అనుసరించవలసిన పద్ధతులపై రాజకీయ పార్టీలు, రామగుండం పాలకవర్గంలోని ప్రజా ప్రతినిధులతో చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. వడ్డేపల్లి శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో, టీబీజీకేఎస్ రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు నూనె కొమురయ్య, కేంద్ర అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, నాయకులు పోలాడి శ్రీనివాస రావు, దూట శేషగిరి, కొండ్ర అంజయ్య, ఉప్పులేటి తిరుపతి, వాసర్ల జోసెఫ్, ఏ.గోపి, జనగామ మల్లేష్, మహేందర్ రెడ్డి, రహమాన్, పులిపాక శంకర్, మీస రాజు, కళాధర్ రెడ్డి, అఫ్సర్, రొడ్డ సంపత్, వెంకట్ రెడ్డి, భాస్కర్, సంపత్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్‌లో సత్తా చాటిన నల్లవెల్లి ఆనంది

- బంగారు పతకంతో జాతీయ స్థాయికి ఎంపిక
- 400 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం..
- మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ పోటీలకు అర్హత

కమాన్‌పూర్, నవంబర్ 04, (జనంసాక్షి) : క్రీడా మైదానంలో వేగానికి చిరునామాగా నిలుస్తూ కమాన్‌పూర్ యువ అథ్లెట్ నల్లవెల్లి ఆనంది రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. ఖమ్మంలో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్--17 బాలికల విభాగంలో 400 మీటర్ల పరుగుపందెంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకుని అందరి దృష్టిని ఆకర్షించారు. పోటీలో ప్రత్యర్థులతో హోరాహోరీగా తలపడుతూ తన వేగం, పట్టుదల, క్రీడా నైపుణ్యంతో లక్ష్యాన్ని చేరుకుని ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ విజయంతో ఆనంది జాతీయస్థాయి పోటీలకు ఎంపికై తన ప్రతిభను మరో స్థాయికి తీసుకెళ్లారు. మధ్యప్రదేశ్‌లో ఈ నెల 19 నుంచి 23 వరకు నిర్వహించనున్న 70వ జాతీయ పాఠశాల క్రీడల అథ్లెటిక్స్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. సాధనకు పట్టుదల తోడైతే విజయాలు సొంతమవుతాయని ఆనంది నిరూపించారు. రాష్ట్రస్థాయిలో బంగారు పతకం సాధించడమే కాకుండా జాతీయ పోటీలకు అర్హత సాధించడం ఆమె క్రీడా ప్రస్థానంలో కీలక మైలురాయిగా నిలిచింది. ఈ విజయం స్థానిక క్రీడాభిమానుల్లో ఆనందోత్సాహాలు నింపింది. జాతీయస్థాయి పోటీల్లోనూ ఆనంది తన ప్రతిభను చాటుకుని పతకం సాధించాలని, తెలంగాణతోపాటు కమాన్‌పూర్ మండలానికి కీర్తిప్రతిష్ఠలు తీసుకురావాలని స్థానికులు, క్రీడాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

అంతర్జాతీయ ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు జెస్సికా చిత్రం ఎంపిక

- అలోక్ హైస్కూల్ 6 తరగతి విద్యార్థిని ప్రతిభ
- జెస్సికాపై పాఠశాల యాజమాన్యం హర్షం



మంథని, నవంబర్ 04 (జనంసాక్షి): చిత్రకళలో మంథనికి చెందిన అలోక్ హైస్కూల్ విద్యార్థిని జెస్సికా అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటింది. ఎసఎసఆర్మే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఆర్ట్ పోటీల్లో భాగంగా ఇండోనేషియాలో జరిగే ఆర్ట్ ఎగ్జిబిషన్‌కు ఆమె గీసిన చిత్రం ఎంపికైంది. దాదాపు 20 దేశాలకు చెందిన కళాకారులు, విద్యార్థులు పాల్గొన్న ఈ ప్రదర్శనలో జెస్సికా చిత్రానికి చోటు దక్కడం విశేషం.ప్రస్తుతం ఆరో తరగతి చదువుతున్న జెస్సికా రూపొందించిన కళాఖండాన్ని ఇండోనేషియాలో రెండు వారాల పాటు ప్రదర్శించనున్నారు. అంతర్జాతీయ కళా పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించి, మార్గనిర్దేశం చేస్తున్న అంతర్జాతీయ త్రీడీ ఆర్టిస్ట్‌తోపాటు ఎగ్జిబిషన్ నిర్వాహకురాలు సెప్ట మియోసకికి ఎంపికైన కళాకారులు కృతజ్ఞతలు తెలిపారు. చిన్న వయసులోనే అంతర్జాతీయ గుర్తింపు పొందిన జెస్సికాను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నకిలీ నంబర్లతో నయా దొంగతనాలు

- పగటిపూట ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ఆట కట్టించిన పోలీసులు!
- నిఘా వర్గాల పక్కా సమాచారంతో అంతర్రాష్ట్ర దొంగల మూఠాను అరెస్ట్ చేసి, రూ. 14 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్న నవీపేట్ పోలీసులు





నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనం సాక్షి: జిల్లాలో కలకలం సృష్టించిన పగటిపూట వరుస దొంగతనాల కేసును పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య దిశానిర్దేశం, నిజామాబాద్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సి. ప్రకాష్ యాదవ్ పర్యవేక్షణలో నవీపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఆపరేషన్ విజయవంతమైంది. నవీపేట్ ఎస్.ఐ. కె. శ్రీకాంత్ మరియు నవీపేట్ పీఎస్, సీసీఎస్ టీమ్, ఏసీపీ పి. శ్రీశైలం, సీఐ అజయ్ కుమార్, సిబ్బంది సమన్వయంతో నిందితుల కదలికలపై నిఘా పెట్టి, నమ్మదగ్గ పక్కా సమాచారం అందిన వెంటనే ఉదయం 11:00 గంటల సమయంలో నిజామాబాద్ వైపు వస్తున్న నిందితులను చాకచక్యంగా అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు.ఈ అంతర్రాష్ట్ర దొంగలు అత్యంత మోసపూరిత పద్ధతులను అవలంబిస్తూ పోలీసుల కళ్ళు గప్పుతున్నారు. ఓఎల్ఎక్స్ (ఖాశ) లో అమ్మకానికి పెట్టిన కార్ల నంబర్లను సేకరించి, నకిలీ నంబర్ ప్లేట్లు తయారు చేయించి వాటిని తమ హోండా సిటీ కారుకు మార్చుకుంటూ తిరుగుతున్నారు. పాన్ షాపులు నిర్వహించడం, పండ్ల వ్యాపారం చేయడం, భిక్షాటన చేయడం వంటి ముసుగుల్లో తిరుగుతూ ప్రధాన నిందితుడు సయ్యద్ షకీల్ ఇంట్లోకి వెళ్లి దొంగతనాలకు పాల్పడుతుండగా, మిగతా నిందితులు (షేక్ అహ్మద్, షేక్ ఇమ్రాన్) చుట్టుపక్కల ఎవరైనా వస్తున్నారేమోనని గమనిస్తూ అతనికి సహకరించేవారు. వీరు నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, యాదాద్రి భువనగిరి జిల్లాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలలోనూ పలు దొంగతనా లకు పాల్పడి గతంలోనూ జైలుకు వెళ్లి వచ్చినట్లు విచారణలో తేలింది.నిందితుల నుంచి సుమారు రూ. 14 లక్షల విలువైన ఆస్తులను పోలీసులు విజయవంతంగా స్వాధీనం చేసుకున్నారు. ఇందులో సుమారు 30 గ్రాముల బంగారు నెక్లెస్, బంగారు బిస్కెట్లు, ఉంగరాలు, కమ్మలు, వెండి గొలుసులు, హోండా సిటీ కారు, నకిలీ నంబర్ ప్లేట్లు, ఇనుప రాడ్లు మరియు రూ. 5000/- నగదు ఉన్నాయి. అంతర్రాష్ట్ర దొంగల గుట్టురట్టు చేసి ఇంత పెద్ద మొత్తంలో సొత్తును రికవరీ చేయడంలో కీలకపాత్ర పోషించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని సీపీ పి. సాయి చైతన్య ప్రత్యేకంగా అభినందించారు.



రోగుల జేబులకు చిల్లులు.. మందుల ధరలకు హద్దేది?

నిజామాబాద్‌లో ఔషధ విక్రయాలపై అనుమానాలు

- జనరిక్ మందుల లభ్యత ఏదీ? పర్యవేక్షణపై ప్రజల ప్రశ్నలు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 4 జనం సాక్షి :
అనారోగ్యం ఓవైపు మందుల ఖర్చులు మరోవైపు ఇప్పటికే నిత్యావసరాల ధరలతో సతమతమవుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చులు తలకు మించిన భారంగా మారుతు న్నాయి. ప్రాణాలు కాపాడాల్సిన మందులే సామాన్యుల జేబులకు చిల్లులు పెడుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకే కంపెనీ కి చెందిన ఒకే బ్యాచ్ మందులకు ఎంఆర్‌పీ ఒకటే ఉన్నప్పటికీ, ఏజెన్సీల వద్ద కొనుగోలు ధరల్లో వ్యత్యాసాలు కనిపిస్తున్నాయన్న ఆరోపణలు చర్చనీయాంశంగా మారాయి. పెద్ద మొత్తంలో కొనుగోళ్లు చేసేవారికి అధిక రాయితీలు లభిస్తుండగా, చిన్న వ్యాపారులు, చివరకు వినియోగదారులు మాత్రం అదనపు భారాన్ని మోయాల్సి వస్తోందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మందుల ధరల నిర్ణయంలో అసలు లెక్కలేమిటి? రాయితీల వెనుక ఉన్న విధానాలేమిటి? అన్న ప్రశ్నలకు సంబంధిత వర్గాలు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం కనిపిస్తోంది.

ప్రిస్క్రిప్షన్ లేకుండానే విక్రయాలా? తనిఖీలు ఎక్కడ?
నిజామాబాద్ పట్టణంలో మెడికల్ షాపుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, వాటి నిర్వహణపై పర్యవేక్షణ ఎలా సాగుతోందన్న చర్చ మొదలైంది. కొన్ని దుకాణాల్లో వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా యాంటీబయాటిక్స్ వంటి మందుల విక్రయంలో నిబంధనలు పాటిస్తున్నారా? అర్హత కలిగిన ఫార్మసిస్టులు విధుల్లో ఉంటున్నారా? మందుల నిల్వ, గడువు తేదీలు, బిల్లుల జారీ విషయంలో ప్రమాణాలు అమలవుతున్నాయా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ అవసరం. ఔషధ నియంత్రణ శాఖ క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహిస్తూ, ఉల్లంఘనలు గుర్తిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. మందుల విక్రయాల్లో పారదర్శకత, నాణ్యత, భద్రతకు పెద్దపీట వేయడం ప్రజారోగ్య పరిరక్షణలో కీలకం. మందుల కొనుగోలు ధరల్లో వ్యత్యాసాలపై వాస్తవాలను పరిశీలించడం, జనరిక్ మందుల లభ్యతను మెరుగుపరచడం, ప్రిస్క్రిప్షన్ ఆధారిత విక్రయ నిబంధనలను అమలు చేయడం, మెడికల్ షాపుల నిర్వహణను పర్యవేక్షించడం వంటి అంశాలపై అధికారులు సమగ్ర దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా మందుల ధరలు, సరఫరా విధానం, రాయితీల అమలు, బిల్లుల జారీపై ఫిర్యాదులు వస్తే వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత శాఖపై ఉంది. ఇప్పటికే కుటుంబ పోషణ, పిల్లల చదువులు, నిత్యావసర ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులకు అనారోగ్యం మరో ఆర్థిక సంక్షోభంగా మారకూడదంటే మందులు సరసమైన ధరలకు అందుబాటులో ఉండాలి. లాభాపేక్షకు మించి ప్రజారోగ్యానికి ప్రాధాన్యం ఇచ్చే వ్యవస్థ అవసరం. నిజామాబాద్‌లో మందుల విక్రయాలపై నెలకొన్న సందేహాలకు అధికారులు ఎలాంటి సమాధానం ఇస్తారు? తనిఖీలతో పాటు పారదర్శకమైన చర్యలు చేపట్టి రోగులకు భరోసా కల్పిస్తారా? అన్నది వేచి చూడాలి.

ఒకే మందు కొనుగోలు ధరల్లో తేడా

ఇటీవల రెండు ఇంజెక్షన్ల కొనుగోలులో ధరల వ్యత్యాసాన్ని గమనించిన ఓ వ్యక్తి, అదే ఉత్పత్తిని మరో ఏజెన్సీ నుంచి కొనుగోలు చేసి పోల్చినట్లు సమాచారం. రెండు ఉత్పత్తుల కంపెనీ, బ్యాచ్ నంబర్, ఎంఆర్‌పీ ఒకటే అయినప్పటికీ కొనుగోలు ధరలు వేర్వేరుగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది. భారీగా మందులు కొనుగోలు చేసే వారికి కంపెనీలు ప్రత్యేక రాయితీలు ఇస్తున్నాయనే వాదనలు వినిపిస్తున్నా, ఈ వ్యత్యాసాలకు వాస్తవ కారణాలేమిటన్నది అధికారిక పరిశీలనతోనే తేలాల్సి ఉంది. మరోవైపు, తక్కువ ధరలకు లభించాల్సిన జనరిక్ మందులు అందుబాటులో లేకపోవడంతో ఖరీదైన బ్రాండెడ్ మందులనే కొనుగోలు చేయాల్సి వస్తోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయితీల పేరుతో వినియోగదారులకు అందుతున్న ప్రయోజనం ఎంత? జనరిక్ మందుల సరఫరా, లభ్యతపై సంబంధిత విభాగాలు దృష్టి సారిస్తున్నాయా? అన్న సందేహాలు నెలకొంటున్నాయి.



రాఘవపూర్‌లోని ఓబ్రిక్స్‌లో గంజాయి కలకలం

- ఇతర రాష్ట్రాల వలస కూలీలకు విక్రయించేందుకు వచ్చి కటకటాల పాలు
- కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ ఐ మధుకర్

పెద్దపల్లి,(జనంసాక్షి) : పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామ శివారులో (ఎల్ఎమ్ఎన్) బిక్స్ వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెద్దపల్లి రూరల్ ఎస్ఐఎన్. మధుకర్ వారి సిబ్బంది అతనిని పట్టుకొని విచారించగా అతని వద్ద గంజాయి దొరికిందనీ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ వ్యక్తి దానిని ఇతర రాష్ట్రాల వలస కూలీలకు అమ్ము దామని వచ్చినట్లు తెలిపాడని అతనినీ విచారించగా అతని పేరు పాకాల లోకేష్, హైదరాబాదు అతను అన్నారు.ఆ వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుండి ఒక 1కె జి 161 గ్రాములు గంజాయిని సీజ్ చేసినామని తెలిపారు. దాని దాని విలువ సుమారుగా రూ 58050/- గా ఉంటుంది దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

కార్పొరేషన్ అవినీతిపై చర్యలేవి?

బండి సంజయ్ ప్రకటనపై కాంగ్రెస్ నేత వైద్యుల అంజన్‌కుమార్ ప్రశ్నలు

- సొంత కార్పొరేటర్లనే హెచ్చరించడంపై విమర్శలు
- అవినీతి జరుగుతోందని మీరే అంగీకరించారు
- గత పాలకవర్గం అక్రమాలపై చర్యలేవి?
- కరీంనగర్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వమే నిధులిస్తోంది



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 04 (జనంసాక్షి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి జరుగుతోందని స్వయంగా అంగీకరించిన కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్‌కుమార్.. బాధ్యులపై చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ ప్రశ్నించారు. అవినీతికి పాల్పడితే బ్లాక్‌లిస్ట్‌లో పెడతానంటూ సొంత కార్పొరేటర్లను హెచ్చరించడం కంటే అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కరీంనగర్ అభివృద్ధికి నిధుల వరద పారిస్తామన్న బండి సంజయ్ ఇప్పటివరకు ఎంత నిధులు తీసుకొచ్చారో వెల్లడించాలని కోరారు. ప్రస్తుతం ప్రారంభిస్తున్న అభివృద్ధి పనులు యూఐడీఎఫ్ నిధులు, యూసీఎఫ్ టెండర్లకు సంబంధించినవేనని పేర్కొన్నారు. వీటిలో కేంద్రం వాటా 25 శాతం, రాష్ట్రం వాటా 25 శాతం కాగా, మిగిలిన 50 శాతానికి రాష్ట్ర ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తోందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సహకారంతోనే అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని అన్నారు. గత పాలకవర్గం హయాంలో కూడళ్లు, చౌరస్తాల అభివృద్ధి పేరుతో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు గత అవినీతిపై ఎందుకు విచారణ జరిపించడం లేదని ప్రశ్నించారు. అప్పట్లో పనిచేసిన అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు ఇప్పటికీ వ్యవస్థలోనే ఉన్నారని, పార్టీలు మారినంత మాత్రాన అక్రమాలపై బాధ్యత తప్పదని అన్నారు. కార్పొరేషన్‌లో గత, ప్రస్తుత పాలకవర్గాల హయాంలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల కరీంనగర్ కలెక్టరేట్ భవన ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నగర సమస్యలపై కాంగ్రెస్ కార్పొరేటర్లు వినతిపత్రం అందజేశారని, ఆయన సానుకూలంగా స్పందించారని అంజన్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, గంట శ్రీనివాస్, కాంతల జగన్‌రెడ్డి, చారకొండ బుచ్చిరెడ్డి, పడిశెట్టి భూమయ్య, కల్లపల్లి బాలరాజు, సరిల్ల ప్రసాద్, కంకణాల అనిల్, ఇమ్రాన్, సత్రం శ్రీకాంత్,పహాడ్, పెంటశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఏటీఎంలో నకిలీ నోటు కలకలం

భీంగల్ నవంబర్ 4 జనం సాక్షి: భీంగల్ మండ లంబడా భీంగల్ గ్రామానికి చెందిన ధరణి బుధవారం ఉదయం 10 గంటల సమయంలో పట్టణ కేంద్రంలో ముచ్చూర్ చౌరస్తా వద్దగల ఇండియన్ 1 ఏటీఎం నుండి 24 వేల రూపాయల నగదును డ్రా చేయగా వాటిలో 500 రూపాయల నకిలీ నోటు వచ్చిందని వాపోయారు. ఈ సందర్భంగా ధరణి ఏటీఎం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నకిలీ నోటు ఏటీఎంలో రావడంతో భీంగల్ పరిసర ప్రాంతాలు భీంగల్ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం వ్యవసాయ పనులు.. రాత్రి ఇసుక దోపిడీ

- ఎడపల్లిలో యదేచ్ఛగా సాగుతున్న అక్రమ రవాణా
- మొరం కోసం తాసిల్దార్ కార్యాలయం ఎదుట బాహబాయి

ఎడపల్లి, నవంబర్ 4 (జనంసాక్షి) : ఎడపల్లి మండల కేంద్రంలో అక్రమ ఇసుక రవాణా కొత్త పోకడలకు దారి తీస్తుంది. ఉదయం వ్యవసాయ పనులలో బిజీగా ఉంటూ రాత్రి మాత్రం అక్రమ ఇసుక రవాణాకు తెరలేపడం గ్రామంలో చర్చనీయా అంశంగా మారింది. అటు రెవెన్యూ అధికారులు ఇటు పోలీసు అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతోనే అక్రమ ఇసుక రవాణా దారులు రాత్రి వేళలో మూడు పువ్వులు ఆరు కాయలుగా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత కాలంలో ఎంతోమంది నూతన గృహాలను నిర్మించుకునేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న అక్రమ ఇసుక రవాణాదారులు ఇసుక కావాల్సిన ప్రజలకు వారి నుండి ట్రాక్టర్ కు 4 వేల నుండి 5వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు సైతం లేకపోలేదు. ఉదయం వేళలో తమ వ్యవసాయ పనులతో పాటు ఇతరులకు వివిధ రకాల పనులకు కిరాయి వెళ్తూ రాత్రి వేళలో మాత్రం ఎలాంటి రుసుము చెల్లించకుండా ఫ్రీగా వచ్చే గ్రామ శివారులోని వాగు నుండి ఇసుకను తోడేళ్లుగా తోడేస్తూ భూగర్భజలాలు అడుగంటి పోయేవిధంగా లోతుగా తోడడంతో అటుగా వెళ్లే రైతులు సైతం భయభ్రాంతులకు గురికావాల్సి వస్తుందని ప్రజలు బాహాటంగా ఆరోపిస్తున్నారు. రాత్రి వేళలో ఇసుకను యదేచ్ఛగా వాగులో నుండి తీసుకొని వచ్చి గ్రామంలోని పలు ప్రాంతాల్లో డంపులుగా పేర్చి దర్జాగా విక్రయాలు కొనసాగిస్తున్న సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంలో గల మతలబు ఏమిటో అర్థం కావడం లేదు. కొంతమంది అధికార సిబ్బంది ఇసుక అక్రమ రవాణా దారులకు సమాచారాన్ని చేరవేస్తూ అందినంత దోచుకుంటున్నారనే సమాచారం సైతం లేకపోలేదు. ఇసుక అక్రమ రవాణా దారులు తమకు పై స్థాయిలో మంచి సంబంధాలు ఉన్నాయి.. ఎవరు ఎంతమంది వచ్చినా మమ్మల్ని ఏమి చేయలేరు.. మా ట్రాక్టర్ పట్టుకుంటే ఫోన్ చేస్తే చాలు విడిచిపెడతారు అంటూ దర్జాగా తమ అక్రమ ఇసుక వ్యాపారాన్ని కొనసాగించడం విశేషం. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితుల వల్ల ఇప్పటికే భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి పోతున్న తరుణంలో అక్రమ ఇసుక రవాణా దారులు వాగుల నుండి ఇసుకలో తోడేస్తుంటే భవిష్యత్తులో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎడపల్లిలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఎడపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.

తాసిల్దార్ కార్యాలయం ఎదుట బాహబాహీ కాగా బుధవారం బోధన్ ఆర్డిఓ విజయ కుమారి తాసిల్దార్ కార్యాలయాన్ని తనిఖీ వచ్చిన సమయంలో మొరం మాఫియా దారులు ఒకరిపై ఒకరు పిడి గుద్దులు చేసుకున్నట్లు సమాచారం. అనుమతి తీసుకొని నడుస్తున్న మొరం వాహనాలపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వ్యక్తులకు అధికార పార్టీకి చెందిన వ్యక్తికి మధ్య ఘర్షణ జరిగినట్లు సమాచారం. అయితే సదరు వ్యక్తులు రాత్రి పగలు అనే తేడా లేకుండా మొరం దర్జాగా రవాణా చేయడం కొసమెరుపు. ఈ విషయంలో అధికారులు స్పందించాల్సి ఉంది.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

రైతు బజార్ తరలిస్తే ప్రత్యామ్నాయ స్థలం కల్పించాలి



అల్వాల్, నవంబరు 4 (జనంసాక్షి) : ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం అల్వాల్ రైతు బజార్ తరలించాల్సి వస్తే, అక్కడి రైతులు, వ్యాపారులకు ముందుగానే ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని బాధితులు కోరారు. ఈ మేరకు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. దాదాపు 27 ఏళ్లుగా రైతు బజార్‌పై ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, కారిడార్ నిర్మాణంతో మార్కెట్ తరలిస్తే తమ జీవనోపాధి దెబ్బతింటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, వ్యాపారులు, చిరు వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అల్వాల్ పరిసర ప్రాంతాల్లోనే ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి మార్కెట్ కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బాధితుల వినతిపై ఎంపీ ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి, బాధితులకు న్యాయం జరిగేలా మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే గౌస్, ఎం. సత్యం, సీహెచ్. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వంగ భాస్కర్‌రెడ్డి, చాగంటి శ్రీనివాస్, సీహెచ్. శ్రీకాంత్‌రెడ్డి, సీహెచ్. ఆంజనేయులు, నాయిని శ్రీకాంత్, సీహెచ్. నరసింహారెడ్డి, వై. ఉపాలయ్య, భవానందపూర్ శ్రీకాంత్, బుచ్చమ్మ, రాణి, అందాలు, సునీతారెడ్డి, పోచమ్మ, మంగమ్మ, గౌసియా, హైమవతి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల స్థలాల కోసం ప్రత్యేక కార్యాచరణ

- మంత్రి పొంగులేటి శ్రీనువాస్ రెడ్డి



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 4 (జనంసాక్షి) : తెలంగాణలో అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక పాలసీని మరియు శాశ్వత పరిష్కారాన్ని రూపొందిస్తోందని రెవెన్యూ,గృహ నిర్మాణ ,పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, డి.శ్రీధర్ బాబు లకు జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. జర్నలిస్టులకు చట్టపరమైన చిక్కులు లేని విధంగా, నివాసయోగ్యమైన ప్రాంతంలో ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని తెలిపారు.త్వరలోనే అరులైన జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇళ్ల స్థలాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్ భవన్ కోసం స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కల్లేపల్లి రవిచంద్ర, ప్రధాన కార్యదర్శి పాక రవీందర్, ఉపాధ్యకులు పన్నాల బాల్ రెడ్డి, రామకృష్ణ, రవికిరణ్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు రామారావు, శ్రీరాములు సీనియర్ జర్నలిస్టులు, హనుమంత్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ప్రశ్నించే హక్కును కోల్పోవద్దు..



కాప్రా, నవంబర్ 4 (జనం సాక్షి) : తెలంగాణ రక్షణ సేన పార్టీ అధినేత కల్వకుంట్ల కవిత, పార్టీ ఆవిర్భావానికి ముందునుంచే బీసీ బిడ్డల హక్కుల కోసం, బహుజన పాలన సాధన కోసం పోరాటం చేస్తున్నారని మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ భవాని వేముల పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాష్ కొల్లూరును తెలంగాణ రక్షణ సేన ప్రకటించడం బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో భాగమని తెలిపారు.విద్యావంతుడైన ఆకాష్ కొల్లూరు నేషనల్ ఛానల్ జర్నలిస్టుగా పనిచేసి, ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకున్నారని, సామాజిక బాధ్యతతో ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి ప్రవేశించారని పేర్కొన్నారు. గతంలో అనేక పార్టీలు అధికారంలో ఉన్నప్పటికీ కుమ్మరి సామాజికవర్గానికి తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించలేదని అన్నారు.బీసీ సామాజికవర్గానికి చెందిన కుమ్మరి బిడ్డకు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించడం ద్వారా కల్వకుంట్ల కవిత బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తామన్న మాటను నిలబెట్టుకున్నారని భవాని వేముల తెలిపారు.పట్టభద్రులు ఆలోచించి, ప్రజా సమస్యలపై ప్రశ్నించే తత్వం ఉన్న అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని, అర్హులైన ప్రతి పట్టభద్ర ఓటరు ఆకాష్ కొల్లూరుకు ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రఘు, నాయకులు రమాదేవి, లోకనాథం, నవీన్, మనోజ్,కవిత,స్వప్న, నరేష్ ,వీరేందర్, రజిత, జ్యోతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



చేవెళ్ల, నవంబర్ 4 (జనంసాక్షి) : గ్రామాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని గొల్లగూడ గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు. నూతనంగా ఏర్పడిన గొల్లగూడ గ్రామ పంచాయతీ అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామానికి సంబంధించిన పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సమతా వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు దేవర వెంకట్ రెడ్డి, గోనే ప్రతాప్ రెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు నిర్మల నర్సింలు, రాంచంద్రయ్య గౌడ్, లావణ్య రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గిరిధర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు బండారి శైలజ, ఆగిరెడ్డి, దావల్గారి గోపాల్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, ఎంపీడీవో బన్సీలాల్, ఎంపీవో విఠలేశ్వర్, పీఆర్ డీఈఈ గణేష్, మాజీ సర్పంచులు హన్మంత్ రెడ్డి, రాజశేఖర్, రాంరెడ్డి, వీరేందర్ రెడ్డి, కాంగ్రెస్నా పార్టీ నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు

- మంత్రి పొంగులేటి శ్రీనువాస్ రెడ్డి
- లబ్ధిదారుల ఆనందంలో భాగస్వాములు కావాలి
- రాష్ట్రవ్యాప్తంగా 2.21 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తి
- నిర్మాణ దశలో మరో 1.90 లక్షల ఇళ్లు

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 4 (జనంసాక్షి) : రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహాల్లో ఈ దీపావళి పండుగను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లలో వెలిగే ప్రతి దీపం పేదల ఆత్మగౌరవానికి, ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయని, మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని వెల్లడించారు. బుధవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పొంగులేటి మాట్లాడారు. దీపావళి రోజున గృహప్రవేశాలు పూర్తిచేసుకున్న ఇందిరమ్మ ఇళ్లకు ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహనిర్మాణ శాఖ అధికారులు,



ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు వెళ్లి లబ్ధిదారుల కుటుంబాలతో పండుగ వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ‘మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు’ పోస్టర్‌ను శ్రీధర్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు.

రూ.40 వేల కోట్లతో ఇళ్ల నిర్మాణం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు 2.21 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తయ్యాయన్నారు. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్లు, హైదరాబాద్ క్యూర్ ఏరియా పరిధిలో లక్ష ఇళ్లను మంజూరు చేసినట్లు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.40 వేల కోట్లతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేసేది లేదని స్పష్టం చేశారు.

నాలుగు నగరాల్లో ఇందిరమ్మ టవర్లు

హైదరాబాద్ తరహాలో నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ నగరాల్లోనూ ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి ప్రకటించారు. జీ+5 విధానంలో నిర్మించనున్న ఈ టవర్లకు సంబంధించి దీపావళిలోగా నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్లలో వచ్చే ఏడాది బోనాల పండుగ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేరుగా ఖాతాల్లోకి నిధులు

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి ప్రతి సోమవారం నేరుగా నిధులు జమ చేస్తున్నామని, ఈ ప్రక్రియలో అవినీతికి తావులేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని పొంగులేటి వివరించారు. నగరాలు, పట్టణాలు, గ్రామాలతోపాటు మారుమూల ప్రాంతాలు, తండాల్లోనూ ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని, తద్వారా నిరుపేదల సొంతింటి కల సాకారమవుతోందని పేర్కొన్నారు. దీపావళి వేడుకలను విజయవంతం చేసేందుకు ముఖ్యమంత్రి సహా మంత్రివర్గం, ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని కోరారు.

రైతుల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, నవంబర్ 4 (జనం సాక్షి) : మండలంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం నూతన ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్ నూతన చైర్‌పర్సన్‌గా మాతంగి శిరీష అనిల్,వైస్ చైర్మన్‌గా పర్న సంతోష్ కుమార్‌తో పాటు డైరెక్టర్లుగా జెల్లా రాజేశ్వరి,దేశరాజు అనిల్,నందికొండ తిరుపతిరెడ్డి,మైసంపల్లి తిరుపతి,ఇస్కిల్ల ఐలయ్య,జీల లింగం,రెడ్డి రామకృష్ణారెడ్డి,మహమ్మద్ సాదిక్,కుంట హరికృష్ణ,ఎలకంటి శ్రీనివాస్ రెడ్డి,బోయినపల్లి కృష్ణారావు,గుండా వెంకట్ రెడ్డి కి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రైతుల కష్టాలను అర్థం చేసుకొని వారి సమస్యల పరిష్కారానికి నూతన పాలకవర్గం చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.నియోజకవర్గంలోనే అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న బెజ్జంకి వ్యవసాయ మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసి రైతులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీతో పాటు ఉచిత విద్యుత్,ఎరువులు,విత్తనాలు అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది అనీ అన్నారు.పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు కాంగ్రెస్‌లో ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని,పదవులు రానివారు నిరాశ చెందకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.తన వెన్నంటి నిలిచి పార్టీ గెలుపు కోసం కష్టపడిన ప్రతి



కార్యకర్తకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు.మాతంగి అనిల్ పార్టీ కోసం చేసిన కృషికి గుర్తింపుగానే ఆయన సతీమణి శిరీషకు ఏఎంసీ చైర్‌పర్సన్ పదవి దక్కింది అనీ అన్నారు.

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం..

ప్రమాణ స్వీకారోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కేడీసీసీ బ్యాంకు చౌరస్తా వద్ద నాయకులు,కార్యకర్తలు,మహిళలు ఘన స్వాగతం పలికారు.అక్కడి నుంచి మార్కెట్ యార్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించగా,ఎడ్లబండి చౌరస్తాలో గోమాత విగ్రహాలకు పూలమాలలు వేసి వందనం సమర్పించారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ఒగ్గు దామోదర్,అక్కరవేణి పోచయ్య,ఏఎంసీ మాజీ చైర్మన్ పులి కృష్ణ,మాజీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాసరెడ్డి,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్,గన్నేరువరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సునీల్,ముక్కిన రత్నాకర్ రెడ్డి,గూడెల్లి శ్రీకాంత్,బైరా రాజేందర్,చెప్యాల శ్రీనివాస్ గౌడ్,కత్తి రమేష్,శానగొండ శ్రావణ్,శరత్,జెల్ల ప్రభాకర్,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



దోమ, నవంబర్ 4 జనం సాక్షి) : గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో సర్పంచ్ పట్లోళ్ల సత్యనారాయణ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి తన సొంత నిధులు రూ.2.5 లక్షలు వెచ్చించి దోర్నాలపల్లిలో నూతనంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధిలో భాగంగా ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు.ఈ ప్లాంట్ ద్వారా గ్రామస్తులకు 20 లీటర్ల మినరల్ వాటర్ క్యాన్‌ను కేవలం రూ.5కే అందించనున్నారు. బయట నుంచి తాగునీటిని కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే తక్కువ ధరకు శుద్ధి చేసిన నీరు అందుబాటులోకి రావడం ప్రజలకు ప్రయోజనకరంగా మారనుంది. ముఖ్యంగా నిత్యం తాగునీటి కోసం ఖర్చు చేసే కుటుంబాలకు ఈ ఏర్పాటు ఆర్థికంగా ఊరటనివ్వనుంది.గ్రామంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ప్రజాప్రతినిధుల చొరవ ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం చాటిచెబుతోంది. ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూడకుండా సొంతంగా రూ.2.5 లక్షలు వెచ్చించి తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేయడం గ్రామస్తుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. తక్కువ ధరకు నీరు అందించాలనే నిర్ణయంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద వెంకటరెడ్డి, పలువురు యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సుస్థిర సాంకేతికతల అభివృద్ధిలో ఫంక్షనల్ మెటీరియల్స్ కీలకం

- ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి..
- అంతర్జాతీయ సదస్సులో 400 మంది ప్రతినిధుల హాజరు

సికింద్రాబాద్, నవంబర్ 4 (జనం సాక్షి) : ఇంధన, పర్యావరణ సవాళ్లకు పరిష్కారాలను అందించడంలో వినూత్న ఫంక్షనల్ మెటీరియల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎస్ఐఆర్-- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) డైరెక్టర్ డాక్టర్ డి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. తార్నాక లోని ఐఐసీటీలో రెండు రోజుల ‘ఇన్నోవేటివ్ ఫంక్షనల్ మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీస్ 2026 అంతర్జాతీయ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ ఇంధనం, ఎలక్ట్రిక్ మొబిలిటీ, పర్యావరణ పరిరక్షణ, అధునాతన తయారీ రంగాల్లో కొత్త ఆవిష్కరణలకు పరిశోధనలు దోహదపడతాయని పేర్కొన్నారు. వివిధ శాస్త్ర విభాగాలకు చెందిన నిపుణులు ఒకే వేదికపైకి వచ్చి పరిశోధనలు, ఆలోచనలను పంచుకోవడం ద్వారా సరికొత్త సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేయవచ్చన్నారు. దేశీయ సాంకేతికతల అభివృద్ధి, పరిశ్రమలు-విద్యాసంస్థల మధ్య సహకారం, పరిశోధనలను వాణిజ్యపరమైన ఉత్పత్తులుగా మార్చాల్సిన అవసరాన్ని వివరించారు. అనంతరం ఈ సదస్సులో



డాక్టర్ ఆర్. బాలమురళీకృష్ణన్, డాక్టర్ ఎస్.వి.ఎస్. నారాయణమూర్తి, ప్రొఫెసర్ టి. నరసింగరావు, పద్మశ్రీ డాక్టర్ సుభా వి. అయ్యంగార్ తదితరులు ఉపన్యాసాలు అందించారు. అరుదైన ఖనిజాలు, అయస్కాంత పదార్థాలు, నానో మెటీరియల్స్, బ్యాటరీలు, సూపర్ కెపాసిటర్లు, సోలార్ సెల్స్, హైడ్రోజన్ ఇంధనం, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే సాంకేతికతలపై సదస్సులో చర్చిస్తున్నారు. రష్యా, జపాన్, ఇజ్రాయెల్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 400 మంది పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కృష్ణ, నవంబర్ 4 (జనం సాక్షి) : కృష్ణ మండలం రైల్వే ట్రాక్ సమీపంలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వ్యక్తి బ్లూ కలర్ షర్టు, బ్లాక్ పాయింటు ధరించి ఉన్నాడు వ్యక్తిని ఎవరికైనా తెలిస్తే కృష్ణ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712671023కు కాల్ చేసి చెప్పాలని ఎస్ఐ నవీద్ తెలిపారు.

హబ్సిగూడలో టెక్-వర్స్ 2026కు సాంకేతిక రోడ్‌షో

- స్వదేశీ ఆవిష్కరణలకు ప్రోత్సాహం..
- ఏఐ, క్వాంటం టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీపై నిపుణుల చర్చలు
- నవంబర్ 26, 27 తేదీల్లో చెన్నైలో టెక్-వర్స్ 2026 నిర్వహణ

ఉప్పల్/హబ్సిగూడ, నవంబర్ 4 (జనం సాక్షి) : దేశీయ సాంకేతిక ఆవిష్కరణలకు మరింత ప్రోత్సాహం కల్పించడంతో పాటు, పరిశోధనా సంస్థలు, పరిశ్రమలు, విద్యాసంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా హబ్సిగూడలోని సీఎస్ఐఆర్-నేషనల్ జియోఫిజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్‌జీఆర్ఐ)లో బుధవారం టెక్నాలజీ రోడ్‌షో నిర్వహించారు. సీ-డాక్, సమీర్, సీ-మెట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దేశీయంగా అభివృద్ధి చేసిన వినూత్న సాంకేతికతలు, ఉత్పత్తులు, పరిశోధనా ఫలితాలను ప్రదర్శించారు. నవంబర్ 26, 27 తేదీల్లో చెన్నైలోని చెన్నై ట్రేడ్ సెంటర్‌లో జరగనున్న టెక్-వర్స్ 2026కు ముందస్తు సన్నాహకంగా ఈ రోడ్‌షోను ఏర్పాటు చేశారు. ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక రంగాల్లో భారతదేశం సాధిస్తున్న పురోగతిని వివరించడంతో పాటు, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమలకు, విద్యాసంస్థలకు మరింత చేరువ చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సీ-డాక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ మూర్తి మాట్లాడుతూ, టెక్-వర్స్ 2026లో భాగంగా నిర్వహిస్తున్న రోడ్‌షోకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పరిశోధనా సంస్థల్లో అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశ్రమలతో అనుసంధానం చేయడం ద్వారా వాటిని విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావచ్చని తెలిపారు. పరిశోధన, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలకు పరిశ్రమలు, విద్యాసంస్థల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ శాస్త్రవేత్త జీ, ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ హెచ్‌వీఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ సీఎస్ఐఆర్-ఎన్‌జీఆర్ఐ, సీ-డాక్ మధ్య కొనసాగుతున్న పరిశోధన, అభివృద్ధి సహకారాలను వివరించారు. వివిధ రంగాలకు చెందిన నిపుణులు సమన్వయంతో పనిచేయడం ద్వారా సాంకేతిక అభివృద్ధిలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి మోస్‌చిప్ టెక్నాలజీస్ లిమిటెడ్ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాస, ఐఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ సందీప్ కుమార్ శుక్లా గౌరవ అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన సీ-డాక్, సీ-మెట్, విశాఖపట్నానికి చెందిన సమీర్ సంస్థల ప్రతినిధులు తమ పరిశోధనా కార్యక్రమాలు, స్వదేశీ సాంకేతికతలు, ఉత్పత్తులు, సేవలు, వినూత్న పరిష్కారాలపై ప్రత్యేక ప్రజెంటేషన్లు ఇచ్చారు. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ, భారతదేశానికి క్వాంటం టెక్నాలజీల ద్వారా కలిగే అవకాశాలు,



ఎదురయ్యే సవాళ్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలపై రెండు సమాంతర సమావేశాలు నిర్వహించారు.

స్వదేశీ సాంకేతికతల ప్రత్యేక ప్రదర్శన

రోడ్‌షోలో భాగంగా సీ-డాక్, సీ-మెట్, సమీర్ సంస్థలు అభివృద్ధి చేసిన వినూత్న ఉత్పత్తులు, సాంకేతికతలు, పరిష్కారాలతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న పరిశ్రమల ప్రతినిధులు, పరిశోధకులు, విద్యార్థులు సాంకేతికతలను ప్రత్యక్షంగా పరిశీలించి వాటి వినియోగం, సామర్థ్యం గురించి నిపుణులను అడిగి తెలుసుకున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
05 నవంబర్ 2026

ఒలింపిక్స్‌లో పతకాల సాధనే తెలంగాణ క్రీడాకారుల లక్ష్యం కావాలి

క్రీడలు టైమ్‌పాస్ కోసం కాదు.. ప్రపంచం మనవైపు చూసేలా ఆడాలి: మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్ (జనంసాక్షి) : క్రీడలు కేవలం టైమ్‌పాస్ కోసం ఆడేవి కావని, ప్రపంచ వేదికపై దేశ కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పేలా క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో పునర్నిర్మించిన టెన్నిస్ కాంప్లెక్స్‌ను మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో క్రీడారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల కల్పన, శిక్షణ కోసం ప్రభుత్వం దాదాపు రూ.800 కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడా పోటీల్లో 29 రాష్ట్రాల నుంచి దాదాపు 7 వేల మంది క్రీడాకారులు పాల్గొననున్నారని మంత్రి తెలిపారు. ఇంతటి ప్రతిష్ఠాత్మక క్రీడా పోటీలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చే అవకాశం కల్పించిన ముఖ్య మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ పోటీలు రాష్ట్ర క్రీడారంగానికి మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు యువ క్రీడాకారులకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ రెండో ఎడిషన్‌ను విజయవంతంగా నిర్వహించామని మంత్రి వివరించారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు సరైన అవకాశాలు, నాణ్యమైన శిక్షణ, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచిన క్రీడాకారులను ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలతో సత్కరించిందని తెలిపారు. ప్రముఖ క్రీడాకారిణి నిఖత్ జరీన్, క్రికెటర్ మహమ్మద్ సిరాజ్‌లకు డీఎస్పీ ఉద్యోగాలు కల్పించి క్రీడాకారులను గౌరవించామని గుర్తుచేశారు. మనకంటే చిన్న దేశమైన దక్షిణ కొరియా ఒలింపిక్స్‌లో విశేషమైన పతకాలు సాధిస్తోందని, ఈ విషయంలో భారత్ ఇంకా ఎంతో పురోగతి సాధించాల్సి ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాకారులు తమ లక్ష్యాలను చిన్నవిగా నిర్దేశించుకోవద్దని, నిరంతర సాధన, క్రమశిక్షణ, పట్టుదలతో ప్రపంచ స్థాయి పోటీలకు సిద్ధం కావాలని సూచించారు. క్రీడలు టైమ్‌పాస్ కోసం ఆడకండి.. ప్రపంచం మీ వైపు చూసేలా ఆడండని,మీ ప్రతిభతో అంతర్జాతీయ వేదికలపై తెలంగాణ జెండాను రెపరెపలాడించాలన్నారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలవండని మంత్రి వాకిటి శ్రీహరి క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపారు. ఒలింపిక్స్‌లో పతకాల సాధనే లక్ష్యంగా తెలంగాణ క్రీడాకారులు కఠోర సాధనతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. క్రీడారంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో పతకాల పంట పండించే క్రీడాకారులను తయారు చేయడమే ప్రభుత్వ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు.

4 నెలలుగా ఫోన్ లేదు.. ఆచూకీ తెలియదు

రష్యా వెళ్లిన పర్షరాములు భార్యాపిల్లల్లో ఆందోళన

- బతికున్నాడో.. ప్రాణాలు కోల్పోయాడో అంటూ కన్నీటిపర్యంతం
- స్వదేశానికి రప్పించాలని భార్య వేడుకోలు





సిరిసిల్ల (జనంసాక్షి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం బొల్లారం గ్రామానికి చెందిన గోనెల పర్షరాములు ఉపాధి కోసం రష్యా వెళ్లి, ప్రస్తుతం రష్యా ఆర్మీలో చిక్కుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్షరాములు ఈ ఏడాది జనవరిలో ఉపాధి కోసం ఓ ప్రైవేట్ ఏజెంట్ ద్వారా రష్యా వెళ్లాడు. రష్యా వెళ్లిన తొలినాళ్లలో కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన పర్షరాములు గత నాలుగు నెలలుగా ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గార్డెనింగ్ పని పేరుతో తీసుకెళ్లిన పర్షరాములును రష్యా ఆర్మీలో చేర్చుకుని, రష్యా–ఉక్రెయిన్ యుద్ధ ప్రాంతానికి పంపించినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందినట్లు తెలుస్తోంది. దీంతో ఆయన భార్య, పిల్లలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. తన భర్తను మోసపూరితంగా రష్యా ఆర్మీలో చేర్చుకున్నారని పర్షరాములు భార్య ఆరోపిస్తున్నారు. తన భర్త క్షేమంగా ఉన్నాడో లేదో తెలియక కుటుంబం తీవ్ర మనోవేదనకు గురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి భారత విదేశాంగ శాఖ ద్వారా తన భర్త ఆచూకీ తెలుసుకోవాలని, ఆయనను సురక్షితంగా భారతదేశానికి రప్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె వేడుకుంటున్నారు. తన భర్త తిరిగి స్వదేశానికి చేరేలా ప్రభుత్వం చొరవ తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని కన్నీటిపర్యంతమవుతున్నారు.



తన భర్తను రప్పించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి విన్నవిస్తున్న దృశ్యం

క్రెడిట్ కార్డుల అప్పుల భారం..

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య



సంగారెడ్డి, నవంబర్ 4 (జనం సాక్షి): క్రెడిట్ కార్డుల ద్వారా చేసిన అప్పుల భారం భరించలేక ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్యకు పాల్పడిన విషాద ఘటన సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని రాఘవేంద్ర నగర్ కాలనీలో చోటుచేసుకుంది. కొండాపూర్ ఎస్సై సోమేశ్వరి కథనం ప్రకారం.. రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మంగలి వీరేశం (33) క్రెడిట్ కార్డుల ద్వారా చేసిన అప్పులతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో అప్పుల బాధను తట్టుకోలేక నవంబర్ 4న తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మంగలి రామచందర్ కొండాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై సోమేశ్వరి తెలిపారు.

అంకితభావంతో ఎన్నో సేవలందించారు

చక్రపాణి మరణంపై సీఎం రేవంత్‌రెడ్డి విచారం



హైదరాబాద్ (జనంసాక్షి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనమండలి మాజీ చైర్మన్ డాక్టర్ ఏ. చక్రపాణి మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలిని పునరుద్ధరించిన అనంతరం తొలి చైర్మన్‌గా డాక్టర్ చక్రపాణి ఎంతో నిబద్ధతతో పనిచేశారని గుర్తుచేసుకున్నారు. పార్లమెంటరీ సంప్రదాయాల పట్ల అపారమైన గౌరవం కలిగిన చక్రపాణి గారు చైర్మన్‌గా నిష్పక్షపాతంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దాదాపు ఐదు దశాబ్దాల ప్రజా జీవితంలో అంకితభావంతో ఆయన ఎన్నో సేవలందించారని కొనియాడారు. డాక్టర్ చక్రపాణి గారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటూ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.

నివాళులర్పించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఆంధ్రప్రదేశ్ శాసన మండలి మాజీ చైర్మన్ ఏ. చక్రపాణి మృతి పట్ల తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. బంజారా హిల్స్‌లోని లోటస్‌పాండ్‌లో ఉన్న చక్రపాణి నివాసానికి వెళ్లిన ఉప ముఖ్యమంత్రి, ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రపాణితో తనకున్న అనుబంధాన్ని ఆయన కుటుంబ సభ్యులతో గుర్తుచేసుకున్నారు. చక్రపాణి మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తూ, వారికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. దివంగత నేత ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు..

రైస్ మిల్లుల్లో రేషన్ బియ్యం

150 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

- కొత్త సంచుల్లో ప్యాకింగ్ చేసి 28 బ్రాండ్లతో విక్రయాలు
- రాజకీయ ఒత్తిళ్లు వచ్చినా ఆగని విజిలెన్స్ దాడులు

రంగారెడ్డి, నవంబర్ 4 (జనంసాక్షి): రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంపై విజిలెన్స్, పౌరసరఫరాల అధికారులు కొరడా ఝళిపించారు. రెండో రోజు రంగారెడ్డి జిల్లాలోని రైస్ మిల్లులపై మూడు ప్రత్యేక బృందాలతో మెరుపు దాడులు నిర్వహించారు. మంచాల మండలంలోని రాఘవేంద్ర రైస్ మిల్లులో 150 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడలోని గణేష్ ఆగ్రో ఇండస్ట్రీస్‌లోనూ రేషన్ బియ్యం పట్టుబడింది.

కొత్త సంచుల్లో పాత బియ్యం..

విజిలెన్స్ ఎస్పీ రామ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కొత్త సంచుల్లో నింపి 28 రకాల బ్రాండ్ల పేర్లతో మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మిల్లులో 200కు పైగా సీఎంఆర్ గన్నీ సంచులతో పాటు, పక్కనే ఉన్న మూడు ప్రైవేటు షెడ్లలో 50 కిలోల సామర్థ్యం కలిగిన 92 బస్తాల బియ్యాన్ని గుర్తించి సీజ్ చేశారు.

రాజకీయ ఒత్తిళ్లపై ఆరోపణలు..

మిల్లుపై దాడుల సమయంలో నల్లగొండ జిల్లాకు చెందిన ఓ మంత్రి వ్యక్తిగత కార్యదర్శి అధికారులకు ఫోన్ చేసి ఒత్తిడి తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, రాఘవేంద్ర రైస్ మిల్లుకు లైసెన్స్, కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు సహా ఎలాంటి పత్రాలు లేవని విజిలెన్స్ ఎస్పీ రామ్‌కుమార్ వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన ఆధారాలు కూడా లభించలేదన్నారు. మిల్లును సీజ్ చేసి క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డీఎస్‌వో వనజాతకు సూచించారు. అక్రమ బియ్యం వ్యాపారం వెనుక ఉన్న సూత్రధారులను వెలికితీస్తామని, కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు

నెన్నెల, నవంబర్ 4 (జనంసాక్షి) : నెన్నెల మండలం ఖర్జీ గ్రామంలో బుధవారం గంజాయి సాగు చేస్తున్న కోట సత్తయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు నెన్నెల ఎస్సై జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఖర్జీ గ్రామంలో కోట సత్తయ్య అనే వ్యక్తి గంజాయి సాగు చేస్తున్నాడని నమ్మదగిన సమాచారం మేరకు వెళ్లి తనిఖీ చేయగా కోట సత్తయ్య అను వ్యక్తి తన ఇంటి ఆవరణలో నాలుగు గంజాయి మొక్కలను సాగు చేస్తున్నాడు. వెంటనే ఏఈఓ తిరుపతి, పంచాయతీ సెక్రెటరీ దేవేందర్, జిపిఓ ప్రసన్నకుమార్ పోలీస్ సిబ్బంది పంచనామ నిర్వహించారని వివరించారు. ఆట్టి నాలుగు మొక్కలు మొత్తం విలువ 40000 రూపాయలు ఉంటుందని, వాటిని స్వాధీనం చేసుకొని కోట సత్తయ్య అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ విజయ్, కానిస్టేబుళ్లు ప్రసాద్, వంశీ, హోంగార్డ్ రామరాజు పాల్గొన్నారు.

స్పా ముసుగులో వ్యభిచార గృహం

మహిళకు విముక్తి.. ఇద్దరు కస్టమర్లకు నోటీసులు

- నిర్వాహకురాలు అరెస్ట్

అమీర్‌పేట్ / పంజాగుట్ట (జనంసాక్షి) : బ్యూటీ సెలూన్, స్పా ముసుగులో అక్రమంగా వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్న కేంద్రంపై పంజాగుట్ట పోలీసులు దాడి చేసి ప్రధాన నిర్వాహకురాలిని అరెస్టు చేశారు. ఈ ఘటనలో ఒక మహిళను రక్షించడంతో పాటు ఇద్దరు కస్టమర్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆరు సెల్‌ఫోన్లు, కార్డు స్వైపింగ్ యంత్రం, ఉపయోగించిన మరియు ఉపయోగించని కండోమ్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. పంజాగుట్టలోని నాగార్జున సర్కిల్, గంగా ఎస్టేట్, శ్రీ అమృత వైన్ మార్ట్ సమీపంలోని ఓ భవనంలో సన్నెలోయిన నాగమణి అనే మహిళ 2026 జనవరిలో ప్రవీణ్ గౌడ్ నుంచి అద్దెకు తీసుకుని 'సన్‌రైజ్ బ్యూటీ సెలూన్ అండ్ స్పా' పేరుతో కేంద్రాన్ని ప్రారంభించింది. ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తూ మసాజ్ సేవల కోసం మహిళలను నెలవారీ జీతంపై పనిలోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వారిని బెదిరించి బలవంతంగా వ్యభిచారంలోకి దించినట్లు పేర్కొన్నారు. ఒక్కో కస్టమర్ నుంచి రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు నవంబర్ 3వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో ఇన్‌స్పెక్టర్ ఈ. జహంగీర్ యాదవ్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ బాధిత మహిళను రక్షించి, ప్రధాన నిర్వాహకురాలు నాగమణిని అరెస్టు చేశారు. కస్టమర్లుగా వచ్చిన షేక్ ముజాహిద్, మహమ్మద్ సోహైల్ సికిందర్‌లకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేశారు. అరెస్టయిన నాగమణిని నాంపల్లిలోని 14వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచి, న్యాయ రిమాండ్‌కు తరలించాలని కోరారు. రక్షించిన మహిళను పునరావాసం నిమిత్తం కోర్టు ఆదేశాల మేరకు మహిళల రెస్క్యూ హోమ్‌కు పంపించారు. ఈ కేసులో భవన యజమాని ప్రావీణ్ గౌడ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. కేసు వివరాలు: క్రైమ్ నంబర్ 793/2026, బీఎన్ఎస్ సెక్షన్లు 143(2), 144(2), పీఐటీ చట్టం 1956లోని సెక్షన్లు 3, 4, 5 కింద కేసు నమోదు చేశారు.

ఆకాశంలో కనువిందు చేస్తున్న సంధ్యా సోయగం



గోవిందరావుపేట నవంబర్ 04(జనం సాక్షి) : మండలంలో పసర గ్రామ సమీపాన సాయంత్రం వేళ ఆకాశంలో ఆవిష్కృతమైన అద్భుత దృశ్యం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. సూర్యాస్త మయ వేళ మేఘాల మధ్య విరిసిన రంగుల హరివిల్లు వంటి దృశ్యాలు చూపరులను మంత్ర ముగ్ధులను చేశాయి.ప్రకృతి ఒడిలో సాయంత్రం వేళ ఆవిష్కృతమైన ఈ అద్భుత దృశ్యం ఆహ్లాదాన్ని పంచుతూ అందరినీ ఆకట్టుకుంది.

గంగకత్వ వంతెనపై భారీ రంధ్రం

- 65వ జాతీయ రహదారిపై ఘటన



సదాశివపేట, నవంబర్ 4 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా సదాశివపేట 65వ జాతీయ రహదారి పరిధిలోని గంగకత్వ వంతెనపై రంధ్రం ఏర్పడి, వంతెన కంపిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీ సత్తయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. హైదరాబాద్–ముంబై జాతీయ రహదారి కావడంతో నిత్యం వేలాది వాహనాలు గంగకత్వ బ్రిడ్జ్ పైనుంచి వెళ్తుంటాయి. చిన్న వాహనాలతో పాటు పెద్దపెద్ద కంటైనర్లు ఈ బ్రిడ్జిపై నుంచి రోజు వెళ్తుండడంతో బ్రిడ్జి పైన ఏ ప్రమాదం జరిగిన ప్రాణ నష్ జరిగే అవకాశం ఉంది. హనదారులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా పోలీసు సిబ్బందితో కలిసి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టారు. వంతెనపై ప్రయాణించే వాహనదారులను అప్రమత్తం చేస్తూ, ప్రమాదాలు చోటుచేసుకోకుండా సిబ్బందితో నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

సున్నం చెరువును సందర్శించిన సైబరాబాద్ సీపీ



శేరిలింగంపల్లి, నవంబర్ 04 (జనంసాక్షి) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గ పర్యటన నేపథ్యంలో బుధవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఎం. రమేష్ మాదాపూర్ సర్కిల్ పరిధి సున్నం చెరువు, తమ్మిడికుంట చెరువులను ప్రత్యేకంగా సందర్శించి ఆయా చెరువులవద్ద ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ ప్రాంతాలలో పర్యటించనున్న సందర్భంగా ఏర్పడిన ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని సైబరాబాద్ పోలీస్ బాస్ భద్రతాచర్యల నిమిత్తం రెండు చెరువులవద్ద కొనసాగుతున్న ఏర్పాట్లను సమీక్షించడం గమనార్హం. కమిషనర్ వెంట కూకట్‌పల్లి జోన్ డిసిపి రితిరాజ్, మాదాపూర్ డివిజన్ ఎసిపి సిహెచ్. శ్రీధర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, పి. రమేష్, ఇతర ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలను పరిశీలించిన ఉన్నతాధికారులు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ, ఇతర అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. అన్ని శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా చూసుకోవాలని, ముఖ్యమంత్రి పర్యటన సజావుగా, సురక్షితంగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత పోలీసు సిబ్బందికి, ఇతర ఉన్నత అధికారులకు సిపి డా. ఎం. రమేష్ ఆదేశాలు జారీచేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370